www.andhrajyothy.com

# ఆంధ్రజ్యోతి

ANDHRAJYOTHI

ఆదివారం | 8-3-2020 | పేజీలు: 14 + 16 + 32 పేజీల ఆదివారం అనుబంధం | వెల (Price) : Rs. 8.00 | సంపుటి (Volume) : 60 సంచిక (Issue) : 323

శ్రీవికారినామ సంవత్సరం, ఉత్తరాయణం, శిశిరరుతువు, ఫాల్గుణమాసం, శుక్లపక్షం; తిథి: చతుర్దశి రా. 3.04 తదుపరి పౌర్ణమి; నక్షత్రం: ఆశ్లేష ఉ. 6.53 తదుపరి మఖ తె. 4.10; వర్జ్యం: సా. 5.31-6.56; దుర్ముహూర్తం: సా. 4.46-5.33; అమృతఘడియలు: శే. ఉ. 6.54, రా. 2.02-3.27; రాహుకాలం: సా. 4.30-6.00; సూర్యోదయం: 6.33; సూర్యాస్తమయం: 6.21 | విజయవాడ సిటీ*

Vijayawada | Hyderabad | Mahaboobnagar | Tirupathi | Visakhapatnam | Anantapur | Karimnagar | Tadepalligudem | Warangal | Guntur | Kurnool | Nellore | Srikakulam | Rajamahendravaram | Khammam | Kadapa | Ongole | Nallagonda | Nizamabad and Bangalore












# ఆకాశమే హద్దు.. అవకాశం వదలొద్దు

**మధ్యాహ్నం 12.30 నుంచి స్టార్‌స్పోర్ట్స్ 1,2, దూరదర్శన్‌లలో**

**ముగింపోత్సవం (కేటీ పెర్రీ షో) మధ్యాహ్నం 12 గం. మళ్లీ మ్యాచ్ అనంతరం**

### వర్షం వస్తే..

సెమీస్ తరహాలో కాకుండా ఫైనల్‌కు రిజర్వ్ డే ఉంది. ఒకవేళ రిజర్వ్‌డే రోజు కూడా మ్యాచ్ జరిగే పరిస్థితి లేకపోతే ఇరుజట్లనూ సంయుక్తంగా విజేతలుగా ప్రకటిస్తారు.

### టై అయితే...

ఫైనల్ మ్యాచ్‌లో స్కోర్లు సమమైతే సూపర్ ఓవర్ ద్వారా విజేతను నిర్ణయిస్తారు. సూపర్ ఓవర్ కూడా టై అయితే.. మరో సూపర్ ఓవర్ నిర్వహిస్తారు. ఇలా ఫలితం తేలే వరకు సూపర్ ఓవర్లను కొనసాగిస్తారు. ఒక సూపర్ ఓవర్‌లో బ్యాట్స్‌వుమన్ అవుటైతే.. ఆమె మరో సూపర్ ఓవర్‌లో ఆడడానికి వీలులేదు. అలాగే ఒక బౌలర్ వరుసగా రెండు సూపర్ ఓవర్లు వేయడానికీ అనుమతించరు. ఒక వేళ స్కోర్లు టై అయిన తర్వాత వర్షం కురిసి సూపర్ ఓవర్ నిర్వహించలేకపోతే ఇరు జట్లనూ సంయుక్త విజేతలుగా ప్రకటిస్తారు.

### ప్రైజ్‌మనీ..

*2018తో పోల్చుకుంటే ప్రైజ్ మనీ మొత్తం ఐదు రెట్లు పెరిగింది. విజేత జట్టుకు రూ. 7.40 కోట్లు, రన్నరప్ టీమ్‌కు రూ. 3.70 కోట్లు లభిస్తాయి.*

**1** ఓపెనర్ షఫాలీ వర్మ మరో 67 పరుగులు చేస్తే భారత్ నుంచి టీ20 ప్రపంచకప్‌లో అత్యధిక స్కోరు సాధించిన ప్లేయర్‌గా గంభీర్ (227, 2007 టోర్నీలో)ను అధిగమిస్తుంది.

**21** ఐసీసీ మెగా టోర్నీల్లో ఆసీస్ మహిళల జట్టు 23 నాకౌట్ మ్యాచ్‌ల్లో 21 సార్లు గెలవగా.. భారత్ మాత్రం 10 నాకౌట్‌లలో మూడింట్లోనే నెగ్గింది.



కేటీ పెర్రీ

## ఆత్మవిశ్వాసంతో భారత్

## ఫైనల్లో ఆసీస్‌తో అమీతుమీ

## మహిళల టీ20 ప్రపంచకప్

**2017 వన్డే వరల్డ్‌కప్.. ఏ మాత్రం అంచనాల్లేకున్నా అద్భుత ఆటతీరుతో భారత మహిళల జట్టు ఏకంగా ఫైనల్‌కు చేరింది. కానీ కీలక పోరులో తడబడింది..**

**2018 టీ20 ప్రపంచకప్.. ఒక్క ఓటమి లేకుండా సెమీస్ దాకా చేరినా మళ్లీ అదే నిరాశ..**

**2020 టీ20 ప్రపంచకప్.. ఈసారీ అంచనాలకు మించిన ఆటతో అజేయంగా నిలిచి తొలిసారి తుదిపోరుకు చేరింది. ఐసీసీ టోర్నీల్లో ఈ తడబాటుకు స్వస్తి పలికేందుకు మరో మమమమహత్తర అవకాశం.. ఇక ఒకే మ్యాచ్.. ఎన్నో అవమానాలను తట్టుకుంటూ భారత మహిళల క్రికెట్ జట్టు సాధించిన అద్భుత పురోగతికి నిదర్శనం ఈ ప్రస్థానం. ఇక మిగిలిందల్లా.. ఒత్తిడిని దరి చేరనీయకుండా ఈ అసలైన మ్యాచ్‌లో ఆసీస్‌పై స్థాయికి తగ్గ ప్రదర్శన చేయడమే.. అటు చాంపియన్‌గా నిలిస్తే దేశంలో మహిళల క్రికెట్ తలరాతే మారుతుందనడంలో సందేహం లేదు. అందుకే సరిగ్గా అంతర్జాతీయ మహిళా దినోత్సవం రోజున జరిగే ఈ మ్యాచ్‌లో మన అమ్మాయిలు సగర్వంగా త్రివర్ణ పతకాన్ని రెపరెపలాడించాలని కోరుకుందాం..**



**మహిళా దినోత్సవ శుభాకాంక్షలు**

**మెల్‌బోర్న్:** నాలుగు సార్లు ప్రపంచ చాంపియన్‌గా నిలిచిన ఆసీస్ జట్టు ఓవైపు.. మూడుసార్లు సెమీస్‌తో సరిపెట్టుకుని తొలిసారి ఫైనల్లోకి అడుగుపెట్టిన భారత జట్టు మరోవైపు.. ఆదివారం మెల్‌బోర్న్ క్రికెట్ మైదానంలో జరిగే ప్రతిష్ఠాత్మక టీ20 ప్రపంచకప్ ఫైనల్ దృశ్యమిది. ఐదో టైటిల్‌తో ప్రపంచ క్రికెట్‌లో తమ ఆధిపత్యానికి తిరుగులేదని ఆతిథ్య జట్టు నిరూపించుకోవాలనుకుంటోంది. సొంతగడ్డపై భారీ ప్రేక్షకుల మధ్య ఈ కీలక మ్యాచ్ ఆడడం వారికి కలిసివచ్చే అంశం. అయితేనేం.. సమష్టి పోరాటమే తోడుగా పటిష్ఠ జట్లపై గెలుస్తూ ఇక్కడిదాకా వచ్చిన భారత మహిళలు ఏమాత్రం వెనక్కి తగ్గడం లేదు. సై అంటే సై అనేందుకు సిద్ధమవుతున్నారు. గత ఎనిమిది రోజులుగా ఆటకు దూరంగా ఉన్న భారత ప్లేయర్స్ బ్యాటింగ్‌లో లోపాలు సరిచేసుకుని చాంపియన్‌గా నిలిచి చరిత్ర సృష్టించాలనుకుంటున్నారు. అంతేకాకుండా తొలి మ్యాచ్‌లో ఆసీస్‌ను దెబ్బతీయడం భారత శిబిరంలో ఆత్మవిశ్వాసాన్ని పెంచినట్టయింది.

### షఫాలీ అండగా ఉన్నా...

భారత జట్టు ఫైనల్ దాకా చేరిందంటే ఓపెనర్ షఫాలీ వర్మ బ్యాటింగ్ చేసిన విధానమే కారణం. ఆరంభంలోనే బౌలర్లపై విరుచుకుపడుతూ 16 ఏళ్ల వయస్సులో ఆమె చూపిస్తున్న తెగువ ప్రపంచ క్రికెట్‌లో ప్రకంపనలు సృష్టిస్తోంది. ఇప్పుడు ఫైనల్లోనూ ఆమే భారత జట్టు ప్రధాన ఆయుధం. టోర్నీ జరుగుతున్న సమయంలోనే ఈ ఫార్మాట్‌లో నెంబర్‌వన్ స్థానానికి చేరిన ఈ చిచ్చరపిడుగు తుది పోరులోనూ మెరుపు ఆరంభాన్ని అందించాలని జట్టు కోరుకుంటోంది. ఒకవేళ ఆమె బ్యాట్ ఝుళిపించకపోతే పరిస్థితి ఏమిటి? అనే ప్రశ్న కూడా అభిమానుల్లో ఆందోళన రేపుతోంది. ఎందుకంటే స్టార్ ఓపెనర్ స్మృతి మంధాన, హర్మన్‌ప్రీత్ ఈ టోర్నీలో ఏమాత్రం ప్రభావం చూపలేదు. షఫాలీ మాత్రం ఆడిన నాలుగు మ్యాచ్‌ల్లో తుపాను ఇన్నింగ్స్‌తో 161 పరుగులు సాధించింది. ఆమె స్ట్రయిక్ రేట్ చూస్తే ఆసీస్ బౌలర్లకు వణుకుపుడుతోంది. అయితే టైటిల్ గెలవాలంటే షఫాలీ మాత్రమే ఆడితే సరిపోదు. ఫైనల్లో మంధాన, కౌర్ బ్యాట్లు గర్జించాల్సిందే. 2018 మెగా టోర్నీ తరహాలో ఈ జోడీ కనుక చెలరేగితే భారత అవకాశాలు రెట్టింపవుతాయి.

### పూనమ్ కీలకం

ఇక బౌలింగ్ విభాగం సూపర్ ఫామ్‌లో ఉండడం కలిసివచ్చే అంశం. జట్టు ఒక్కసారి కూడా 150కి పైగా పరుగులు సాధించకున్నా అజేయంగా నిలిచిందంటే అది బౌలర్ల పుణ్యమే. లెగ్గీ పూనమ్ యాదవ్ ఇప్పటికే 9 వికెట్లతో టోర్నీ టాపర్‌గా ఉంది. ఆరంభ మ్యాచ్‌లో బ్యాట్స్‌వుమన్ విఫలమై తక్కువ స్కోరే చేసినా పూనమ్ 4 వికెట్లతో ఆసీస్‌కు షాక్ ఇవ్వగలిగింది. ఇప్పుడు ఈ మ్యాచ్‌లో పూనమ్ బంతులను ఎదుర్కొనేందుకు ఆసీస్ ప్రత్యేక వ్యూహాలు రచిస్తోంది. లెఫ్టామ్ స్పిన్నర్లు రాధా యాదవ్, రాజేశ్వరి, పేసర్ శిఖాపాండే కూడా ప్రభావం చూపిస్తున్నారు.

### ప్రతీకారం కోసం

ఏడుసార్లు ప్రపంచకప్ జరిగితే ఆరుసార్లు ఫైనల్‌కు చేరిన ఆసీస్ ఇప్పుడు ప్రతీకారంతో రగులుతోంది. ఆరంభ మ్యాచ్‌లో భారత్‌ను స్వల్ప స్కోరుకే కట్టడిచేసినా స్పిన్ ఉచ్చులో పడి చిత్తయింది. ఆ తర్వాత మరో పరాజయం లేకుండా ఫైనల్‌కు చేరింది. ఇప్పుడు భారత్‌పై బదులు తీర్చుకునే సమయం వచ్చిందని ఆసీస్ భావిస్తోంది. స్టార్ ఆల్‌రౌండర్ ఎలిస్ పెర్రీ జట్టుకు దూరమైనా ఆసీస్ ఫైనల్ చేరగలిగింది. ప్రపంచ అత్యుత్తమ క్రీడాకారిణులతో కూడిన జట్టు ఇది. అందుకే మరోసారి భారత్‌కు అవకాశం ఇవ్వకూడదన్న పట్టుదలతో ఉంది. మెగ్ లానింగ్, అలీసా హీలీ, బెత్ మూనీ, గార్డ్‌నర్‌లతో బ్యాటింగ్ విభాగం బలంగా ఉండగా, బౌలర్లు జొనాసెన్, షట్, కేరీ సత్తా చూపిస్తున్నారు.

### టీ-20 ప్రపంచకప్‌లలో ఎవరెలా?

| ఏడాది | భారత్ | ఆస్ట్రేలియా |
|---|---|---|
| 2009 | సెమీఫైనలిస్ట్ | సెమీఫైనలిస్ట్ |
| 2010 | సెమీఫైనలిస్ట్ | విజేత |
| 2012 | గ్రూప్ దశ | విజేత |
| 2014 | గ్రూప్ దశ | విజేత |
| 2016 | గ్రూప్ దశ | రన్నరప్ |
| 2018 | సెమీఫైనల్ | విజేత |

### పిచ్, వాతావరణం

మెల్‌బోర్న్‌లో ఆదివారం వాతావరణం మ్యాచ్‌కు అనుకూలంగా ఉంది. వర్షం కురిసే అవకాశం లేదు. అయితే రెండు వారాల నుంచి ఎంసీజీలో ఒక్క మ్యాచ్ కూడా జరగలేదు. ఈ వికెట్ బంతికి బ్యాట్‌కు సమానంగా అనుకూలించనుంది. ఆరంభంలో మాత్రం బౌలర్లు ప్రభావం చూపిస్తారు. ఆ తర్వాత మాత్రం బ్యాటర్స్‌కు పండగే..



### ప్రధాని మోదీ శుభాకాంక్షలు

మహిళా దినోత్సవ శుభాకాంక్షలు. ఈరోజు భారత్-ఆస్ట్రేలియా జట్ల మధ్య ఫైనల్ కంటే విశేషమైనది మరొకటి లేదు. రెండు జట్ల మహిళలకు బెస్ట్ విషెస్.

### మ్యాచ్‌కు ముందే కిక్కు!

భారత్-ఆస్ట్రేలియా ఫైనల్ మ్యాచ్ ఆరంభానికి ముందే అభిమానులకు ఉర్రూతలూగించేందుకు అమెరికన్ పాప్ సింగర్ కేటీ పెర్రీ సిద్ధమవుతోంది. ఆదివారం అంతర్జాతీయ మహిళా దినోత్సవం కావడంతో.. క్రికెట్ ఆస్ట్రేలియా ఈ షోను ప్రత్యేకంగా ఏర్పాటు చేసింది. మ్యాచ్‌కు అరగంట ముందు.. మధ్యాహ్నం 12 గంటలకు ఆమె షో మొదలవుతుంది. ఆతర్వాత మ్యాచ్ పూర్తయ్యాక తిరిగి కొనసాగుతుంది. మరోవైపు హర్మన్‌ప్రీత్ కౌర్ సేనను కూడా పెర్రీ కలుసుకుంది. శనివారం భారత జట్టు ప్రాక్టీస్ చేస్తున్న సమయంలో ఎంసీజీకి వచ్చిన కేటీ.. వారితో చాలాసేపు ముచ్చటించింది. అలాగే తుది జట్టు గురించి పెర్రీ అడిగిన ప్రశ్నకు జెమీమా రోడ్రిగ్స్ చిలిపిగా బదులిచ్చింది. 'నాకు రేపు ఉదయం ఫోన్ చేస్తే ఆ 11 మంది పేర్లు చెబుతా' అని అనడంతో నవ్వులు కురిశాయి.

### ఒక్కో షాట్.. 50 సార్లు ప్రాక్టీస్

టీమిండియా ఓపెనర్ షఫాలీ వర్మ ఈ టోర్నీలో మెరుపు బ్యాటింగ్‌తో అదరగొడుతోంది. జట్టుతో సంబంధం లేకుండా పేసర్, స్పిన్నర్ భేదం లేకుండా క్రీజులోనుంచి ముందుకొచ్చి బౌలర్ల తలమీదుగా అలవోకగా సిక్సర్లు బాదుతోంది. ఆ షాట్లను సునాయాసంగా కొట్టడానికి షఫాలీ ఎంతో శ్రమించిందని ఆమె కోచ్ అశ్వినీకుమార్ చెప్పాడు. రోహ్‌తక్‌లోని శ్రీరామ్ నారాయణ్ క్రికెట్ అకాడమీలో అశ్వినీకుమార్ ఆధ్వర్యంలో షఫాలీ రాటుదేలింది. 'ప్రతీ షాట్ కొట్టేలా ఆమెను తీర్చిదిద్దాం. ప్రాక్టీస్‌లో.. ఒక్కో షాట్‌ను రోజూ 50 సార్లు కొట్టేది. అందుకే వరల్డ్‌కప్‌లో ఆమె సునాయాసంగా భారీ షాట్లు సంధిస్తోంది' అని కుమార్ వివరించాడు.

### జట్లు (అంచనా)

**భారత్:** షఫాలీ వర్మ, స్మృతి మంధాన, జెమీమా రోడ్రిగ్స్, హర్మన్‌ప్రీత్ కౌర్ (కెప్టెన్), దీప్తి శర్మ, వేద కృష్ణమూర్తి, తానియా భాటియా, శిఖా పాండే, రాధా యాదవ్, పూనమ్ యాదవ్, రాజేశ్వరి గైక్వాడ్.

**ఆసీస్:** బెత్ మూనీ, అలీసా హీలీ, మెగ్ లానింగ్ (కెప్టెన్), ఆష్లీ గార్డ్‌నర్, రాచెల్ హేన్స్, జెస్ జొనాసెన్, నికోలా కేరీ, డెలిస్సా కిమ్మిన్స్, జార్జియా వేర్‌హామ్/ మోలీ స్ట్రానో, సోఫీ మోలినెక్స్, మెగాన్ షట్.

### స్పిన్నర్లతో ఆసీస్ ఫుల్ ప్రాక్టీస్

ఆరంభ మ్యాచ్‌లో భారత స్పిన్నర్ల ధాటికి చవిచూసిన దారుణ పరాభవాన్ని ఆసీస్ ఇంకా మరిచిపోలేదు. అందుకే ఈ టైటిల్ పోరులో వారిని సమర్థవంతంగా ఎదుర్కొనేందుకు స్పిన్నర్ల బౌలింగ్‌లో జోరుగా ప్రాక్టీస్ చేసింది. కేవలం పూనమ్ యాదవ్‌పైనే తాము దృష్టి పెట్టలేదని, భారత జట్టులో ఎడమచేతి స్పిన్నర్లు రాధా యాదవ్, రాజేశ్వరి కూడా ఇబ్బందిపెట్టేవారేనని కెప్టెన్ మెగ్ లానింగ్ చెబుతోంది. ఈసారి ఎలాంటి పొరపాట్లకూ తావీయబోమని స్పష్టం చేసింది.



ఆసీస్ కెప్టెన్ మెగ్ లానింగ్



సెహ్వాగ్ (74 నాటౌట్)

## చెలరేగిన సెహ్వాగ్

● ఇండియా లెజెండ్స్ విజయం

**ముంబై:** రోడ్ సేఫ్టీ వరల్డ్ సిరీస్‌లో భాగంగా జరిగిన తొలి మ్యాచ్‌లో ఇండియా లెజెండ్స్ ఏడు వికెట్ల తేడాతో వెస్టిండీస్ లెజెండ్స్‌పై ఘనవిజయం సాధించింది. ఓపెనర్ సెహ్వాగ్ (57 బంతుల్లో 11 ఫోర్లతో 74 నాటౌట్) తనలో ఇంకా అదే దూకుడు ఉందని నిరూపించాడు. అటు సచిన్ (29 బంతుల్లో 7 ఫోర్లతో 36) కూడా రాణించాడు. కిక్కిరిసిన ప్రేక్షకుల మధ్య శనివారం వాంఖడేలో జరిగిన ఈ మ్యాచ్‌లో ముందుగా బ్యాటింగ్‌కు దిగిన వెస్టిండీస్ లెజెండ్స్ 8 వికెట్లకు 150 పరుగులు చేసింది. చందర్‌పాల్ (61) అర్ధసెంచరీ సాధించాడు. ఆతర్వాత ఇండియా లెజెండ్స్ 18.2 ఓవర్లలో 3 వికెట్లకు 151 పరుగులు చేసి నెగ్గింది. ప్లేయర్ ఆఫ్ ద మ్యాచ్‌గా వీరూ నిలిచాడు.

# దాహం తీరింది!

## క్రికెట్‌కు వసీం జాఫర్ అల్విదా

**ముంబై:** టీమిండియా మాజీ ఓపెనర్, 'దేశీయ' దిగ్గజం వసీం జాఫర్ క్రికెట్‌లోని అన్ని ఫార్మాట్లకు శనివారం గుడ్‌బై చెప్పాడు. 1996-97 సీజన్‌తో ప్రారంభమైన అతడి ఫస్ట్‌క్లాస్ కెరీర్ దాదాపు 25 ఏళ్లపాటు సాగింది. ఈ క్రమంలో అతడు ఎన్నో మైలురాళ్లను చేరుకున్నాడు. 42 ఏళ్ల జాఫర్ ప్రతిభ గురించి చెప్పాలంటే మాటలు చాలవు. కుడిచేతి వాటం బ్యాట్స్‌మన్ అయిన జాఫర్ టెక్నిక్ దుర్భేద్యం. గంటలకొద్దీ క్రీజులో పాతుకుపోయి బ్యాటింగ్ చేస్తూ శుభారంభాలు అందించడం వసీంకే చెల్లింది. ఎంతో సీనియర్ అయినా దరిచేరని గర్వం. చాలా కాలం కిందటే అంతర్జాతీయ క్రికెట్ ఆడినా ఇంకా దేశవాళీలో కొనసాగుతూ ఎందరో జూనియర్లకు మార్గదర్శనం చేయడం జాఫర్‌కే సాధ్యమైంది. రంజీల్లో కొనసాగుతూనే మెంటార్‌గా బాధ్యతలు నిర్వర్తించడం క్రికెట్‌పట్ల అతడి నిబద్ధతకు నిదర్శనం. ఆటగాడిగా రంజీట్రోఫీలో అతడి రికార్డులెన్నెన్నో. అత్యధిక మ్యాచ్‌లు (156), అత్యధిక పరుగులు (12,308), అత్యధిక సెంచరీలు (40), అత్యధిక క్యాచ్‌లు (200). ఇంకా దులీప్ ట్రోఫీలో అత్యధిక రన్స్ (2545), ఇరానీ కప్ (1294). అలాగే రంజీట్రోఫీలో రెండుసార్లు వేయి పరుగులు (2008-09, 2018-19) చేసిన ఏకైక బ్యాట్స్‌మన్ కూడా జాఫరే. మొత్తం 10 సార్లు రంజీట్రోఫీ సాధించిన జట్టు సభ్యుడు. అందులో 8 సార్లు ముంబై తరపున అందుకున్నాడు. అందులో రెండుసార్లు ఆ జట్టుకు జాఫర్ కెప్టెన్‌గా ఉన్నాడు. ఇక విదర్భ తరపున రెండుసార్లు కప్ గెలిచాడు. మొత్తంగా 260 ఫస్ట్‌క్లాస్ మ్యాచ్‌ల్లో 19,410 పరుగులు చేశాడు. 31 టెస్టులు ఆడిన జాఫర్ 34.11 సగటుతో 1944 పరుగులు చేశాడు. ఇందులో ఐదు సెంచరీలు, 11 అర్ధసెంచరీలున్నాయి. 212 అత్యధిక స్కోరు. రెండు వన్డేలు కూడా ఆడాడు. 'క్రికెట్‌లో ఎన్నో ఏళ్ల పయనానికి స్వస్తి పలకాల్సిన సమయం ఆసన్నమైంది. కోచ్‌గా, వ్యాఖ్యాతగా మరేదైనా స్థాయిలో రెండో ఇన్నింగ్స్ కొనసాగించేందుకు సిద్ధంగా ఉన్నా' అని జాఫర్ అన్నాడు. ఇటీవలే అతడు కింగ్స్ లెవెన్ పంజాబ్ సహాయ కోచ్‌గా నియమితుడయ్యాడు.



## భారత మహిళల చరిత్ర

**తొలిసారి ప్లేఆఫ్స్‌కు**

**అదరగొట్టిన అంకిత, సానియా**

**దుబాయ్:** ఫెడ్‌కప్‌లో భారత మహిళలు చరిత్ర సృష్టించారు. టోర్నీలో తొలిసారి ప్లేఆఫ్స్ చేరి అదరగొట్టారు. సింగిల్స్, డబుల్స్‌లో రాణించిన అంకితా రైనా జట్టు విజయంలో కీలక పాత్ర పోషించింది. ఆసియా/ఓసియానియా గ్రూప్-1లో శనివారం ఇండోనేసియాతో మ్యాచ్‌లో 1-1తో సమమైన స్థితిలో.. డబుల్స్‌లో సానియా-అంకితా జోడీ 7-6 (4), 6-0తో ప్రిస్కా-అల్దిలాపై నెగ్గి భారత్‌ను 2-1తో గెలిపించింది. మొత్తం ఐదు మ్యాచ్‌ల్లో నాలుగు నెగ్గిన భారత్ మొదటిసారి గ్రూప్ స్టేజ్ దాటింది.

### ఆస్ట్రేలియా వైట్‌వాష్

**పోచెఫ్‌స్ట్రూమ్:** ఆస్ట్రేలియాతో మూడు వన్డేల సిరీస్‌ను ఆతిథ్య దక్షిణాఫ్రికా 3-0తో వైట్‌వాష్ చేసింది. శనివారం జరిగిన ఆఖరి, మూడో వన్డేలో దక్షిణాఫ్రికా 6 వికెట్లతో ఆసీస్‌ను చిత్తు చేసింది. లబుషేన్ (108) కెరీర్ తొలి శతకంతో.. తొలుత బ్యాటింగ్ చేసిన ఆస్ట్రేలియా 7 వికెట్లకు 254 రన్స్ చేసింది. ఛేదనలో దక్షిణాఫ్రికా 45.3 ఓవర్లలో 258/4 స్కోరు చేసి నెగ్గింది. స్మట్స్ (84), క్లాసెన్ (68 నాటౌట్) రాణించారు.

### క్వార్టర్స్‌లో మేరీకోమ్, అమిత్

**అమ్మాన్ (జోర్డాన్):** మేరీ కోమ్, అమిత్ పంగల్ ఆసియా బాక్సింగ్ ఒలింపిక్ క్వాలిఫయర్స్ క్వార్టర్స్‌కు దూసుకెళ్లారు. టోక్యో బెర్త్‌కు వీరిద్దరూ ఒక బౌట్ దూరంలో నిలిచారు. శనివారం జరిగిన మహిళల 51 కిలోల ప్రీక్వార్టర్స్‌లో మేరీ కోమ్ 5-0తో బెన్నీ (న్యూజిలాండ్)ను ఓడించింది. 52 కిలోల్లో పంగల్ 3-2తో ఎంక్‌మందాక్ ఖర్కు (మంగోలియా)పై పోరాడి గెలిచాడు. 57 కిలోల్లో గౌరవ్ పరాజయం పాలయ్యాడు.

### పేస్ జోడీ మెరిసినా..

● 1-3తో ఓడిన భారత్ ● క్రొయేషియాతో డేవిస్ కప్ క్వాలిఫయర్స్

**జాగ్రెబ్:** పేస్ జోడీ భారత్‌ను మ్యాచ్‌లో నిలిపినా.. యువ ఆటగాళ్లు విఫలం కావడంతో పరాజయం తప్పలేదు. డేవిస్‌కప్ క్వాలిఫయర్స్‌లో భారత్ 1-3తో క్రొయేషియా చేతిలో పరాజయం పాలైంది. శనివారం జరిగిన డబుల్స్‌లో లియాండర్ పేస్-రోహన్ బోపన్న జోడీ 6-3, 6-7(9), 7-5తో మేట్ పావిక్-ఫ్రాంకో స్కుగోర్‌పై గెలిచారు. డబుల్స్ మ్యాచ్ నెగ్గడంతో 1-2తో భారత్ మ్యాచ్‌లోకి వచ్చినా.. తర్వాత జరిగిన తొలి రివర్స్ సింగిల్స్‌లో సుమీత్ నగల్ ఓటమితో ఫలితం తేలిపోయింది. సుమీత్ 6-0, 6-1తో సిలిచ్ చేతిలో పరాజయం పాలయ్యాడు. తొలి రోజు మ్యాచ్‌లో రామ్‌కుమార్ 6-7(8), 6-7(8)తో సిలిచ్ చేతిలో, ప్రజ్ఞేష్ గుణేశ్వరన్ 6-3, 4-6, 2-6తో బోర్నా చేతిలో ఓడారు.

www.andhrajyothy.com

# ఆంధ్రజ్యోతి

ANDHRAJYOTHI

ఆదివారం | 8-3-2020

Vijayawada | Hyderabad | Mahaboobnagar | Tirupathi | Visakhapatnam | Anantapur | Karimnagar | Tadepalligudem | Warangal | Guntur | Kurnool | Nellore | Srikakulam | Rajamahendravaram | Khammam | Kadapa | Ongole | Nallagonda | Nizamabad and Bangalore

విజయవాడ సిటీ




| పరిషత్ | మున్సిపల్ | పంచాయతీ |
|---|---|---|
| పోలింగ్ : మార్చి 21 | పోలింగ్ : మార్చి 23 | తొలి దశ : మార్చి 27 |
| కౌంటింగ్ : మార్చి 24 | కౌంటింగ్ : మార్చి 27 | రెండో దశ : మార్చి 29 |

పోలింగ్ కౌంటింగ్ అదే రోజు

# భేరీ మోగింది

## ఈ నెలంతా స్థానిక సమరమే

## రాష్ట్రంలో ఎన్నికల కోడ్ అమల్లోకి

**పరిషత్‌కు నోటిఫికేషన్ విడుదల**

**పుర, పంచాయతీలకు షెడ్యూల్**

**పరిషత్‌లు, మునిసిపాలిటీలకు ఒకే దశలో ఎన్నికలు నిర్వహణ**

**పంచాయతీలకు రెండు దశల్లో**

**ఈ నెల 29తో ముగిసే ప్రక్రియ**

**30న మేయర్లు, చైర్మన్ల ఎంపిక**

**వేర్వేరు కారణాలతో పరిషత్‌లలో 68 స్థానాలకు మినహాయింపు**

**రాష్ట్ర ఎన్నికల కమిషనర్ రమేశ్‌కుమార్ ప్రకటన**

అమరావతి, మార్చి 7 (ఆంధ్రజ్యోతి): స్థానిక సంస్థల ఎన్నికలకు నగారా మోగింది. జిల్లా పరిషత్, మండల పరిషత్ ఎన్నికలకు శనివారం ఉదయం 11 గంటలకు రాష్ట్ర ఎన్నికల కమిషనర్ రమేశ్‌కుమార్ నోటిఫికేషన్ విడుదల చేశారు. మునిసిపల్, పంచాయతీ ఎన్నికలకు షెడ్యూల్‌ను ఆయన ప్రకటించారు. ఈ ప్రకటనతో రాష్ట్రమంతా ఎన్నికల కోడ్ అమల్లోకి వచ్చిందని ఆయన వెల్లడించారు. ఈ నెల తొమ్మిదో తేదీన రిటర్నింగ్ అధికారి పరిషత్ ఎన్నికలకు ఇచ్చే నోటీసుతో ఈ ప్రక్రియ మొదలయి.. దాదాపు ఈ నెల అంతా స్థానిక సమరం రాష్ట్రాన్ని వేడెక్కించనుంది. పరిషత్, పురపాలక ఎన్నికలు ఒక దశలోనే పూర్తి చేసి పంచాయతీ ఎన్నికలను మాత్రం రెండు దశల్లో నిర్వహించాలని ఎన్నికల కమిషన్ నిర్ణయించింది. ఇందులోనూ మొదట పరిషత్ ఎన్నికలు జరుగుతాయి. ఆ ప్రక్రియ ఈ నెల తొమ్మిదో తేదీ నుంచి 24వ తేదీ వరకు కొనసాగుతుంది. ఇక.. రెండో దశలో నగర పంచాయతీ, మునిసిపాలిటీలకు ఎన్నికలు ఉంటాయి. మునిసిపాలిటీలకు మార్చి తొమ్మిదిన నోటిఫికేషన్ విడుదలయి.. ఆ ఎన్నికలు

మిగతా 13వ పేజీలో...



**కార్పొరేషన్ కోటా**

- **ఎస్టీ:** నెల్లూరు
- **ఎస్సీ మహిళ:** ఒంగోలు
- **ఎస్సీ:** చిత్తూరు
- **బీసీ మహిళ:** శ్రీకాకుళం, విజయనగరం
- **బీసీ:** కడప, కర్నూలు, విశాఖపట్నం
- **జనరల్ మహిళ:** కాకినాడ, మచిలీపట్నం, ఏలూరు, విజయవాడ, తిరుపతి
- **జనరల్:** అనంతపురం, గుంటూరు, రాజమహేంద్రవరం

## ఆర్డినెన్స్‌లోని షెడ్యూల్ ప్రకారమే..

**సచివాలయ రంగులు కోర్టు పరిధిలో.. ఇళ్ల స్థలాల పంపిణీకి ఓకే**

**స్థానిక ఎన్నికల నిర్వహణపై కమిషనర్ రమేశ్‌కుమార్**

13

## కోడ్ వచ్చినా బది'లీలలు'!

**ముందు తేదీలతో చేస్తున్నారని ఆరోపణలు.. పూర్తికాని కార్యదర్శుల బదిలీ**

**స్థానిక సమరంపై 'నిఘా'**

ప్రత్యేక యాప్ ఆవిష్కరించిన ముఖ్యమంత్రి జగన్



వలంటీర్ల సమావేశంలో మాట్లాడుతున్న డిప్యూటీ సీఎం అంజద్‌బాషా

11

సైనికుల్లా పనిచేసి జగనన్న

## రుణం తీర్చుకోండి!

**కడపలో 50 డివిజన్లు గెలిపించండి**

**వలంటీర్లతో డిప్యూటీ సీఎం అంజద్‌బాషా**

**పలు చోట్ల వైసీపీ నేతల సమావేశాలు**

### ఇక్కడ ఎన్నికలపై స్టే

**కార్పొరేషన్లు:** శ్రీకాకుళం, రాజమహేంద్రి, నెల్లూరు (నోటిఫికేషన్ ఆంగ్లంలో ప్రచురించలేదన్న కారణంగా నెల్లూరు నోటిఫికేషన్ రద్దు)

**మున్సిపాలిటీలు:** పాలకొల్లు, మంగళగిరి, తాడేపల్లి, శ్రీకాళహస్తి, రాజంపేట, బద్వేలు మరికొన్ని

# అమరావతికి ఉద్యమ తిలకం

ఉవ్వెత్తున ఎగసిన అమరావతి ఉద్యమంలో మహిళలు కీలకంగా మారారు. రాజధాని గ్రామాల్లోని ఏ దీక్షా శిబిరాన్ని సందర్శించినా 70 శాతం పైగా మహిళలే కనిపిస్తున్నారు. ప్రదర్శన..ర్యాలీ..పాదయాత్ర.. ఇలా ఏ ఆందోళనైనా మహిళలే ముందుంటున్నారు. అలా రాజధాని ఉద్యమానికి ఆమే తిలకం అయ్యింది. నేడు అంతర్జాతీయ మహిళా దినోత్సవం సందర్భంగా 'ఆంధ్రజ్యోతి' ప్రత్యేక కథనం..

## రాజధాని పోరులో పిడికిలెత్తిన మహిళలు

**నిన్నటి వరకు వారు వంటింటికే పరిమితం**

**కనీసం నినాదాలు చేయడమూ వచ్చేదికాదు**

**పోరాటం నేర్పిన రాజధాని ఉద్యమం**

**వంట చేసి, నేరుగా దీక్షా శిబిరాలకే..**

**పోరాడితేనే బతుకంటున్న పడతులు**

(గుంటూరు - ఆంధ్రజ్యోతి)

ఇల్లు, పిల్లలు, అవసరమైతే పొలం పనులు.. అవితప్ప మరేమీ ఎరుగని వారు! ఇప్పుడు పిడికిలి బిగించారు. వారికి గతంలో ఎప్పుడూ ఉద్యమ అనుభవం లేదు. కనీసం నినాదం చేయడం కూడా తెలియదు. టీవీల్లో ఇలాంటి ఆందోళనలు చూడటమే తప్ప.. ప్రత్యక్షంగా పాల్గొనాల్సిన అవసరమేదీ రాలేదు. ఇప్పుడు... వారే ఉద్యమాన్ని స్థిరంగా నడిపిస్తున్నారు. అమరావతికి నిత్యం ఉద్యమ తిలకం దిద్దుతున్నారు. రాజధానిని ఇక్కడి నుంచి తరలించి తమకు అన్యాయం చేయొద్దని ప్రభుత్వాన్ని వేడుకుంటున్నారు. పండుగ రోజుల్లోనూ ఉద్యమ బాటే. వేడుకల్లో సైతం జై అమరావతి నినాదమే. వయసుతో నిమిత్తం లేకుండా.. చిన్నారుల నుంచి ముదుసలి వరకు మహిళలు దీక్ష శిబిరాల్లోనే ఉంటున్నారు. పసిబిడ్డలను తోడ్కొని ఉద్యమంలో పాల్గొంటున్నారు. మొదట్లో కొంత మొహమాటపడ్డారు. కానీ, భవిష్యత్తును కాపాడుకునేందుకు, న్యాయం జరిగేందుకు ఉద్యమం తప్ప మరోమార్గం

మిగతా 12వ పేజీలో...

## మహిళల కష్టం పట్టదా?

**జగనన్నా.. మా బాధలు కనపడటం లేదా?**

**ఏ అక్కాచెల్లికీ కష్టం రానివ్వనన్నావే!**

**చెవిలో పువ్వులతో మైనార్టీ మహిళల నిరసన**

**81వ రోజు రాజధాని రైతుల ఆందోళనలు**

**అనంతవరం వెంకన్నకు మహిళల పూజలు**

**స్థానిక ఎన్నికల్లో ఓటుతో నిరసన తెలుపుతాం**




12

## 31 నుంచి టెన్త్ పరీక్షలు

14 నుంచి హాల్ టికెట్లు డౌన్‌లోడ్ చేసుకోవచ్చు

విద్యాశాఖ మంత్రి ఆదిమూలపు సురేశ్ వెల్లడి

10







# దీని భావమేమి తిరుమలేశా?



## వెంకన్న సొమ్ముపై సర్కారు కన్ను?

**ట్రస్టులు, కార్పొరేషన్ల నుంచి సేకరణ**

**డిపాజిట్లు, మార్కెట్‌లో పెట్టుబడులు**

**'ఎండోమెంట్స్' పేరిట హుండీలకూ టెండర్**

**టీటీడీలోనే అధికంగా కాసుల గలగల**

**ప్రొఫెషనల్ మేనేజ్‌మెంట్ పేరిట సొంత అవసరాలకు సొమ్ములు?**

**డిపాజిట్ల ఆశ చూపి బ్యాంకులనూ దారికి తెచ్చుకునే చాన్స్**

**రాష్ట్ర ప్రభుత్వ సరికొత్త గేమ్‌ప్లాన్**

### సంస్థల నిధుల నిర్వహణకు కొత్త కంపెనీ

(అమరావతి - ఆంధ్రజ్యోతి)

ఇది సర్కారు వారి సరికొత్త కంపెనీ! కాసుల కోసం విసురుతున్న తెలివైన పాచిక! తనవికాని సొమ్ములతో సోకులకు పోతూ... పబ్బం గడుపుకొనే వినూత్న ప్రణాళిక! దీని పేరే... ఆంధ్రప్రదేశ్ స్టేట్ ఫైనాన్షియల్ సర్వీసెస్ కార్పొరేషన్ లిమిటెడ్ (ఏపీఎస్ఎఫ్ఎస్). ఇది రంగంలోకి దిగితే.... అన్నిటికంటే ఎక్కువగా, ముందుగా చిల్లు పడేది ఏడుకొండల వేంకటేశ్వరుడి హుండీకే! 'మేలు చేస్తాం... మిమ్మల్ని ఉద్ధరిస్తాం' అని పైకి చెబుతూ, ఆలయాలతోపాటు ట్రస్టులు, విశ్వవిద్యాలయాలు, బోర్డులు, రాష్ట్ర ప్రభుత్వ పరిధిలోని ఇతర సంస్థల నిధులన్నింటినీ 'ఆకర్ష మంత్రం' వేసినట్లుగా ఏపీఎస్ఎఫ్ఎస్ లాగేసుకోవచ్చు. ఆ డబ్బుతో సంస్థ వడ్డీ వ్యాపారం చేయొచ్చు. షేర్ మార్కెట్లలో పెట్టుబడులూ పెట్టవచ్చు. అన్నింటికంటే ముఖ్యంగా... ఎప్పటికప్పుడు ఖజానాలో నిధుల కొరత లేకుండా, తక్షణావసరాలు తీర్చుకునేందుకు ఈ సంస్థ ఒక 'కామధేనువు'లా మారనుంది. ఏపీఎస్ఎఫ్ఎస్ కార్పొరేషన్ లిమిటెడ్‌లో ప్రభుత్వ పెద్దగా ఉన్న రాష్ట్ర గవర్నర్‌తోపాటు మరో

మిగతా 13వ పేజీలో...

## సహకార బ్యాంకు సీఎండీ కిడ్నాప్

డిపాజిట్ చేస్తామంటూ వల

**ముంబైలో అపహరణ.. పుణెకు తరలింపు**

**గోళ్లు కత్తిరించి, కొట్టి చిత్రహింసలు**

**రూ. కోటి డిమాండ్.. 35 లక్షలకు డీల్**

**ఆర్టీజీఎస్‌తో బ్యాంకు ఖాతాకు బదిలీ**

**వెయ్యి ఇచ్చి బస్సెక్కించిన కిడ్నాపర్లు**

హైదరాబాద్, మార్చి 7 (ఆంధ్రజ్యోతి): ఆంధ్రప్రదేశ్‌కు చెందిన ఓ బ్యాంకు అధికారిని డిపాజిట్ల పేరుతో పిలిపించిన క్రిమినల్ గ్యాంగ్ ఆయనను కిడ్నాప్ చేసింది. రోజంతా చిత్రహింసలు పెట్టింది. రూ. కోటి డిమాండ్ చేసి.. చివరకు రూ. 35 లక్షలు వసూలు చేసింది. 'ఆంధ్రజ్యోతి'కి అందిన సమాచారం ప్రకారం... విజయవాడ కేంద్రంగా పనిచేస్తున్న ఏపీ మర్చంటైల్ కో-ఆపరేటివ్ క్రెడిట్ సొసైటీ లిమిటెడ్‌కు దేశవ్యాప్తంగా ఏడు బ్రాంచిలున్నాయి. గత నెల 12న ముంబై నగరంలోని

మిగతా 12వ పేజీలో...

# తాడోపేడో తేల్చుకోవాలి

## వైసీపీ అహంకారం దిగేలా ఝలక్ ఇవ్వాలి

**5 కోట్ల మందీ ముందుకు రండి.. అండగా ఉంటాం**

**బీసీల ద్రోహి జగన్.. 16,500 మందికి నష్టం**

**34% కాదు.. ఆఖరికి ఆ 24 శాతమూ ఇవ్వలేదు**

**నెల్లూరులో 10.49 శాతమే... జిల్లాల్లోనూ అంతే**

**ఇంత హడావుడి నోటిఫికేషన్ ఎన్నడూ చూడలేదు**

**టీడీపీ నేతలతో టెలికాన్ఫరెన్స్‌లో చంద్రబాబు**

**పార్టీ ఆఫీసులో కంట్రోల్ రూము, టోల్‌ఫ్రీ నంబర్**

అమరావతి, మార్చి 7(ఆంధ్రజ్యోతి): స్థానిక ఎన్నికల్లో తాడోపేడో తేల్చుకోవాలని, వైసీపీ అహంకారం దిగేలా ప్రజలు ఝలక్ ఇవ్వాలని తెలుగుదేశం పార్టీ అధినేత చంద్రబాబు పిలుపునిచ్చారు. వైసీపీ అరాచకాలకు అడ్డుకట్ట వేయాలంటే ఈ ఎన్నికల్లో ఓటే ఆయుధమని అన్నారు. ఇది ప్రజాపోరాటమని, ఐదు కోట్ల మందీ ముందుకు

మిగతా 13వ పేజీలో...




కమాండ్ కంట్రోల్ నంబరును ప్రదర్శిస్తున్న చంద్రబాబు



**బాబాయ్**

### రాత్రికి రాత్రే చీకటి జీవో

**మాన్సాస్ ట్రస్టుపై ప్రభుత్వ పెత్తనమేంటి?**

**వారిది ఏ మతమో నాకు తెలియదు**

**ఆధార్ పరిశీలిస్తే ఏ ప్రాంతంవారో తెలుస్తుంది**

**పురుషులనే చైర్మన్‌గా గుర్తించాలని బైలాలో ఉంది**

**భూములు కాజేయడానికే నన్ను తొలగించారు**

**న్యాయపోరాటం చేస్తాం: అశోక్ గజపతిరాజు**

10



**అమ్మాయ్**

### నా పనితోనే సమాధానం

**భయం, పక్షపాతం లేకుండా పనిచేస్తా**

**మసీదు, చర్చికి వెళ్తే మతం మారిపోతుందా?**

**కుటుంబసభ్యుల ఆరోపణలు బాధిస్తున్నాయి**

**నా వెనుక ఎటువంటి రాజకీయ శక్తులూ లేవు**

**ప్రభుత్వానికి నేనే లీగల్ రిప్రజెంటేషన్ ఇచ్చా**

**బీజేపీలోనే కొనసాగుతా...: సంచయిత**

> జగన్మోహన్ రెడ్డి ప్రభుత్వం తాజాగా తీసుకొచ్చిన ఆర్డినెన్స్ ప్రకారం ఎన్నికలు ముగిసిన తర్వాత కూడా పోటీ చేసిన వారు ఎవరైనా డబ్బు, మద్యం పంపిణీ చేసినట్టు నిర్ధారణ అయితే వారిపై క్రిమినల్ కేసులు నమోదు చేసి జైలుకు పంపవచ్చు. కిటుకు అంతా ఇక్కడే ఉంది. ఎన్నికల కమిషన్‌కు ఉండే అధికారాలను రాష్ట్రప్రభుత్వం సంక్రమింపజేసుకుంది. దీని ప్రకారం ప్రత్యర్థి పార్టీలకు చెందినవారు ఎవరైనా గెలిస్తే... వారిపై క్రిమినల్ కేసులు నమోదు చేయరన్న గ్యారంటీ ఏమీలేదు. ఎందుకంటే, ఇప్పుడు ఆంధ్రప్రదేశ్‌లో పోలీసులు ఏకపక్షంగా వ్యవహరిస్తున్నారు. అధికార వైసీపీ జెండా రంగులున్న దుస్తులు ధరించడం మినహా పార్టీ కార్యకర్తలను మించిపోయి వ్యవహరిస్తున్నారు.

యూట్యూబ్‌లో 'కొత్త పలుకు' కోసం QR Code scan చేయండి

■ ఆర్కే RK

కొత్త పలుకు

# పోరాడితే వచ్చేదేమిటి?

"స్థానిక సంస్థలకు జరగనున్న ఎన్నికలలో డబ్బు, మద్యం పంపిణీ జరగకూడదు. ఎవరైనా డబ్బు పంపిణీ చేసినట్టు రుజువైతే వారిపై అనర్హత వేటు వేయడంతోపాటు మూడేళ్ల జైలుశిక్ష విధించేలా చట్టం చేశాం"... ఆంధ్రప్రదేశ్ ముఖ్యమంత్రి జగన్మోహన్ రెడ్డి చేసిన ప్రకటన ఇది! "ఏ పార్టీ వారు అయినా డబ్బు పంపిణీ చేస్తే కఠిన చర్యలు తీసుకోండి"... జిల్లా ఎస్పీలకు డీజీపీ గౌతమ్ సవాంగ్ జారీచేసిన ఆదేశం ఇది! ముఖ్యమంత్రి ప్రకటన తర్వాత సోషల్ మీడియాలో ఒక కామెంట్ ప్రచారంలోకి వచ్చింది. అదేమిటంటే... పత్తిత్తు పరమాన్నం వండితే శుక్రవారం వరకు చల్లబడలేదట! నిజానికి ముఖ్యమంత్రి జగన్మోహన్ రెడ్డి నిర్ణయాన్ని అభినందించాలి. ఎన్నికలలో డబ్బు, మద్యం పంపిణీ పెద్ద బెడదగా మారినందున ముఖ్యమంత్రి నిర్ణయాన్ని స్వాగతించాల్సిందే! అయితే, ఆంధ్రప్రదేశ్‌లో గత తొమ్మిది నెలలుగా చోటు చేసుకుంటున్న సంఘటనలు, పోలీసులు వ్యవహరిస్తున్న తీరు చూసిన తర్వాత ముఖ్యమంత్రి ఉద్దేశాన్ని శంకించాల్సి వస్తోంది. బీజేపీ రాష్ట్ర అధ్యక్షుడు కన్నా లక్ష్మీనారాయణ అన్నట్టుగా

> **తమ తరపున ఒకరికి రాజ్యసభ సీటు కావాలని ముఖేశ్ అంబానీ ఒక రాజకీయ పార్టీని కోరడం ఇదే మొదటిసారి. అదికూడా ఒకప్పుడు రాజశేఖర్ రెడ్డి మరణానికి తానే కారణమని నిందించిన జగన్మోహన్ రెడ్డిని స్వయంగా వచ్చి ముఖేశ్ అంబానీ కలవడం వింతగా భావిస్తున్నారు. ఈ పరిణామం వల్ల ముఖేశ్ అంబానీ స్థాయి తగ్గి ముఖ్యమంత్రి జగన్మోహన్ రెడ్డి స్థాయి పెరిగింది. నిజానికి ముఖేశ్‌ను కలవడానికి తానే ముంబై వస్తానని జగన్మోహన్ రెడ్డి చాలాకాలంగా కోరుతున్నారట. అప్పుడు ముఖ్యమంత్రిని కలవడానికి పెద్దగా ఆసక్తి చూపని ముఖేశ్.. ఇప్పుడు తానే స్వయంగా రావడం పలువురిని ఆశ్చర్యానికి గురిచేసింది. విజయసాయి రెడ్డి వ్యూహం కారణంగా ప్రపంచ కుబేరులలో ఒకరైన ముఖేశ్ అంబానీ తాడేపల్లి వచ్చి మరీ జగన్‌ను కలిసి ఆయన ఆతిథ్యం స్వీకరించారు. ముఖేశ్ వంటివారు కూడా బలహీనతలకు అతీతం కాదన్న మాట!**

ప్రత్యర్థి పార్టీల తరపున ఎవరైనా పొరపాటున గెలిస్తే డబ్బు, మద్యం పంపిణీ చేశారని కేసులు పెట్టి... వారిపై అనర్హత వేటు వేసే ప్రమాదముంది. అధికార పార్టీ తనకు అనుకూలంగా ఈ చట్టాన్ని దుర్వినియోగం చేయదని చెప్పడానికి లేదు. ఇప్పుడున్న నిబంధనల ప్రకారం ఎన్నికల నోటిఫికేషన్ విడుదలైన తర్వాత ఎన్నికల నియమావళిని అమలు చేసే బాధ్యత, అధికారం ఎన్నికల కమిషన్‌కే ఉంటుంది. జగన్మోహన్ రెడ్డి ప్రభుత్వం తాజాగా తీసుకొచ్చిన ఆర్డినెన్స్ ప్రకారం ఎన్నికలు ముగిసిన తర్వాత కూడా పోటీ చేసిన వారు ఎవరైనా డబ్బు, మద్యం పంపిణీ చేసినట్టు నిర్ధారణ అయితే వారిపై క్రిమినల్ కేసులు నమోదు చేసి జైలుకు పంపవచ్చు. కిటుకు అంతా ఇక్కడే ఉంది. ఎన్నికల కమిషన్‌కు ఉండే అధికారాలను రాష్ట్రప్రభుత్వం సంక్రమింపజేసుకుంది. దీని ప్రకారం ప్రత్యర్థి పార్టీలకు చెందినవారు ఎవరైనా గెలిస్తే... వారిపై క్రిమినల్ కేసులు నమోదు చేయరన్న గ్యారంటీ ఏమీలేదు. ఎందుకంటే, ఇప్పుడు ఆంధ్రప్రదేశ్‌లో పోలీసులు ఏకపక్షంగా వ్యవహరిస్తున్నారు. అధికార వైసీపీ జెండా రంగులున్న దుస్తులు ధరించడం మినహా పార్టీ కార్యకర్తలను మించిపోయి వ్యవహరిస్తున్నారు. ప్రత్యర్థులు ఇచ్చే ఫిర్యాదులు బుట్టదాఖలు అవుతున్నాయి. అదే అధికార పార్టీ వారికి నష్టం జరిగే విధంగా ఎవరైనా వ్యవహరిస్తే వారిపై ఎస్సీ-ఎస్టీ అట్రాసిటీ చట్టం ప్రయోగిస్తున్నారు. ఈ నేపథ్యంలో స్థానిక సంస్థల ఎన్నికల సందర్భంగా పోలీసులు ఏ రీతిన రెచ్చిపోతారో చూడాలి. ప్రత్యర్థి పార్టీలకు చెందినవారు ఎవరైనా, ఎక్కడైనా గెలిస్తే వారిపై తాజా చట్టాన్ని ప్రయోగించడం తథ్యంగా కనిపిస్తున్నది. ప్రత్యర్థులు డబ్బు, మద్యం పంపిణీ చేసినట్టు అధికార పార్టీ కార్యకర్తలు, అభిమానులతో ఫిర్యాదులు చేయించి ఆయా నేతలపై కేసులు పెట్టవచ్చు. ఇప్పుడు చీమ చిటుక్కుమన్నా పోలీసులు రాజకీయ ప్రత్యర్థులపై కేసులు పెడుతుండటాన్ని చూస్తున్నాంగా! ఎన్నికలలో ప్రత్యర్థులు డబ్బు, మద్యం పంపిణీ చేసినట్టు సాక్ష్యాలు సృష్టించడం పోలీసులకు పెద్ద కష్టం ఏమీకాదు.

## అక్కడా... ఇక్కడా...

ఏపీలో అన్ని జిల్లా పరిషత్తులు, మునిసిపాలిటీలను కైవసం చేసుకోవాలని ముఖ్యమంత్రి జగన్మోహన్ రెడ్డి తన మంత్రులను ఆదేశించారు. తెలంగాణలో కూడా జిల్లా పరిషత్తులు, మునిసిపాలిటీలను అధికార తెలంగాణ రాష్ట్రసమితి తన ఖాతాలో వేసుకుంది. ఒకటీ అర మునిసిపాలిటీలు చేజారినా... అధికార పార్టీ సహించలేకపోయింది. తెలంగాణ సీఎం కేసీఆర్ అడుగుజాడల్లో నడుస్తూ, ఆయనకంటే రెండు ఆకులు ఎక్కువ చదివిన ఏపీ సీఎం ఇప్పుడు ప్రత్యర్థులపై ప్రయోగించడానికి ఏకంగా చట్టాన్నే తెచ్చారు. ముఖ్యమంత్రి లక్ష్యం ఏమిటో, మనసులో ఏమి కోరుకుంటున్నారో తెలిసిన తర్వాత రాష్ట్ర డీజీపీ గౌతమ్ సవాంగ్ అందుకు అనుకూలంగా పోలీస్ యంత్రాంగాన్ని ప్రయోగించకుండా ఉండరు. ఈ నేపథ్యంలో డబ్బు, మద్యం పంపిణీ చేసిన వాళ్లు ఏ పార్టీ వారైనా కఠిన చర్యలు తీసుకోవాలని ఆయన జిల్లా ఎస్పీలను ఆదేశించడం హాస్యాస్పదంగా ఉంది. అధికార పార్టీకి అనుకూలంగా పోలీసులు వ్యవహరించడం ఎప్పటినుంచో జరుగుతోంది. అయితే, ఇప్పటిలా రాష్ట్రవ్యాప్తంగా ప్రత్యర్థి పార్టీ కార్యకర్తలు, మద్దతుదారులపై వెంటపడి మరీ కేసులు పెట్టడం గతంలో ఎప్పుడూ చూడలేదు. ఒకటీ అర సందర్భాలలో ఒకస్థాయి నాయకులపై కేసులు పెడుతుంటారు. ఇప్పుడు మొత్తం రాష్ట్రాన్నే భయానక వాతావరణంలోకి నెట్టేశారు. విశాఖలో పర్యటించడానికై మాజీ ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడును అనుమతించి కూడా వైసీపీ కార్యకర్తలకు ఇష్టంలేదన్న కారణంగా వెనక్కు పంపించేసిన ఘనత ఏపీ పోలీసులకే దక్కింది. ఈ ఉదంతంలో తమముందు హాజరుకావాలని డీజీపీని హైకోర్టు ఆదేశించింది. డీజీపీని కోర్టుకు పిలిపించడం ఇది రెండవ పర్యాయం. పోలీసు శాఖకు ఇంత కంటే తలవంపులు ఏముంటాయి? తెలంగాణలో కూడా పోలీసులు అధికార పార్టీకి అనుకూలంగానే వ్యవహరిస్తున్నారు. ఏపీ పోలీసులు మాత్రం సరికొత్త రికార్డులు నెలకొల్పుతున్నారు! అందుకే చట్టాల గురించి ఏపీలో అధికారంలో ఉన్నవాళ్లు మాట్లాడితే పత్తిత్తు పరమాన్నం... అన్న సామెతను చెప్పుకుంటున్నారు!

## విపక్షాలకు దారేది?

ఈ నేపథ్యంలో ఆంధ్రప్రదేశ్‌లో ప్రతిపక్షాలు స్థానిక సంస్థల ఎన్నికలలో పోటీ చేయడం అవసరమా? అన్న ప్రశ్న ఉత్పన్నం అవుతోంది. స్థానిక ఎన్నికలలో కలిసి పోటీ చేయబోతున్నట్టు జనసేన, బీజేపీ ఇది వరకే ప్రకటించాయి. తెలుగుదేశం పార్టీ కూడా ఎన్నికలలో పోటీకి రంగం సిద్ధం చేసుకుంటోంది. ముఖ్యమంత్రి జగన్మోహన్ రెడ్డి ఆంతర్యం ఏమిటో, పోలీసులు ఏమి చేయబోతున్నారో స్పష్టంగా కనిపిస్తున్న తర్వాత కూడా స్థానిక ఎన్నికలలో పోటీ చేయాలనుకోవడం దుస్సాహసమే అవుతుంది. స్థానిక ఎన్నికలతోపాటు ఉప ఎన్నికలకు కూడా దూరంగా ఉండటం ఈ దేశంలో ప్రతిపక్షాలకు కొత్త ఏమీకాదు. ఉమ్మడి ఆంధ్రప్రదేశ్‌లో కాంగ్రెస్ పార్టీ కూడా ఒక సందర్భంగా స్థానిక ఎన్నికలకు దూరంగా ఉండిపోయింది. తమిళనాడులో ప్రతిపక్షంలో ఉన్నప్పుడు దివంగత జయలలిత కూడా స్థానికంతోపాటు ఉప ఎన్నికల్లో కూడా పోటీ చేయలేదు. అయినా ఆ తర్వాత జరిగిన సాధారణ ఎన్నికలలో ఆమె అధికారం చేజిక్కించుకున్నారు. జనసేన, బీజేపీ కలిసి పోటీ చేసినా ఈ ఎన్నికల్లో పెద్దగా ప్రభావం చూపించకపోవచ్చు. బీజేపీ బలం అంతంత మాత్రం కాగా, జనసేనకు అంతోఇంతో ఓటింగ్ ఉన్నప్పటికీ గ్రామస్థాయిలో పార్టీ యంత్రాంగం నిర్మితం కాలేదు కనుక అధికార పార్టీని ఢీకొట్టలేని పరిస్థితి ఉంది. కేంద్రంలో అధికారంలో ఉన్నందున స్థానికంగా అంత బలం లేకపోయినా బీజేపీ నాయకుల వాయిస్ పెద్దగా వినిపిస్తోంది. ముఖ్యమంత్రి జగన్మోహన్ రెడ్డి కూడా కేంద్రప్రభుత్వం అంటే భయపడుతుంటారు కనుక బీజేపీ అండ కోసం ఇతర పార్టీలు వెంపర్లాడుతున్నాయి. నిజానికి బీజేపీతో జట్టుకట్టాలని ఒకదశలో వైసీపీ అభిప్రాయపడిందని చెబుతున్నారు. అదే జరిగితే రాష్ట్రంలో జగన్మోహన్ రెడ్డికి ఎదురుండేది కాదు. బహుశా ఈ పరిస్థితిని పసిగట్టే జనసేన హడావుడిగా బీజేపీతో జతకట్టి ఉండవచ్చు. తెలుగుదేశం పార్టీ కూడా కలిస్తే రాష్ట్రంలో వైసీపీకి కొంతవరకు చెక్ పెట్టవచ్చును గానీ, చంద్రబాబుతో చేతులు కలపడం బీజేపీ పెద్దలకు సుతరాము ఇష్టంలేదు కనుక ఇప్పట్లో అది జరగదు. రాజ్యసభలో బిల్లులకు ఆమోదం పొందాలంటే వైసీపీ మద్దతు అవసరం కనుక బీజేపీ పెద్దలు ముఖ్యమంత్రి జగన్మోహన్ రెడ్డి విషయంలో సానుకూలంగా వ్యవహరిస్తున్నట్టు చెబుతున్నారు. అదే సమయంలో జనసేనను కాదనుకోలేరు కనుక వైసీపీతో నేరుగా పొత్తు పెట్టుకోలేకపోతున్నారన్నది ఒక అభిప్రాయంగా ఉంది. ఈ పరిస్థితులలో స్థానిక ఎన్నికలు వచ్చినందున జనసేన-బీజేపీ చెలిమి ఏ మేరకు ప్రభావం చూపుతుందో చూడాలి. పోటీచేసిన స్థానాల్లో




కనీస స్థాయిలో కూడా ఓట్లు సాధించలేని పక్షంలో ఈ రెండు పార్టీల కలయిక ఒక విఫల ప్రయోగంగా ఉండిపోతుంది. ముఖ్యమంత్రి జగన్మోహన్ రెడ్డితో బీజేపీ చేతులు కలపడం జనసేనాని పవన్ కల్యాణ్‌కు ఇష్టం లేదు. ప్రతిపక్ష నాయకుడు చంద్రబాబుతో బీజేపీ జట్టుకట్టడం జగన్మోహన్ రెడ్డికి ఇష్టం లేదు. బీజేపీ పెద్దలకేమో రాజ్యసభలో వైసీపీ మద్దతు అవసరం. జగన్మోహన్ రెడ్డికేమో తనపై ఉన్న కేసుల విషయంలో కేంద్ర ప్రభుత్వం చల్లనిచూపు అవసరం. ఫలితంగా తెలుగుదేశం ఒంటరి పోరాటం చేయాల్సిన పరిస్థితి. టూకీగా ఆంధ్రప్రదేశ్ రాజకీయ ముఖచిత్రం ఇదీ! ఈ నేపథ్యంలో తెలుగుదేశం పార్టీ ఒంటరిగా స్థానిక ఎన్నికలలో పోటీచేయడం వల్ల ఫలితం ఉంటుందా? అన్న చర్చ ఇప్పుడు ఆ పార్టీలో జోరుగా సాగుతోంది. పది మాసాల క్రితం జరిగిన సాధారణ ఎన్నికలలో ఓటమిపాలైన తెలుగుదేశం పార్టీ అభ్యర్థులు ఆర్థికంగా కూడా కుదేలయ్యారు. మెజారిటీ అభ్యర్థులు ఇప్పటికీ అప్పుల భారాన్ని మోస్తున్నారు. వారిని ఆర్థికంగా ఆదుకునే పరిస్థితిలో పార్టీ అధిష్ఠానం కూడా లేదు. ఇక కార్యకర్తలు, అభిమానుల పరిస్థితి గ్రామాల్లో దారుణంగా ఉంది. కొంతమంది ఆర్థికంగా చితికిపోగా, మరికొంతమంది ప్రభుత్వం నుంచి రావలసిన బిల్లులు రాక విలవిల్లాడిపోతున్నారు. వీటన్నింటిని అధిగమించి ఎవరైనా తల ఎగరేస్తే కేసులు పెట్టి వేధిస్తున్నారు. ఈ ప్రతికూలతలన్నింటినీ అధిగమించి సర్పంచులుగా, ఎంపీటీసీ, జడ్పీటీసీలుగా, మునిసిపల్ కౌన్సిలర్లుగా పోటీ చేయడానికి ఎంతమంది ముందుకు వస్తారో తెలియదు. ఈ తరుణంలో తెలుగుదేశం పార్టీ ఈ ఎన్నికలకు దూరంగా ఉండటం శ్రేయస్కరం. పరిస్థితి అనుకూలంగా లేదనుకున్నప్పుడు, శత్రువు ఊపుమీద ఉన్నప్పుడు ఒక అడుగు వెనక్కి తగ్గడం యుద్ధతంత్రంలో ఒక భాగం. ఇలా చేయడాన్ని పలాయన వాదంగా భావించడానికి లేదు. అయితే, ఎన్నికలలో పోటీచేయకుండా తప్పుకుంటే పార్టీ శ్రేణులు మరింత డీలాపడే ప్రమాదముందని తెలుగుదేశం పార్టీ అధిష్ఠానం అభిప్రాయపడుతున్నట్టు చెబుతున్నారు. సార్వత్రిక ఎన్నికల్లో అధికారంలోకి వచ్చిన పార్టీలే తదనంతరం జరిగే స్థానిక ఎన్నికలలో గెలవడం సహజం. తెలంగాణలో కూడా ఇదే జరిగింది. నిజానికి స్థానిక ఎన్నికలలో తెలంగాణలో అధికార పార్టీకి ఓటింగ్ శాతం పడిపోయింది. అయితే, ప్రతిపక్ష పార్టీలైన కాంగ్రెస్, బీజేపీ మధ్య ఓట్లు చీలిపోవడంతో అధికార పార్టీ భారీగా లబ్ధిపొందింది. ఎన్నికల ముందువరకు తెలంగాణలో "మేమే అధికార పార్టీకి ప్రత్యర్థులం" అని పోటీలుపడిన కాంగ్రెస్-బీజేపీ కూడా ఎన్నికల తర్వాత డీలాపడ్డాయి. లోక్‌సభ ఎన్నికల తర్వాత తమ బలం అతిగా ఊహించుకున్న బీజేపీ స్థానిక ఎన్నికల తర్వాత నీరుగారిపోయింది. తెలంగాణలో ఇక అధికారంలోకి రావడమే ఆలస్యమని నమ్మడంతోపాటు రాష్ట్రవ్యాప్తంగా కూడా అటువంటి అభిప్రాయాన్ని కలిగించిన బీజేపీ రాష్ట్ర నాయకులు ఇప్పుడు వాస్తవంలోకి వచ్చారు. ఇక కాంగ్రెస్ పార్టీ పరిస్థితి చుక్కాని లేని నావలా తయారైంది. కాంగ్రెస్ నాయకులు ఇప్పటికీ పీతలగుంపులా ఒకరినొకరు కిందకు లాగడానికి ప్రయత్నిస్తూనే ఉన్నారు. పీసీసీ అధ్యక్ష పదవి కోసం లెక్కలేనంతమంది పోటీపడుతున్నారు. ఫలితంగా కాంగ్రెస్ పట్ల ప్రజలలో నమ్మకం మరింత సడలింది. దీంతో ముఖ్యమంత్రి కేసీఆర్ మళ్లీ మరింతగా బలపడ్డారు. ఆంధ్రప్రదేశ్‌లో కూడా పరిస్థితులు ఇంచుమించుగా ఇలాగే ఉన్నాయి. ప్రభుత్వ వ్యతిరేక ఓటు తెలుగుదేశం, జనసేన-బీజేపీ కూటమి మధ్య చీలిపోతుంది కనుక అధికార పార్టీనే లబ్ధిపొందుతుంది. నిజానికి ముఖ్యమంత్రి జగన్మోహన్ రెడ్డి వ్యవహారశైలి, తీసుకుంటున్న నిర్ణయాలపై ప్రజలలో కొంత వ్యతిరేకత ఏర్పడింది. అయితే అది ఏ స్థాయిలో అన్నదే ప్రశ్న. ప్రభుత్వం తీరువల్ల జరగబోయే అనర్థాలను కిందిస్థాయి జనం గ్రహించే పరిస్థితి లేదు. సంక్షేమం పేరిట తమకు డబ్బులు పంచుతున్నారు కనుక వారిలో అసంతృప్తి ఉండటానికి అవకాశం లేదు. మధ్యతరగతి ప్రజలు మాత్రం ప్రభుత్వ పనితీరు పట్ల పెదవి విరుస్తున్నారు. ఈ కారణంగా స్థానిక ఎన్నికలలో వారు ఓటింగులో పాల్గొంటారా? అన్నది సందేహమే. సంక్షేమ పథకాల వల్ల లబ్ధిపొందిన వాళ్లు మాత్రం కచ్చితంగా ఓటు వేస్తారు. అధికార వైసీపీ నాయకులు అదే కోరుకుంటున్నారు. మరోవైపు రాజధాని అమరావతి తరలింపునకు వ్యతిరేకంగా రైతులు ఉద్యమం చేపట్టి మూడు నెలలు కావస్తోంది. అమరావతిని చంపేయడం వల్ల భవిష్యత్తులో జరిగే నష్టాన్ని ఇప్పటికీ ఇతర ప్రాంతాల ప్రజలు గ్రహించలేకపోతున్నారు. ప్రస్తుతానికి రైతుల ఉద్యమ ప్రభావం కృష్ణా - గుంటూరు జిల్లాల్లో అంతో ఇంతో కనిపిస్తోంది. స్థానిక ఎన్నికల ఫలితాలు ఈ రెండు జిల్లాల్లో కూడా అధికార పార్టీకి అనుకూలంగా వస్తే దాని ప్రభావం రైతులు చేస్తున్న పోరాటంపై కచ్చితంగా పడుతుంది. ముఖ్యమంత్రి జగన్మోహన్ రెడ్డి ఇదే కోరుకుంటున్నారు. ప్రతిపక్షాలు పోటీచేసిన తర్వాత కూడా కృష్ణా - గుంటూరు జిల్లాలలో అధికార పార్టీ గెలిస్తే రాజధాని తరలింపు విషయంలో ముఖ్యమంత్రికి అడ్డు ఉండదు. మూడు రాజధానుల నిర్ణయానికి స్థానిక ప్రజల మద్దతు కూడా ఉందని అధికార పార్టీ వాళ్లు ప్రచారం చేసుకుంటారు. ఈ నేపథ్యంలో ప్రతిపక్షాలు... ముఖ్యంగా తెలుగుదేశం పార్టీ ఆచితూచి వ్యవహరించడం మంచిది. కృష్ణా- గుంటూరు జిల్లాల్లోగానీ, మరెక్కడైనాగానీ ప్రతిపక్షాలు గెలిస్తే వారిపై కొత్తగా తీసుకొచ్చిన చట్టాన్ని ప్రయోగించరన్న గ్యారంటీ లేదు.

> **జగన్మోహన్ రెడ్డి ఆంతర్యం ఏమిటో, పోలీసులు ఏమి చేయబోతున్నారో స్పష్టంగా కనిపిస్తున్న తర్వాత కూడా స్థానిక ఎన్నికలలో పోటీ చేయాలనుకోవడం దుస్సాహసమే అవుతుంది. పోటీచేసిన స్థానాల్లో కనీస స్థాయిలో కూడా ఓట్లు సాధించలేని పక్షంలో బీజేపీ- జనసేన కలయిక ఒక విఫల ప్రయోగంగా ఉండిపోతుంది. ముఖ్యమంత్రి జగన్మోహన్ రెడ్డితో బీజేపీ చేతులు కలపడం జనసేనాని పవన్ కల్యాణ్‌కు ఇష్టం లేదు. ప్రతిపక్ష నాయకుడు చంద్రబాబుతో బీజేపీ జట్టుకట్టడం జగన్మోహన్ రెడ్డికి ఇష్టం లేదు. బీజేపీ పెద్దలకేమో రాజ్యసభలో వైసీపీ మద్దతు అవసరం. జగన్మోహన్ రెడ్డికేమో తనపై ఉన్న కేసుల విషయంలో కేంద్ర ప్రభుత్వం చల్లనిచూపు అవసరం. ఫలితంగా తెలుగుదేశం ఒంటరి పోరాటం చేయాల్సిన పరిస్థితి.**

## వ్యవస్థల అవస్థలు

ముఖ్యమంత్రి జగన్మోహన్ రెడ్డికి ఏ వ్యవస్థ అన్నా లెక్కలేనితనం కనిపిస్తోంది. విజయనగరం రాజవంశానికి చెందిన పీవీజీ రాజు ఏర్పాటు చేసిన మాన్సాస్ ట్రస్ట్ చైర్మన్ పదవి నుంచి అశోక్ గజపతిరాజుని తొలగించి.. ఆనంద గజపతిరాజు కుమార్తె సంచయితను నియమిస్తూ అర్ధరాత్రి జీవో జారీచేయడంలోనే జగన్మోహన్ రెడ్డి ప్రభుత్వ బరితెగింపు స్పష్టమవుతోంది. విజయనగరం రాజవంశీయులను ఉత్తరాంధ్ర ప్రజలు ఎంతగానో గౌరవిస్తారు. అశోక్ గజపతిరాజు సోదరుడు దివంగత ఆనంద గజపతిరాజు ఎన్టీఆర్ తొలి కేబినెట్‌లో విద్యాశాఖ మంత్రిగా ఉండేవారు. అప్పట్లో ఆనంద గజపతి ఎప్పుడైనా తనను కలవడానికి వచ్చినప్పుడు ముఖ్యమంత్రిగా ఉన్న ఎన్టీఆర్ లేచి నిలబడి మరీ 'రండి గజపతులవారూ' అని ఆహ్వానించేవారు. అంతటి గౌరవాన్ని అందుకున్న ఆనంద గజపతిరాజు సోదరుడు అశోక్ గజపతిరాజు... సోదరుడి మరణం తర్వాత మాన్సాస్ ట్రస్ట్ చైర్మన్‌గా బాధ్యతలు నిర్వహిస్తున్నారు. అనారోగ్యంతో ఢిల్లీలో అశోక్ గజపతిరాజు చికిత్స పొందారు. ఆసుపత్రిలో ఉన్న ఆయనను అర్ధరాత్రి చైర్మన్ పదవి నుంచి తొలగించి ఆ స్థానంలో విజయనగరంతోనే కాకుండా స్థానిక ప్రజలకు కూడా పరిచయం లేని సంచయితను నియమించడం జగన్మోహన్ రెడ్డికే చెల్లుతుంది. అన్యమతస్తురాలైన సంచయితను హిందూ దేవాలయాల ఆలనాపాలనా చూసే మాన్సాస్ ట్రస్ట్ చైర్‌పర్సన్‌గా ఎలా నియమిస్తారని అశోక్ గజపతిరాజు ప్రశ్నిస్తున్నారు.

## ముఖేశ్ అంబానీ కూడా....

ఈ విషయం అలా ఉంచితే, ఢిల్లీలో తమ సంస్థ తరఫున ప్రభుత్వంలో వ్యవహారాలు పర్యవేక్షించే పరిమళ్ నత్వానీ అనే ఆయనకు రాజ్యసభ సభ్యత్వం ఇవ్వవలసిందిగా కోరడానికై రిలయన్స్ అధిపతి ముఖేశ్ అంబానీ స్వయంగా వచ్చి జగన్మోహన్ రెడ్డిని కలవడం రాష్ట్రంలో చర్చనీయాంశం అయింది. తమ తరఫున ఒకరికి రాజ్యసభ సీటు కావాలని ముఖేశ్ అంబానీ ఒక రాజకీయ పార్టీని కోరడం ఇదే మొదటిసారి. అదికూడా ఒకప్పుడు రాజశేఖర్ రెడ్డి మరణానికి తానే కారణమని నిందించిన జగన్మోహన్ రెడ్డిని స్వయంగా వచ్చి ముఖేశ్ అంబానీ కలవడం వింతగా భావిస్తున్నారు. ఈ పరిణామం వల్ల ముఖేశ్ అంబానీ స్థాయి తగ్గి ముఖ్యమంత్రి జగన్మోహన్ రెడ్డి స్థాయి పెరిగింది. నిజానికి ముఖేశ్‌ను కలవడానికి తానే ముంబై వస్తానని జగన్మోహన్ రెడ్డి చాలాకాలంగా కోరుతున్నారట. అప్పుడు ముఖ్యమంత్రిని కలవడానికి పెద్దగా ఆసక్తి చూపని ముఖేశ్.. ఇప్పుడు తానే స్వయంగా రావడం పలువురిని ఆశ్చర్యానికి గురిచేసింది. ముఖేశ్-జగన్ మధ్య సమావేశాన్ని ఎంపీ విజయసాయి రెడ్డి ఏర్పాటు చేశారని చెబుతున్నారు. రాజ్యసభ పదవీ కాలం ముగియనున్న నత్వానీ మళ్లీ ఆ పదవిని కోరుకుంటున్న విషయం తెలుసుకున్న విజయసాయి రెడ్డి అటునుంచి నరుక్కువచ్చారు. నత్వానీని ప్రయోగించి ముఖేశ్ అంబానీ స్వయంగా వచ్చి జగన్మోహన్ రెడ్డిని కలిసేలా ఏర్పాటుచేశారు. అంబానీ అంతటివాడు స్వయంగా వచ్చి రాజ్యసభ సీటు అడిగితే కాదనడానికి జగన్మోహన్ రెడ్డి అమాయకుడు కాదు కదా? అందుకే అడిగిన వెంటనే ఓకే చేశారు. ఎంతైనా విజయసాయి రెడ్డి ముఖ్యమంత్రి జగన్‌కు పెద్ద అసెట్ అనే చెప్పాలి. తమపై ఉన్న కేసులతోపాటు ఢిల్లీలో ఇతర వ్యవహారాలన్నీ విజయసాయి రెడ్డే పర్యవేక్షిస్తున్నారు. బీజేపీ పెద్దలకు, ముఖ్యమంత్రి జగన్‌కు మధ్య అనుసంధానకర్తగా కూడా ఆయనే వ్యవహరిస్తున్నారు. విజయసాయి రెడ్డి పన్నిన వ్యూహం కారణంగా ప్రపంచ కుబేరులలో ఒకరైన ముఖేశ్ అంబానీ తాడేపల్లి వచ్చి మరీ జగన్‌ను కలిసి ఆయన ఆతిథ్యం స్వీకరించారు. ముఖేశ్ వంటివారు కూడా బలహీనతలకు అతీతం కాదన్న మాట!

> **జగన్మోహన్ రెడ్డి వ్యవహారశైలి, తీసుకుంటున్న నిర్ణయాలపై ప్రజలలో కొంత వ్యతిరేకత ఏర్పడింది. అయితే అది ఏ స్థాయిలో అన్నదే ప్రశ్న. ప్రభుత్వం తీరువల్ల జరగబోయే అనర్థాలను కిందిస్థాయి జనం గ్రహించే పరిస్థితి లేదు. సంక్షేమం పేరిట తమకు డబ్బులు పంచుతున్నారు కనుక వారిలో అసంతృప్తి ఉండటానికి అవకాశం లేదు. మధ్యతరగతి ప్రజలు మాత్రం ప్రభుత్వ పనితీరు పట్ల పెదవి విరుస్తున్నారు. ఈ కారణంగా స్థానిక ఎన్నికలలో వారు ఓటింగులో పాల్గొంటారా? అన్నది సందేహమే. సంక్షేమ పథకాల వల్ల లబ్ధిపొందినవాళ్లు మాత్రం కచ్చితంగా ఓటు వేస్తారు. అధికార వైసీపీ నాయకులు అదే కోరుకుంటున్నారు.**

---

# మహిళా మూర్తి.. రాజ్యాంగ స్ఫూర్తి

ఏడు దశాబ్దాలు పూర్తి చేసుకున్న భారత రాజ్యాంగానికి, మహిళా హక్కుల పరిరక్షణ దిశగా జరుగుతున్న నేటి మహిళా దినోత్సవానికి అవినాభావ సంబంధం ఉంది. స్వాతంత్ర్య సాధనతో పాటుగా సాగిన స్త్రీల స్వతంత్ర జీవన సమాలోచనలు రాజ్యాంగ నిర్మాణానికి సోపానాలు వేశాయి. తెలుగునాట 1896నుండి స్త్రీ జనం చేసిన ప్రాథమిక హక్కుల పోరాటం మన రాజ్యాంగానికి రహదారులు పరిచింది. స్వాతంత్ర్యోద్యమం నాటి స్త్రీల వాఙ్మయం/సాహిత్యం ఈ సత్యావిష్కరణకు భూమిక. స్త్రీల స్వతంత్రత పట్ల పెరిగిన ఆలోచనలకు 1896 నుండి 1947 వరకు తెలుగు పత్రికలలో వచ్చిన స్త్రీల సాహిత్యమే నిదర్శనం.

రాజకీయ స్వాతంత్ర్యానికై దేశమంతా పోరాటం చేస్తూంటే, తమ వ్యక్తి స్వాతంత్ర్యానికై స్త్రీలు పోరాడారు. తమ అస్వతంత్ర జీవనానికి అవిద్యకు ఉన్న లంకెను గుర్తించి తమ హక్కుల సాధన కోసం విద్యావంతులు కావల్సిన అవసరాన్ని గుర్తించారు. స్త్రీకి స్వతంత్రం ఉంటేనే దేశ స్వాతంత్ర్యానికి ప్రయోజనమని భావించిన కందుకూరి వీరేశలింగం స్త్రీ విద్యకు పునాదులు వేసారు. వేమూరి శారదాంబ 1896 లోనే తన 'మాధవశతకం'లో మహిళల అక్షరాస్యతకు నిరోధకంగా ఉన్న సామాజిక, కుటుంబ అసమాన సంస్కృతిని ప్రశ్నకు పెట్టి స్త్రీవిద్య పట్ల ఆలోచనలను రేకెత్తింపజేసింది. ప్రజాస్వామిక, రాజ్యాంగ సమాన హక్కులకు, లింగవివక్షలేని విద్యాహక్కుకు దీనితోనే పునాదులు పడ్డాయని చెప్పుకోవచ్చు. 1902లో విద్యావంతులైన స్త్రీలు, విదేశీ స్త్రీల జీవితాలు, వారి రాజకీయ హక్కులను తెలుసుకుంటూ తమ కుటుంబంలో తమ అస్తిత్వాలను గురించిన ఆలోచనలను పెంచుకున్నారు. అందుకే భండారు అచ్చమాంబ స్త్రీవిద్య అభివృద్ధి చెందటానికి స్త్రీల సమాజాలను ఏర్పాటు చేశారు. 1902-03 నాటికే విద్య ద్వారా జ్ఞానాన్ని పొందిన స్త్రీలు తమ బానిసత్వాన్ని తొలగించుకునే స్వతంత్ర ఆలోచనలను కొనసాగించినట్లు ఆమె రచనలలో కనపడుతుంది. స్త్రీలు పత్రికా రంగంలో ప్రవేశించారు. విద్య స్త్రీలలో ధైర్య స్థైర్యాలను పెంచుతుందని, అప్పుడే తమ భావాలను స్వేచ్ఛగా వ్యక్తీకరించగలం అనుకోవటం మన రాజ్యాంగం నిర్వచించిన ఆలోచనల స్వేచ్ఛ, భావవ్యక్తీకరణ స్వేచ్ఛకు ప్రతీకలు. స్త్రీలకు ఉన్నత విద్యావకాశాలు పెరగాలనీ, వారి సామూహిక స్వేచ్ఛ స్త్రీ స్వతంత్రానికి ప్రేరకమవుతుందనీ భావించారు. మహిళలు చదువుకోవడానికి వివాహ సంస్కృతి ఆటంకంగా ఉన్నదని గుర్తించి, బాల్య వివాహాలను నిరసించారు, స్త్రీ పునర్వివాహ హక్కునూ, గౌరవప్రదమైన జీవన హక్కులను గుర్తించారు.

దేశ స్వతంత్రం కోసం స్త్రీ, పురుషులు ఐక్యంగా పోరాడాల్సిన అవసరాన్ని గుర్తిస్తూనే, తమ స్వతంత్రం కోసం స్త్రీలే ఐకమత్యంతో పోరాటం చేసుకోవాల్సిన కర్తవ్యాన్నీ గుర్తించారు. 1905 లో బెర్లిన్ ప్రపంచ స్త్రీల సభలో పాల్గొన్న భారతీయ స్త్రీలు తమ దేశ అస్తిత్వాన్ని చాటడానికి తమ చీర చెంగులను చించి జెండాను తయారు చేయడం వారి స్వతంత్ర నిర్ణయాలకు నిదర్శనం. 1906లో లండన్ నుంచి వచ్చిన దాదాభాయ్ నౌరోజి కోసం ఏర్పాటు చేసిన సభలో ఒక పారసీక స్త్రీ పతాక ఆవిష్కరణ చేశారు. 1910 నాటికే స్త్రీల సాహిత్యంలో స్త్రీ పురుషుల స్వతంత్ర జీవనంలోని తేడాలను గుర్తించే భావనలకు పెద్దపీట వేశారు. అవిద్య, ఆస్తిహక్కు లేమి స్త్రీ పురుషుల అసమానత్వానికి కారణమనీ, స్త్రీలు అదనంగా సాంఘిక, ఆర్థిక స్వాతంత్ర్యాలకోసం పోరాడాలని చర్చలు సాగేవి. స్త్రీలు భౌతిక, బౌద్ధిక, మానసిక స్వేచ్ఛను అనుభవించగలిగినప్పుడే దేశ స్వాతంత్ర్య సాధన సులభతరం అవుతుందని భావించారు. ఆ దిశగా స్త్రీలలో ఆలోచనలు పంచటానికి పత్రికా స్వాతంత్ర్యాన్ని పొందారు. ఆర్థిక స్వావలంబన కోసం గృహపరిశ్రమలతో ఆదాయాన్ని పొందాలనుకున్నారు. తిలక్ ప్రస్తావించిన స్వదేశీ వస్తు తయారీలో భాగంగా స్త్రీలు నూలు వడకటం, సబ్బుల తయారీ వంటివి నేర్చుకున్నారు. విద్య సాధించిన స్త్రీలు పాశ్చాత్య ప్రపంచాన్ని అధ్యయనం చేయగలిగారు. ఓటు హక్కు విలువను గుర్తించి రాజకీయ చైతన్యాన్ని పెంచుకున్నారు. స్త్రీలు రజస్వలానంతరమే వివాహం చేసుకొనే స్వతంత్రతను పొందాలనుకున్నారు. 1911 నాటికి ఆరోగ్య భద్రత గురించి ఆలోచించారు. బహుభార్యాత్వపు సంస్కృతిని నిరసిస్తూ కుటుంబంలో సమాన సంస్కృతిగల లైంగిక హక్కు ఉండాలని భావించారు. పుట్టుకతో సమానమే కానీ, ఇటు తండ్రి ఆస్తిలో గానీ, అటు భర్త ఆస్తిలో గానీ హక్కులేని తనాన్ని గుర్తించి వారసత్వపు ఆర్థిక హక్కుల దిశగా ఆలోచనలు పెంచుకున్నారు. 1914 నాటికి 'విడాకుల' ప్రస్తావన తెచ్చారు. హిందూ వివాహ చట్టం గురించి ఆలోచనలు చేశారు. 1916 లో స్త్రీలకు సమాన ఆర్జనావకాశాల అవశ్యకతను గుర్తించారు. ఆ తరువాత, రాజకీయ స్వాతంత్రానికి తామూ అర్హులమనే భావనలు పెరిగి, లింగవివక్ష కారణంగా తాము రాజకీయాల్లోకి వెళ్లలేకపోతున్నామని గ్రహించారు. ఉద్యోగాలలోనూ సమాన అవకాశాలు ఉండాలనుకున్నారు. నియోజకవర్గ స్వాతంత్ర్యం గురించి ఆలోచించారు. ఆ కారణంగానే స్త్రీలు 1920లో గాంధీజీ పిలుపుతో సత్యాగ్రహోద్యమంలో భాగస్వాములై సహాయ నిరాకరణోద్యమాన్ని ముందుండి నడపగలిగారు. స్త్రీలు ఎదుర్కొనే కుటుంబ హింసను చట్టానికి పట్టించేస్థితికి వారి ఆలోచనలు పెరిగాయి. 1925 నాటికి స్వరాజ్య సాధన స్త్రీల విధ్యుక్త ధర్మమని భావించారు. 1929లో స్త్రీని నిర్వచిస్తూ ఆమెకు శరీరముంది, మెదడుంది, హృదయముందనీ స్త్రీ, పురుషుని సొత్తుకాదనీ, స్త్రీల స్వతంత్ర జీవన హక్కు మానవహక్కు అనీ ప్రకటించారు. 1929నాటికి విద్యావంతులైన స్త్రీలకు ఓటుహక్కు లభించింది. మున్సిపాలిటీలు, బోర్డులు ఏర్పడ్డ నేపథ్యంలో స్త్రీలు పరిపాలనా రంగంలోకి అడుగువేయటం, క్రమంగా నామనిర్దేశంగా పదవిని పొందటంకాక, ఎన్నుకోబడి స్వతంత్ర జీవనానికి బాటలు వేయాలనుకున్నారు. ఆ రకంగా తమకు రాజ్యాధికారంలోని పాలనాహక్కులను పొందాలనుకున్నారు. 1930లో చట్ట ప్రయోజనాలను తెలుసుకుంటూ స్త్రీల హక్కులను సద్వినియోగం చేసుకోవాలనుకున్నారు. రాజకీయ స్వాతంత్రం కోసం ఉప్పు సత్యాగ్రహంలో పోరాడుతూనే, తమ భావస్వేచ్ఛకు సంబంధించి చట్టపరమైన హక్కులను విశ్లేషించుకున్నారు. గ్రామస్వరాజ్యంలో స్త్రీల భాగస్వామ్యం ఉండాలనుకున్నారు. 1932 శాసనోల్లంఘన ఉద్యమంలో పాల్గొని బాధలు పడటంతో పాటు, తాము ఎదగగలిగి తోటివారికి సహాయపడగల స్థితికి చేరుకోవాలనీ, వ్యాపారపు మెలకువలు గ్రహిస్తూ ఆర్థికశక్తిగా ఎదిగితేనే దేశ స్వాతంత్ర్యానికి పాటుపడగల సమర్థత స్త్రీలకు ఉంటుందని భావించారు.




> ***రాజ్యాంగం 70 ఏండ్లుగా అమలులో ఉన్నా, స్త్రీలు పురుషులతో సమానంగా జీవించలేని దశలో ఉండటానికి కారణాలు విశ్లేషించుకుంటూ స్త్రీలు తమ హక్కుల పరిరక్షణకై మరింతగా కృషిచేసే దిశగా సాగాలి. అందుకు, స్వాతంత్రోద్యమం నాటి స్త్రీల సాహిత్య పఠనం అవసరం. వివిధ సాహిత్య ప్రక్రియల రూపంలో పాత తెలుగు పత్రికలలో నిక్షిప్తమై విస్మృతంగా ఉన్న నాటి స్త్రీ సాహిత్య చైతన్యం నేటికీ స్ఫూర్తిదాయకం. ఆనాటి స్త్రీల సాహిత్యంలో ప్రతిఫలించిన స్వతంత్ర జీవన చైతన్యం, స్వరాజ్య హక్కుల పోరాటం కలిసివెరసి భారతదేశ ప్రజాస్వామిక రాజ్యాంగ నిర్మాణానికి దారిదీపాలుగా ఉపకరించాయని అర్థం చేసుకోవాలి.***

1935లోనే స్త్రీలు తమ సామాజిక అస్తిత్వాలకు సంబంధించి ఆలోచనలు పెంచుకొని సామాజిక సంస్కృతిని నిరసించే విధంగా స్వతంత్ర నిర్ణయాలు చేసుకోవాలని భావించారు. 1935 నాటికి ఎన్నికల ద్వారా శాసనసభ్యత్వానికై సమాన ప్రాతినిథ్యం ఉండాలనే చైతన్యం అభివృద్ధి చేసుకున్నారు. ఉన్నత విద్యావంతులైన స్త్రీలకే కాక సంతకం చేయగలిగిన స్త్రీలకు ఓటుహక్కును, ఎన్నికల హక్కును విస్తరింపజేయాలనుకున్నారు. స్త్రీల హక్కులకై శాసనసభలో బిల్లును పెట్టాలనుకున్నారు, సంపూర్ణస్వేచ్ఛ కోరుకున్నారు. 1936లో సాంఘిక, రాజకీయ, ఆర్థిక రంగాలలో స్త్రీ, పురుష సమానత్వపు ఆవశ్యకతను గుర్తించి, ఎన్నికకాబడే హక్కు స్త్రీ ఆత్మహక్కని భావించారు. తాము చేసే ఇంటి చాకిరికి వేతనాలు కావాలన్నారు. 1937లో ఉద్యమంలో పాల్గొనటానికి గర్భధారణ ఆటంకంగా ఉన్నదని భావించిన సందర్భంలో, స్త్రీలు సంతానాన్ని కనే యంత్రాలు కాదనీ, తల్లికావడం, గర్భస్రావం వంటి విషయాలలో నిర్ణయాధికార హక్కు ఉండాలని గుర్తించారు. స్త్రీలు సైన్యంలో చేరాలనే ఆలోచనలూ పెరిగాయి. స్త్రీ వ్యక్తిత్వాన్ని అగౌరవపరిచే పత్రికా ప్రకటనలను, చిత్రాలను నిరసించారు. 1937నాటికి స్త్రీలు శాసనసభ్యులుగా ఎన్నికై రాజకీయ హక్కులను పొందారు. పెళ్ళిళ్ళు రిజిస్టర్ చేయాలని కోరుకున్నారు. 1938 నాటికి స్త్రీలు చట్టాల్లో ఉన్న లింగవివక్షను గుర్తించడంతో సాంఘిక, ఆర్థిక, న్యాయాలను ప్రశ్నకు పెట్టారు. స్త్రీలు పురుషునితో సమానంగా జీవించే హక్కు కలిగి ఉంటేనే స్త్రీ స్వతంత్ర జీవనహక్కుకు రక్షణ ఉంటుందని భావించారు. ఆర్థిక విధానం మారాలని స్త్రీలకు ఆర్థిక, సాంఘిక, రాజకీయ హక్కులు కావాలనీ భావించారు.

1947 ఆగష్టు 15వ తేదీన ఎగురవేయబోయే భారతదేశ స్వాతంత్ర్య జెండాను తెలుగింటి కోడలైన సరోజినీ నాయుడు నెహ్రూకు అందించింది. తెలుగు వనిత దుర్గాబాయి దేశముఖ్ డా.అంబేద్కర్ రూపొందించిన రాజ్యాంగ నిర్మాణ సంఘ సభ్యురాలిగా ఉన్నది. ఇవన్నీ స్త్రీలకు సమాన హక్కులు, సమాన న్యాయం ఉండాలన్న సూచనలే. దేశస్వాతంత్రానికీ, స్త్రీ హక్కుల చైతన్యానికీ, దేశరాజ్యాంగ నిర్మాణానికీ గల అవినాభావ సంబంధం నుంచి స్ఫూర్తిపొందటం నేటి అంతర్జాతీయ మహిళా దినోత్సవం లక్ష్యం కావాలి. భారత రాజ్యాంగం 70 ఏండ్లుగా అమలులో ఉన్నా, స్త్రీలు పురుషులతో సమానంగా జీవించలేని దశలో ఉండటానికి కారణాలు విశ్లేషించుకుంటూ స్త్రీలు తమ హక్కుల పరిరక్షణకై మరింతగా కృషిచేసే దిశగా సాగటానికి స్వాతంత్రోద్యమం నాటి స్త్రీల సాహిత్య పఠనం అవసరం. వివిధ సాహిత్య ప్రక్రియల రూపంలో పాత తెలుగు పత్రికలలో నిక్షిప్తమై విస్మృతంగా ఉన్న నాటి స్త్రీ సాహిత్య చైతన్యం నేటికీ స్ఫూర్తిదాయకం. ఆనాటి స్త్రీల సాహిత్యంలో ప్రతిఫలించిన స్వతంత్ర జీవన చైతన్యం, స్వరాజ్య హక్కుల పోరాటం కలిసివెరసి భారతదేశ ప్రజాస్వామిక రాజ్యాంగ నిర్ మాణానికి దారిదీపాలుగా ఉపకరించాయని అర్థం చేసుకోవాలి.

■ డా. జె.కనక దుర్గ

*(నేడు అంతర్జాతీయ మహిళా దినోత్సవం)*



# ఆమెకు వందనం

ఆమె... తల్లి. ఆమె... చెల్లి.
ఆమె... భార్య. ఆమె... బిడ్డ.
ఆమె... ఒకప్పుడు కేవలం గృహిణి.
ఆమె... ఇప్పుడు ఇంటికే కాదు, సమాజానికీ ఓ యజమాని.
ఆమె... పురుషాధిక్య ప్రపంచంలో తన పాత్రనూ, ప్రాధాన్యాన్నీ
ఎప్పటికప్పుడు పునర్ నిర్వచిస్తోంది.
మగవాళ్లదే ఆధిపత్యమనే ప్రతి చోటా మూసను బద్దలుకొడుతోంది.
ముందడుగు వేస్తోంది. అన్ని రంగాల్లో తనదైన ముద్ర వేస్తోంది.
వేతనాల్లో వ్యత్యాసాన్ని ప్రశ్నిస్తోంది. సమానత్వ పోరాటంలో
కొత్త బంగారు లోకానికి వేకువ రేకగా పల్లవిస్తోంది.
ఆ స్త్రీమూర్తి... నిత్యచైతన్య దీప్తి. నిరంతర మానవ విజయాల స్ఫూర్తి.
ఆమె శక్తికి... ఆమె యుక్తికి...
ఆమె నేర్పుకు... ఆమె ఓర్పుకు... వందనం.
అభివందనం. అభినందనం.

నేడు అంతర్జాతీయ మహిళా దినోత్సవం

అవలోకనం



## ఇంకా పోరాడుతున్నాం!

**మహిళలు విజయం సాధిస్తే ఏం జరుగుతుంది? ఈ ప్రశ్న 'టైమ్స్' మ్యాగజైన్ 50 ఏళ్ల కిందటే వేసుకుంది. 'ది పాలిటిక్స్ ఆఫ్ సెక్స్' కాన్సెప్ట్‌తో 1970లో ప్రత్యేక సంచిక వెలువరించింది. మహిళా ఉద్యమ నేత గ్లోరియా స్టైమ్ అందులో ఒక వ్యాసం రాశారు. తాజాగా 'వందమంది శక్తిమంతమైన మహిళలు' జాబితా విడుదల చేస్తూ, గ్లోరియా అభిప్రాయాలను 'టైమ్స్' కోరింది. ఈ 50 ఏళ్ళలో చోటు చేసుకున్న మార్పులపై ఆమె ఆలోచనలు..**

"అర్ధ శతాబ్దం కిందట, (1970లో 'టైమ్స్' మ్యాగజైన్‌లో) 'ది పాలిటిక్స్ ఆఫ్ సెక్స్' అనే ముఖచిత్ర కథనంలో భాగంగా 'మహిళలు గెలిస్తే ఎలా ఉంటుంది?' అనే శీర్షికతో ఒక వ్యాసం రాశాను. అప్పటికీ, ఇప్పటికీ మహిళల పరిస్థితుల్లో కచ్చితంగా కొంత పురోగతి ఉంది. మహిళా సమస్యలను ఒకప్పటిలా ఇప్పుడు అప్రస్తుతంగా చూడడం లేదు. ప్రతిదానికీ అవే మూలాధారం అనే అవగాహన వచ్చింది. ఉదాహరణకు, ఒక దేశం హింసాత్మకమైనది కావచ్చు లేదా మరో దేశానికి వ్యతిరేకంగా సైనిక హింసను ప్రయోగిస్తూ ఉండవచ్చు! కానీ ఆ దేశం ఎలాంటిదో చెప్పాలంటే చూడాల్సింది పేదరికాన్నో, సహజ వనరుల సమృద్ధినో, అక్కడ ప్రజాస్వామ్యం అమలవుతున్న తీరునో కాదు; మహిళల మీద జరుగుతున్న హింసను! పునరుత్పత్తిని నియంత్రించకుండా దీర్ఘకాలం పాటు జాతి విభజనను కొనసాగించడం సాధ్యం కాదు. అలాగే మహిళల శరీరాల విషయానికి వస్తే జాతి వివక్ష, లింగ వివక్ష రెండూ ఒకదానితో ఒకటి పెనవేసుకొని ఉంటాయి. వాటిని కలిపి మాత్రమే నిర్మూలించగలం.

స్త్రీ, పురుష భేదాలు, జాతి భేదాలు లేని సమానత్వంలో తమకు ఎనలేని విశ్వాసం ఉందని ప్రజాభిప్రాయ సేకరణల్లో చాలామంది చెబుతూ ఉంటారు. కానీ పాతకాలం నాటి ఆధిపత్యాల కారణంగా తమకు చెందాల్సిన హక్కులకు దూరమయ్యామని అమెరికన్ మైనారిటీలు ఇప్పటికీ పోరాటాలు చేస్తున్నారు. ఒక విజయం తరువాత మహా ప్రమాదం ముంచుకొచ్చే కాలం ఒకటి వస్తుంది. మనం ఇప్పుడు అలాంటి కాలంలోనే ఉన్నాం. యాభయ్యేళ్ళ కిందట నేను రాసిన వ్యాసంలో భవిష్యత్తు ఎలా ఉంటుందో జోస్యాలు చెప్పాను, కానీ ఆ తరువాత కొన్ని పాఠాలు కూడా నేర్చుకున్నాను. ఒక రచనను అందించడానికి ముందే పారితోషికాన్ని మాట్లాడుకోవడంతో సహా! ఎందుకంటే పురుష రచయితల కన్నా నాకు తక్కువ చెల్లిస్తున్నారని నా ఏజెంట్ ద్వారా ఆ తరువాత నాకు తెలిసింది. మరో యాభయ్యేళ్ళ తరువాత ఈ మాటలు ఎవరైనా చదివే నాటికి నేను ఉండను, కానీ మీరు చదువుతారన్న విశ్వాసం నాకుంది"



### 50 ఏళ్ళ క్రితం...

"ఎన్నికైన ప్రజా ప్రతినిధుల్లో సగం మంది మహిళలు ఉండాలి. అప్పుడప్పుడు మహిళలు దేశాధ్యక్షులుగా ఎన్నికవుతూ ఉండాలి. అప్పుడే ఆ దేశంలో పురుషాధిక్యత వల్ల నెలకొన్న సమస్యలు చాలా వరకు తగ్గుతాయి. అధికారం దొరికితే మేము కూడా దూకుడుగా ఉండడానికి ఉత్సాహం చూపిస్తామేమో! మహిళలు చాలా సందర్భాల్లో పురుషుల కన్నా తక్కువ పోరాడుతారనీ, కానీ అవసరం వస్తే పురుషుల కన్నా ప్రచండంగా ఉంటారనీ, ఎందుకంటే యుద్ధ క్రీడ నియమాలను మహిళలు బోధించరనీ, అవసరమైనప్పుడు మాత్రమే యుద్ధం చేస్తారనీ మార్గరెట్ మీడ్ (అమెరికన్ సాంస్కృతిక మానవ శాస్త్రవేత్త) అభిప్రాయపడ్డారు. కానీ రాబోయే యాభై సంవత్సరాల్లో రాజకీయాల్లో మహిళల విలువ బాగా పెరుగుతుంది. ఎందుకంటే పురుషుల ఆలోచనా ధోరణిని మహిళలు మారుస్తారు."

*('మహిళలు గెలిస్తే ఎలా ఉంటుంది?' అనే శీర్షికతో 1970లో గ్లోరియా స్టైమ్ రాసిన వ్యాసం నుంచి)*

వినూత్నం

## నిప్పుతో చెలగాటం!

అవకాశం ఇస్తే ఏ రంగంలోనైనా రాణిస్తామని మహిళలు రుజువు చేస్తున్నారు. పురుషులకే పరిమితం అనే అభిప్రాయం ఉన్న వృత్తుల్లో సైతం సత్తా చూపిస్తున్నారు. కత్తి మీద సాములాంటి అగ్నిమాపక దళ సేవల్లోనూ తమదైన ముద్ర వేస్తున్నారు.

మీకు తెలుసా? ఆసియాలోనే మొదటిసారిగా అందరూ మహిళలే ఉన్న విమానాశ్రయ అగ్నిమాపక దళం మన దేశంలోనే ఉంది. ఇటీవల బెంగళూరులో నిర్వహించిన మాక్ డ్రిల్‌లో ఈ దళం సభ్యులు తమ నైపుణ్యాలు ప్రదర్శించి 'శభాష్' అనిపించుకున్నారు. నిప్పుతో చెలగాటం ఆడే ఈ వృత్తిలో మహిళలకు గతంలో ప్రవేశం ఉండేది కాదు. 2006లో, మన దేశంలో మొదటి మహిళా ఫైర్ ఫైటర్‌గా హర్షిణి కన్హకర్ చరిత్రకెక్కారు. నాగపూర్‌లోని జాతీయ అగ్నిమాపక సేవల కళాశాల (ఎన్‌ఎఫ్‌ఎస్‌సి)లో ఆమె చేరేనాటికి ఆ కోర్సులో మహిళలలకు అనుమతి లేదు. హర్షిణి ఆసక్తిని గమనించిన కళాశాల వర్గాలు ఆమెను డే స్కాలర్‌గా తీసుకోవడానికి కేంద్ర హోం శాఖ నుంచి ప్రత్యేక అనుమతిని పొందాల్సి వచ్చింది.

విమానాశ్రయాల విషయానికి వస్తే, 2018లో భారత విమానాశ్రయాల సంస్థ (ఎఎఐ) మొదటి మహిళా ఫైర్‌ఫైటర్‌గా కోల్‌కతాకు చెందిన తనియా సన్యాల్‌ను నియమించింది. అలాగే చెన్నై విమానాశ్రయంలోని అగ్నిమాపక విభాగంలో తొలి మహిళగా, 28 ఏళ్ళ రమ్యా శ్రీకాంతన్ జూనియర్ అసిస్టెంట్ బాధ్యతలను కిందటి ఏడాది నవంబర్‌లో చేపట్టారు. ఇప్పుడు 14 మంది సభ్యులతో ఆసియాలోనే తొలి పూర్తిస్థాయి మహిళా ఫైర్ ఫైటర్స్ దళం బెంగళూరులోని కెంపెగౌడ విమానాశ్రయంలో సేవలు అందిస్తోంది. 2018 ఫిబ్రవరి 18న వీరు ఈ విభాగంలో చేరారు. కోల్‌కతాలోని ఎఎఐ అగ్నిమాపక సేవల శిక్షణ కేంద్రంలో నాలుగు నెలలు వీరు శిక్షణ పొందారు. ప్రమాదాలు తలెత్తినప్పుడు సత్వర స్పందన, విపత్తు నిర్వహణ, ప్రయాణికుల తరలింపు, సహాయక చర్యలను వీరు చేపడతారు. ఈ ఏడాది అంతర్జాతీయ మహిళా దినోత్సవం సందర్భంగా నిర్వహించే కార్యక్రమాల్లో మరోసారి తమ నైపుణ్యాలను చాటి చెప్పడానికి ఈ దళం సిద్ధమయింది.



అలెక్సా... ప్లే లవ్ సాంగ్స్... అలెక్సా.... బుక్ ఎ మీల్... ...'స్మార్ట్' యుగంలో సంచలనం 'అమెజాన్ అలెక్సా'. కొన్నేళ్ల కిందటి వరకు వాయిస్ అసిస్టెంట్ అనేది ఊహలకందని ఫీచర్. కానీ ఇప్పుడు 'అలెక్సా'తోనే చాలామందికి రోజు మొదలవుతుంది. ఆ డివైజ్‌ను ఆపు... దీన్ని ప్లే చెయ్యి... అంటూ సగటున సెకనుకు ఐదుసార్లు 'అలెక్సా'ను అడుగుతున్నారట! ముఖ్యంగా 2017లో ఇది భారత్‌కు వచ్చాక వాడకం ఐదు రెట్లు పెరిగిందట! ప్రస్తుతం 800 స్కిల్స్‌తో లక్షల మందికి చేరువైన 'అలెక్సా'ను ఆడిస్తున్నది ఎవరో తెలుసా..! మహిళలు! అందులో మన తెలుగమ్మాయి కూడా ఉంది. ఆమే రమ్యా పూసర్ల.

## 'అలెక్సా'కు మాటలు నేర్పింది!

విశాఖపట్టణానికి సమీపంలో ఓ చిన్న గ్రామం రమ్యది. మొదటి నుంచి బాగా చదువుకోవాలన్న తపన. కెరీర్‌లో ఉన్నతంగా స్థిరపడాలన్న పట్టుదల. ఇవే ఆమెకు బిట్స్ పిలానీ- హైదరాబాద్‌లో సీటు తెచ్చిపెట్టాయి. ఇంజనీరింగ్ చదువుతుండగానే క్యాంపస్ ఇంటర్వ్యూలో అమెజాన్ కంపెనీకి ఎంపికయ్యారు. కంప్యూటర్ సైన్స్(2014)లో గ్రాడ్యుయేషన్ చేసిన వెంటనే ఉద్యోగంలో చేరారు. ఆమెకు అమెజాన్ ప్రతిష్ఠాత్మకంగా భారత్‌కు తీసుకువచ్చిన 'అలెక్సా ఎకో' ప్రాజెక్టులో కీలక బాధ్యతలు అప్పగించింది.

**సవాలుగా తీసుకొని...**

నిజానికి 'అలెక్సా' ప్రాజెక్ట్ ఎంతో క్లిష్టమైంది. విభిన్నమైనది. ప్రోగ్రామింగ్‌లో నైపుణ్యం ఉంటేనే సరిపోదు... కస్టమరు ఏమేమి కావాలనుకొంటున్నారో వాటన్నింటినీ ముందస్తుగానే అంచనా వేసి, అనుభవాన్ని రంగరించి రూపొందించాలి. 'అలెక్సా'లో పని చాలా భిన్నమైనది. సవాళ్లతో కూడుకున్నది. గతంలో నేను చేసినదానికి... దీనికి ఏ మాత్రం సంబంధం లేదు' అంటారు రమ్య. ఆమె అంతకుముందు 'విజువల్ స్ర్కీన్ ఇంటర్‌ఫేసెస్'కు సంబంధించి పనిచేశారు. కానీ ఇప్పుడు డీల్ చేస్తున్నది 'వాయిస్ ఇంటర్‌ఫేస్'.

ప్రస్తుతం అమెజాన్ బెంగళూరు శాఖలో పనిచేస్తున్న రమ్య... ఇంజనీరింగ్ ఫైనల్ ఇయర్‌లో ఉండగానే వాల్‌మార్ట్ ల్యాబ్‌లో ఇంటర్న్‌గా చేశారు. కస్టమర్ అకౌంట్స్ నిర్వహించే బృందంలో అనుభవం గడించారు. అంతకుముందు విశాఖపట్టణంలోని స్టీల్ ఎక్చేంజ్ ఇండియా లిమిటెడ్‌లో ఇంటర్న్‌షిప్ చేశారు. అమెజాన్‌లో చేరిన తరువాత చైనాలో ఆ సంస్థ గ్లోబల్ స్టోర్ లాంచింగ్‌లో కీలక పాత్ర పోషించారు.

**సమానత్వం... ఈ మాట అనడానికి బాగుంటుంది కానీ, పాటించడానికి చాలా ధైర్యం కావాలి. ఈ సమానత్వం కోసమే మహిళలు ఎన్నో ఏళ్లుగా అలుపెరగని పోరాటాలు చేస్తున్నారు. వివిధ రంగాల్లో తమ సత్తా చాటుకుంటున్నారు. అంతర్జాతీయ మహిళా దినోత్సవం సందర్భంగా అలాంటి ముగ్గురు విజేతలకు 'త్రీ ఛీర్స్' చెబుదాం!**

అంతర్జాతీయ మహిళా దినోత్సవం సందర్భంగా ఏటా ఒక్కో ప్రత్యేక ఇతివృత్తాన్ని ప్రధానాంశంగా చేసుకొని, కార్యకలాపాలు నిర్వహిస్తుంటారు. గత ఏడాది ఇతివృత్తం - 'బ్యాలెన్స్ ఫర్ బెటర్'. ఆఫీసు బోర్డు రూముల నుంచి మీడియాలో, సంపద సృష్టిలో మహిళలకు స్థానం కల్పిస్తూ, లైంగిక సమతౌల్యతను సాధించడం గత ఏడాది ప్రధానాంశం. ఇక, ఈ ఏడాది ఇతివృత్తం - 'ఈచ్ ఫర్ ఈక్వల్'. వ్యక్తిగత ప్రయత్నంతో మూసను బద్దలు కొట్టి, పక్షపాత వైఖరిపై పోరాడిన మహిళల విజయాలపై అందరి దృష్టి పడేలా చేయడం ఇందులో భాగం. మరి, ఈ అంతర్జాతీయ మహిళా దినోత్సవం మనకు గుర్తు చేస్తున్నదేమిటి?

## ఎన్నాళ్ళిలా?

- నిజానికి, పురుషులతో సమానంగా మహిళలకూ చోటిస్తూ, లింగ వివక్షను దూరం చేయడమనేది ఇప్పటికీ సాధ్యం కాలేదు. ప్రపంచ వ్యాప్తంగా రాజకీయాలు, వ్యాపారాలు, ఉద్యోగాలు - ఇలా ఎక్కడ చూసినా ఇప్పటికీ స్త్రీ పురుషుల మధ్య అవకాశాల నుంచి వేతనాల దాకా అన్నింటిలో తేడా కొనసాగుతూనే ఉంది. విద్య, వైద్యం, వారిపై సాగుతున్న హింస లాంటి అనేక విషయాల్లో మగవాళ్ళతో పోలిస్తే ఆడవారి పరిస్థితి ఘోరంగా ఉంది.
- బ్రిటన్‌లోని ప్రధాన సంస్థల్లో మగవారికి చెల్లిస్తున్న వేతనంలో సగం కన్నా తక్కువే ఇప్పటికీ మహిళలకు ఇస్తున్నారని గణాంకాలు చెబుతున్నాయి.
- 76.7 శాతంతో పాశ్చాత్య ఐరోపా అత్యధిక జెండర్ పారిటీ రేటింగ్‌లో నిలిచింది.
- మన దేశంలో కూడా ఇప్పటికీ స్త్రీ పురుషుల మధ్య వేతనాల్లో వ్యత్యాసం స్పష్టంగా కనిపిస్తూనే ఉంది. మగవాళ్ళ కన్నా ఆడవాళ్ళకు దాదాపు 35 శాతం మేర తక్కువ వేతనాలు ఇస్తున్నారని అంతర్జాతీయ శ్రామిక సంస్థ (ఐ.ఎల్.ఒ) నివేదిక పేర్కొంది.



## పర్యాటకంతో ప్రయోగాలు చేస్తోంది!

ఇంప్యాక్ట్ బేస్డ్ టూరిజం చేపట్టి పర్యాటక రంగంలో కొత్త ఒరవడితో ముందుకు సాగుతున్నారు వందనా విజయ్. విద్యుత్, నీటి సమస్య ఉన్న లదాఖ్‌లో విద్యుద్దీకరణ చేపట్టారు. నీటి సమస్యను పరిష్కరిస్తున్నారు. ఎకో-టూరిజం, దేశంలోని గ్రామీణ ప్రాంతాలలో ఆర్థికాభివృద్ధికి కృషిచేస్తూ, పురుషులకు దీటుగా నిలుస్తున్నారు.

"మా నాన్న సైన్యంలో ఉండడంతో విధుల్లో భాగంగా మేము దేశం మొత్తం చుట్టాం. మా మూలాలు మాత్రం హైదరాబాద్‌లోనే ఉన్నాయి. నా స్కూలింగ్ ఈశాన్య రాష్ట్రాలు, జమ్ము-కాశ్మీర్‌లో సాగింది. బిఎ, ఎంఎస్‌సి మైక్రోబయోలజీ ఉస్మానియా యూనివర్సిటీలో చేశా. మా ఇంట్లోని ఆర్మీ వాతావరణం వల్ల చిన్నతనం నుంచీ డిఫెన్స్ సర్వీసెస్ చేరాలని కలలు కన్నా. 2009లో యుపిఎస్‌సి కంబైన్డ్ డిఫెన్స్ సర్వీసెస్ ప్రవేశపరీక్ష రాసి ఫస్ట్ ర్యాంక్ సాధించా. కానీ చివరకు అందులో చేరలేకపోయా. 2014లో ఒక స్వచ్ఛంద సంస్థతో కలిసి లదాఖ్ వెళ్లా. అక్కడి స్థానిక ప్రజల నిత్య జీవితం ఎంత కష్టంగా ఉంటుందో గమనించా. వారి గ్రామాలలో కరెంటు లేదు. నీటి సమస్య ఉంది. అంతేకాదు అక్కడి యువతకు ఉపాధి అవకాశాలు లేవు. ఏడాదిలో సగం రోజులు గడ్డకట్టుకుపోయే వాతావరణం వాళ్లది! వారి సమస్యలు నాలో ఆలోచన రేపాయి. హిమాలయాల మీద బాల్యం నుంచీ నాకున్న ఇష్టం, అలాగే నాలోని సాహస స్వభావం కూడా నన్ను టూరిజం వైపు మళ్లేలా చేశాయి. టూరిజం ద్వారా దేశంలోని ఇలాంటి ఎన్నో ప్రాంతాలను అభివృద్ధి చేయొచ్చనిపించింది. అందుకే 'ఇంప్యాక్ట్ బేస్డ్ టూరిజా'న్ని చేపట్టాలనుకున్నా. అలా 'ఆఫ్-బీట్ ట్రాక్స్' ట్రావెల్ స్టార్టప్‌ని 2016లో ప్రారంభించా. దీనికి నిధులను స్వయంగానే సమకూర్చుకున్నా.

ప్రపంచ ఆర్థిక వ్యవస్థకు ఎంతో ఊపునిస్తున్నది టూరిజమే. మా కంపెనీ 'ఆఫ్-బీట్ ట్రాక్స్' పర్యటనలమీద, సుస్థిరమైన ప్రాజక్టుల మీదా దృష్టిసారించాం. ప్రత్యేకించి సరికొత్త, ఎవరికీ తెలియని డెస్టినేషన్స్‌పై పనిచేస్తున్నాం. మా సంస్థ ప్రత్యేకత ఏమిటంటే ఇది పూర్తిగా ఎక్స్‌పీరియన్షియల్ ట్రావెల్ స్టార్టప్. హిమాలయ ప్రాంతాలలో, ఈశాన్య రాష్ట్రాలలో మేము గుర్తించిన సమస్యలపై సుస్థిర అభివృద్ధి లక్ష్యంగా ముందుకు వెడుతున్నాం. కాలిఫోర్నియా నుంచి వచ్చిన 14 మందితో, లదాక్‌లోని షామ్ ప్రాంతంలో తక్మాచిక్ గ్రామంలో సోలార్ ఎలక్ట్రిఫికేషన్ ప్రాజెక్టు చేపట్టారు. ఈ స్ఫూర్తిని రేకెత్తించే సస్టైనబుల్ ట్రావల్‌ని దేశమంతా వ్యాప్తిచేయాలన్నదే మా కోరిక. భారతదేశంలోని గ్రామీణ ప్రాంత ప్రజలతో మమేకమై అభివృద్ధి పరంగా మూలాల నుంచీ మార్పు తేవాలని అనుకుంటున్నాం."

## మూసను బద్దలు కొట్టింది!

క్రికెట్ అనగానే ఓ కోహ్లీనో... ఏ ధోనీనో... గుర్తుకువస్తారు. కానీ పురుషాధిక్యం ఉన్న ఈ ఆటలో మగాడిగా వేషం మార్చుకుని ఓ అమ్మాయి అదరగొట్టింది. సచిన్ టెండూల్కర్ స్ఫూర్తితో ఆట మొదలుపెట్టి... చివరకు అతడి ముప్ఫై ఏళ్ల రికార్డునే బద్దలు కొట్టింది. ఇప్పుడు అంతర్జాతీయ టీ20 క్రికెట్‌లో టాప్ బ్యాట్స్‌ఉమన్‌గా ఎదిగి చరిత్ర సృష్టించింది. ఆస్ట్రేలియాలో జరుగుతున్న టీ20 ప్రపంచ కప్‌లో దుమ్ములేపుతున్న పదహారేళ్ల షఫాలీ వర్మ పురుషాధిక్య సమాజంలో మూసను బద్దలు కొట్టిన నవతరం యువతి. ఇవాళ జరుగుతున్న టీ 20 మహిళల వరల్డ్‌కప్ ఫైనల్లో స్టార్ కూడా.

'చిచ్చరపిడుగు'... ముప్ఫై ఏళ్ల కిందట అంతర్జాతీయ క్రికెట్‌లోకి అడుగుపెట్టిన మాస్టర్ బ్లాస్టర్ సచిన్ టెండూల్కర్‌కు మాజీలు ఇచ్చిన కితాబిది. ఎంతటి బౌలర్‌నైనా అలవోకగా ఆడే నైపుణ్యం... బౌండరీలతో స్కోరు బోర్డును పరుగులెత్తించగల సామర్థ్యం... అతడికే ప్రత్యేకం. ఇది చరిత్ర. ఇప్పుడు... అతడినే ఆరాధిస్తూ బ్యాట్ పట్టిన షఫాలీ వర్మ భారీ షాట్లతో చెలరేగుతోంది.

హరియాణాలోని రోహ్‌తక్... షఫాలీ పుట్టిన ఊరు. స్థానిక మణిదీప్ సీనియర్ సెకండరీ స్కూల్‌లో పదో తరగతి చదువుతున్న ఆమెకు తన తండ్రే మార్గదర్శి. ఆయనది చిన్నపాటి నగల వ్యాపారం. తొమ్మిదేళ్లప్పుడు స్టేడియంలో తొలిసారి సచిన్‌ను చూసిన తరువాత షఫాలీ మనసు మారిపోయింది. క్రికెటర్ కావాలన్న ఆకాంక్ష బలంగా నాటుకుపోయింది. ఆరంభంలో నాన్న వద్దే క్రికెట్ ఓనమాలు నేర్చుకున్న షఫాలీ... ఎలాగైనా మగవారితో కలిసి ఆడాలనుకుంది. అందు కోసం తన జుత్తు కత్తిరించుకొని, క్రాఫ్ తీసి... తన సోదరుడిగా తనను తాను పరిచయం చేసుకుంది. క్రమంగా ఆటను మెరుగుపరుచుకుని హరియాణా రాష్ట్ర జట్టుల్లో స్థానం సంపాదించింది.

**సచిన్ రికార్డు తిరగరాసి...**

రాష్ట్ర జట్లలో నిలకడైన ప్రదర్శనతో షఫాలీ వర్మకు భారత సీనియర్ జట్టులో స్థానం దక్కింది. దక్షిణాఫ్రికాతో గత ఏడాది సెప్టెంబర్‌లో జరిగిన టీ20 మ్యాచ్‌తో అంతర్జాతీయ అరంగేట్రం చేసింది. కొన్ని వారాల తరువాత వెస్టిండీస్ టూర్‌కు వెళ్లిన షఫాలీ చెలరేగిపోయింది. అక్కడ అర్ధశతకం బాది... అంతర్జాతీయ క్రికెట్‌లో ఈ ఘనత సాధించిన అతి పిన్న భారత క్రికెటర్‌గా చరిత్ర సృష్టించింది. ముప్ఫై ఏళ్లుగా సచిన్ పేరిట ఉన్న రికార్డు దాంతో తెరమరుగైపోయింది. క్రికెట్ దేవుడిని ఆరాధిస్తూ ఆట మొదలుపెట్టిన ఈ హరియాణా హరికేన్... అతడి రికార్డునే తిరగరాయడం ఓ మరపురాని ఘట్టం.

అద్భుతమైన ప్రదర్శనతో నిలకడగా రాణిస్తున్న షఫాలీకి మరో అద్భుత అవకాశం వచ్చింది. అదే ప్రస్తుతం ఆస్ట్రేలియాలో జరుగుతున్న టీ20 ప్రపంచ కప్‌లో ఆడే భారత జట్టులో చోటు! అవకాశం వచ్చిందే తడవుగా ప్రపంచ కప్‌లో ఆకాశమే హద్దుగా అదరగొడుతోంది షఫాలీ. తాజాగా టీ20 బ్యాట్స్‌ఉమెన్ ర్యాంకింగ్స్‌లో అగ్రస్థానాన్ని దక్కించుకుంది. మాజీ కెప్టెన్ మిథాలీ రాజ్ తరువాత టాప్‌లో నిలిచిన భారత క్రికెటర్ షఫాలీనే!





### ఇంకా 166 ఏళ్లట!

ఎన్నో కార్యక్రమాలు చేపడుతున్నా, ఎంతో అవగాహన కలిగిస్తున్నా లింగ వివక్ష ఇప్పుడిప్పుడే తగ్గేలా కనపడడం లేదు. స్త్రీ పురుష లింగ వేతనాల విషయంలో వ్యత్యాసం పోవడానికి ఇంకా కనీసం మరో శతాబ్ద కాలం పైగా పట్టేలా ఉంది. సరిగ్గా చెప్పాలంటే మరో 166 ఏళ్ళు పడుతుంది. సాక్షాత్తూ, 'ప్రపంచ ఆర్థిక వేదిక' మాట ఇది.

జయహో మహిళ

# ప్రపంచ తెరపై 'షీ'రోస్!!

**హీరో అంటే? తెలుసు! మరి, 'షీ'రో అంటే... 'షి'+హీరో = 'షీ'రో!!**
**ధైర్య సాహసాలతో ఘనత సాధించిన మహిళలను 'షీ'రోస్ అంటారు!!!**
**ప్రపంచ వెండితెరపై క్రమక్రమంగా 'షీ'రోస్ సంఖ్య పెరుగుతోంది!**
**'షీ'రోస్‌ను... తెరపై ఆవిష్కరించడానికి దర్శక-నిర్మాతలు,**
**తనివితీరా చూసి ఆనందించడానికి ప్రేక్షకులు 'జై' కొడుతున్నారు!!**

సూపర్ మేన్, స్పైడర్ మేన్, ఐరన్ మేన్, బ్యాట్ మేన్... హాలీవుడ్ సూపర్ హీరోలందరూ మగాళ్లే! సూపర్ హీరోస్ చిత్రాల్లో ఏలుబడి వాళ్లదే!! మరి, ఆ మగాళ్లకు జన్మనిచ్చిన మహిళల సంగతేంటి? నిన్న మొన్నటి వరకూ వెండితెరపై తగు ప్రాధాన్యం లభించలేదు. అడపాదడపా లభించినా... అంతగా విజయాలు సాధించలేదు. బట్, ఫర్ ఏ ఛేంజ్... ఈమధ్య మార్పు వచ్చింది. సూపర్ హీరోస్ సినిమాల్లో ఫిమేల్ హీరోస్‌కి సరైన రీతిలో ప్రాధాన్యం లభిస్తోంది. సారీ... సారీ... 'షీ'రోస్ చిత్రాలు వస్తున్నాయి. విజయాలు సాధిస్తున్నాయి. స్త్రీ శక్తి సత్తా చాటుతున్నాయి. సూపర్ హీరోస్ చిత్రాలకు ఏ మాత్రం తీసిపోని రీతిలో కామిక్ పుస్తకాల ఆధారంగా ఊహాజనిత పాత్రలతో అసాధారణ శక్తులున్న మహిళల గాథలు కొంతకాలంగా వెండితెరపైకి వస్తున్నాయి.

'షీ'రోస్ ఇప్పటి ప్రేక్షకులకు ముందుగా గుర్తొచ్చేది... 'వండర్ ఉమన్', 'కెప్టెన్ మార్వెల్'! ఎందుకంటే... ఈ చిత్రాలు సాధించిన విజయాలు అటువంటివి. కానీ, 'షీ'రోస్ ట్రెండ్ ఈ రెండు చిత్రాలతో ప్రారంభం కాలేదు. అంతకు ముందు ఎప్పుడో మొదలైంది. కానీ, పేరొచ్చింది మాత్రం ఇప్పుడే!! 1984లో 'సూపర్ గాళ్' అని ఒక సినిమా వచ్చింది. 1995లో 'టాంక్ గాళ్' అని మరో సినిమా వచ్చింది. మార్వెల్ కామిక్స్ నుండి 2005లో 'ఎలెక్ట్రా' అని ఓ సినిమా వచ్చింది. అంతకు ముందు 2004లో హాలే బెర్రీ 'క్యాట్ విమెన్' సినిమా చేశారు. అయితే... అవేవీ భారీ విజయాలు సాధించలేదు. 'వండర్ ఉమన్', 'కెప్టెన్ మార్వెల్' చిత్రాలతో 'షీ'రోస్ ట్రెండ్ ఊపందుకుంది.

### కెమేరా వెనుక... 'షీ'రోస్!

తెలుగు, హిందీ, ఇంగ్లిష్ తేడాల్లేవ్! ఏదైనా పురుషాధిక్య పరిశ్రమే!! దర్శకుల్లోనూ మహిళల కన్నా పురుషులే ఎక్కువ. సూపర్ హీరోస్ చిత్రాలకు దర్శకత్వం వహించేదీ పురుషులే! అయితే... 'షీ'రోస్ చిత్రాలకు మహిళలు దర్శకత్వం వహిస్తుండడం విశేషమే కదూ!! మీకు తెలుసా? ఈ ఏడాది ఫిబ్రవరి 7న విడుదలైన 'షీ'రోస్ చిత్రం 'బర్డ్స్ ఆఫ్ ప్రే'కి దర్శకత్వం వహించినది జన్మతః చైనీయురాలైన అమెరికన్ దర్శకురాలు క్యాథీ యన్. ఈ నెల 27న విడుదల కానున్న మరో 'షీ'రోస్ చిత్రం 'ములాన్' వెనుకున్నది న్యూజీలాండ్‌లో పుట్టి పెరిగిన దర్శకురాలు నికీ కారో. ఈ ఏడాది మే 1న విడుదల కానున్న 'బ్లాక్ విడో'కి ఆస్ట్రేలియన్ కేట్ షార్ట్‌లాండ్ దర్శకురాలు. జూన్ 5న రానున్న 'వండర్ ఉమెన్ 1984'కి ప్యాటీ జంకిన్స్, నవంబర్ 6న వస్తున్న 'ది ఎటర్నల్స్'కి జన్మతః చైనీయురాలు క్లోయీ జావ్ దర్శకత్వం వహించారు. వివిధ దేశాలకు చెందిన దర్శకురాళ్లు వస్తుండడం శుభ సూచకం! అయితే... దర్శకుల్లో స్త్రీ-పురుష వ్యత్యాసం ఎక్కువ. మరింతమంది దర్శకురాళ్లు రావాల్సిన అవసరం ఎంతైనా ఉంది.

**వదంతులు నిజమవుతాయా?**

**'కిక్-యాస్' (2010)లో హిట్ గాళ్ క్యారెక్టర్ హిట్టు. ఆ పాత్ర ఆధారంగా ఓ సినిమా రూపొందించడానికి సన్నాహాలు చేస్తున్నారట! 'బ్యాట్ మేన్', 'ఐరన్ మేన్' తరహాలో 'బ్యాట్ గాళ్', 'ఐరన్ గాళ్', 'అవెంజర్స్'లో ఎలిజబెత్ పోషించిన వండా మ్యాగ్జిమ్‌ఆఫ్ పాత్ర ఆధారంగా చిత్రాలు రూపొందించడానికి నిర్మాణ సంస్థలు సన్నాహాలు చేస్తున్నాయని సమాచారం. అవి ఎప్పుడు నిజమవుతాయో? చూడాలి.**

### డీసీ వర్సెస్ మార్వెల్!

సూపర్ హీరోస్ చిత్రాల్లో నిర్మాణ సంస్థలు డీసీ యూనివర్స్(డీసీయు), మార్వెల్ సినిమాటిక్ యూనివర్స్ (ఎంసీయు) మధ్యే పోటీ. 'సూపర్ మేన్', 'బ్యాట్ మేన్' వంటివి డీసీయు నుండి వస్తే... 'అవెంజర్స్' సిరీస్, 'ఐరన్ మేన్' వంటివి ఎంసీయు నుండి వచ్చింది. ఇప్పుడీ సంస్థలు 'షీ'రోస్ చిత్రాలు తీయడంలోనూ పోటీ పడుతున్నాయి. 'వండర్ ఉమెన్', 'సూసైడ్ స్క్వాడ్', 'బర్డ్స్ ఆఫ్ ప్రే' డీసీయు చిత్రాలైతే... 'కెప్టెన్ మార్వెల్', 'బ్లాక్ విడో' ఎంసీయు చిత్రాలు! 'ములాన్' డిస్నీ చిత్రం.




# అమ్మాయా? అబ్బాయా? అని చూడవద్దు!!



"చిన్న-పెద్ద, ఆడ-మగ అనే వ్యత్యాసాలు లేకుండా... ఒకరికి మరొకరు మద్దతు ఇవ్వాలి. అదే ముఖ్యం! ఎవరేం చేసినా నిరుత్సాహ పరచకుండా, పోత్సహిస్తే బాగుంటుంది. మనమంతా మనుషులం. మానవత్వంతో మెలగాలి. ఉద్యోగ వ్యవహారాల్లో, వేషాలు ఇవ్వడంలో, సహాయం చేయడంలో... అమ్మాయా? అబ్బాయా? అని తేడాలు చూడకుండా అందర్నీ సమానంగా చూడాలి' అంటున్నారు. 'అమెజాన్'లో ఐదంకెల జీతం వచ్చే ఉద్యోగాన్ని వదులుకుని, నటిగా యుట్యూబ్‌లోకి వచ్చిన అలేఖ్యా హారిక. 'దేత్తడి' ఛానల్‌లో ఫిల్మ్స్ చేస్తూ... వినోదాన్ని పంచుతున్నారు. ప్రశంసలు అందుకుంటున్నారు. మహిళా దినోత్సవం సందర్భంగా అలేఖ్య మనసులోని మాటలు ఇవి....

"ప్రతిరోజూ మహిళా దినోత్సవమే అని ప్రతి ఒక్కరూ అనుకుంటే... మనం ఇలా ప్రత్యేకంగా మాట్లాడుకోవాల్సిన అవసరం రాదేమో! మా కుటుంబంలో 'అమ్మాయిలు ఇలా ఉండాలి? అలా ఉండాలి?' అనే నిబంధనలు ఏవీ లేవు. అమ్మ, బ్రదర్ సూపర్ స్ట్రాంగ్. 'అమెజాన్'లో ఉద్యోగం వదిలి, యాక్టింగ్‌పై పూర్తిగా దృష్టి పెడతానని చెప్పినప్పుడు... అంతకు ముందు నటిస్తానని చెప్పినప్పుడు వద్దని చెప్పలేదు. నా మీద, నేను తీసుకున్న నిర్ణయాలపైనా నమ్మకం ఉంచారు. నేనెప్పుడైనా డల్‌గా ఉన్నా, వీడియో అనుకున్న స్థాయిలో వెళ్లలేదని మథనపడుతున్నా.. మద్దతు ఇస్తారు.

- డిజిటల్ ఫ్లాట్‌ఫార్మ్‌లో యాక్టింగ్ వైపు రావాలనుకుంటున్న అమ్మాయిలకు, ఆల్రెడీ ఉన్న అమ్మాయిలకు నేను చెప్పేది ఒక్కటే. ఫేమ్ వెనుక పరుగులు తీయకండి. వీడియో చేసి, ప్రేక్షకులను ఎంటర్‌టైన్ చేయాలనుకుంటే... మంచి కంటెంట్ ఇవ్వండి. వంద శాతం కష్టపడండి. జనాలు వీడియో చూడాలంటే, కొంచెం వైరల్ కంటెంట్ ఇవ్వాలని ఏదో చేయకండి. మంచి కంటెంట్‌తో వీడియోలు చేయండి. డిజిటల్‌లో ఉన్నప్పుడు వైరల్ కావడం, మంచి పేరు తెచ్చుకోవడం వేర్వేరు విషయాలు. అది తెలుసుకుని వీడియోలు చేస్తే భవిష్యత్తు ఉంటుంది.
- మేము చేసే వీడియోలకు ప్రశంసలే కాదు... విమర్శలూ వస్తాయి. నా యాస, భాషపై కొందరు అభ్యంతరాలు వ్యక్తం చేశారు. 'ఈ అమ్మాయి ఇటువంటి భాషే మాట్లాడుతుందా? ఈ అమ్మాయి రౌడీ పాత్రలకు మాత్రమే సెట్ అవుతుంది?' అన్నవాళ్లు ఉన్నారు. అదే సమయంలో యాస, భాష నచ్చినవాళ్లు ఉన్నారు. రాజస్థాన్‌లో, ఒమన్, ఆస్ట్రేలియాలో ఉన్నవాళ్లకు నా భాష ఎలా అర్థమవుతుందో తెలియదు. ప్రశంసిస్తూ మెసేజ్‌లు చేస్తారు. ఇటీవల 'స్కూల్ డైరీస్' చిత్రీకరణ చేస్తుంటే... ఇన్‌స్టాగ్రామ్‌లో నా ఫ్యాన్ పేజీ హ్యాండిల్ చేసే అబ్బాయి వచ్చాడు. ఆ రోజు తన పుట్టినరోజు అట! నాతో విషెస్ చెప్పించుకోవడానికి వచ్చాడు. నేను షూటింగులో బిజీగా ఉండడంతో 2 నుండి 7 గంటల వరకు వెయిట్ చేశాడు. 'అక్కా! నీకో సర్‌ప్రైజ్' అని... 'హారిక సిస్టర్ ఫర్ లైఫ్' అని భుజం మీద వేయించుకున్న టాటూ చూపించాడు. ఆ టాటూ నేను మరింత బాధ్యతగా ఉండాలనే స్ఫూర్తినిచ్చింది. నేను చెప్పేది ఏమిటంటే... ఏ రంగంలో ఉన్న మహిళలకైనా ఈ విధమైన ప్రశంసలు, విమర్శలు వస్తాయనుకుంటున్నా. రెండిటినీ స్వీకరిస్తూ బాధ్యతగా ఎంచుకున్న రంగంలో మహిళలు వందశాతం కృషి చేయాలి."

**- అలేఖ్యా హారిక**

**మగవాళ్లదే ఆధిపత్యమైన వినోద రంగంలో సరైన ప్రోత్సాహం దక్కితే మేమేం తక్కువ కాదు అంటూ అతివలు దూసుకుపోతున్నారు యూ ట్యూబ్ స్టార్‌గా, గీత రచయిత్రిగా, ఎగ్జిక్యూటివ్ ప్రొడ్యూసర్‌గా ప్రతిభను చాటుతున్న ముగ్గురు మహిళల అంతరంగం....**

అంతరంగం

# సంబరం ఎలా చేసుకుంటాం?

**- గీత రచయిత్రి శ్రేష్ఠ**



సొసైటీలో మహిళలకు స్వేచ్ఛ ఏది? రాణించాలనుకున్న రంగంలో ప్రోత్సాహం ఎక్కడ? అనుక్షణం అభద్రతా భావంతో బతుకుతూ, భద్రతలేని ప్రపంచంలో మహిళా దినోత్సవం ఎలా జరుపుకోవాలి? వర్ధమాన గీత రచయిత్రి శ్రేష్ఠ మనసులో ఆవేదన ఇది. 'ఒక రొమాంటిక్ క్రైమ్ కథ', 'జబర్దస్త్', 'పెళ్లి చూపులు', 'అర్జున్ రెడ్డి', 'యుద్ధం శరణం', 'హలో' వంటి చిత్రాల్లో విజయవంతమైన పాటలు రాశారామె! మహిళలపై జరుగుతున్న అకృత్యాలు, నిర్లక్ష్య ధోరణిపై ఇలా స్పందించారు.

- సాహిత్యం మీదున్న మక్కువతో నేను సినిమా పరిశ్రమలో అడుగుపెట్టా. ఇరవై సినిమాలకు పాటలు రాశా. వాటిలో ప్రేక్షకాదరణ పొందిన పాటలెన్నో ఉన్నాయి. కొన్ని అవార్డులూ అందుకున్నా. అయినా అవకాశాల కోసం ఎదురుచూడాల్సి వస్తోంది. . నా స్థానంలో మేల్ రైటర్ ఉంటే ఇప్పటికి వంద సినిమాలు పూర్తయ్యేవి. తొమ్మిదేళ్లలో 20 సినిమాల్లో 50 పాటలతో నేను సరిపెట్టుకోవలసి వస్తుందేమో!. హిట్ సాంగ్స్ నాకు ఎన్నో ఉన్నప్పటికీ ఓ అవకాశం కోసం ఆత్రంగా ఎదురుచూడాల్సిన పరిస్థితి కనిపిస్తోంది. రెమ్యూనరేషన్ విషయంలో కూడా వివక్షే. ఫిమేల్ రైటర్ ఓ పాట రాస్తే 'బడ్జెట్ తక్కువండీ! ఇంతే ఇవ్వగలం' అని బేరాలాడతారు. అదే మగవాళ్లు పాటలు రాస్తే.. మరో పదివేలు ఎక్కువ ఇచ్చి పంపుతారు. పూర్తిగా పురుషాధిక్య పరిశ్రమ సినీరంగం.' ఇక్కడ వివక్ష లేదు' అంటే అందులో నిజం ఉండదు. ఒకవేళ అమ్మాయిలకు ప్రోత్సాహం ఉందనుకుంటే అది ఆ అమ్మాయి తన వ్యక్తిత్వాన్ని కోల్పోవడమే! మన విలువలను కాపాడుకుంటూ ప్రోత్సహించే పెద్ద మనసు ఇండస్ట్రీలో అంతగా లేదు. ఏ బ్యాక్‌గ్రౌండ్ లేకుండా ఒంటరి పోరాటం చేస్తూ, ఇక్కడి వరకూ వచ్చానంటే నాకూ ఆశ్చర్యమే. ఇక్కడ నేను ఎదుర్కొన్న సమస్యల గురించి ఎంత గొంతెత్తినా... ఎక్కడో ఓ చోట 'నాకు అన్నం పెడుతున్న ఇండస్ట్రీ కదా' అని పాజిటివ్ వైబ్రేషన్స్ మళ్లీ తమాయించుకునేలా చేస్తున్నాయి. కొత్తగా వస్తున్న దర్శకులు, నిర్మాణ సంస్థల నుంచి అవకాశాలు వస్తున్నాయి తప్ప గుర్తింపు ఉన్న నిర్మాణ సంస్థల నుంచి ఏ అవకాశమూ రావడం లేదు.
- నేను పరిశ్రమలో అడుగుపెట్టిన ఏడాదిన్నర వరకూ అంతా బాగానే ఉంది. రామానాయుడుగారి చేతులమీదుగా ఓ అవార్డు అందుకున్నాక.. 'ఈ అమ్మాయి ఎవరో సేఫ్‌గా వచ్చి ఇండస్ట్రీలో సెటిల్ అయిపోయేలా ఉంది' అని రాజకీయాలు మొదలుపెట్టారు. పేరొచ్చే సమయంలో ఆటంకాలు మొదలయ్యాయి. రకరకాల సమస్యలు, ఇబ్బందులతో కొంతకాలం ఇండస్ట్రీకి దూరంగా ఉన్నా. హిట్ పాటలు, అవార్డులతో గుర్తింపు వచ్చినా తొందరగా మరచిపోయే నిర్లక్ష్య ధోరణి కనిపిస్తుంది. ప్రతిభను తొక్కేసే చర్యలే ఎక్కువగా కనిపిస్తున్నాయి. కళకు ఎల్లలు, ప్రాంతాలు లేవంటారు కదా! వంశీ పైడిపల్లి లాంటి తెలంగాణ దర్శకులు కూడా నా లాంటి తెలంగాణ అమ్మాయికి అవకాశం ఇవ్వట్లేదు.
- ఇండస్ట్రీ విషయాలు పక్కన పెడితే బయటి ప్రపంచంలో కూడా మహిళలకు ప్రోత్సాహం, భద్రత ఏది? పొద్దున్న పేపర్ తీసి చూస్తే నెలల పిల్లల నుంచి ముసలాళ్ల వరకూ అందరిపైనా అత్యాచారాలు అంటూ వార్తలు. ఇంత రక్షణ లేని ప్రపంచంలో.నూ .. మనకంటూ ఓ రోజు ఉంది దాన్ని సెలబ్రేట్ చేసుకోవాలి అని ఎలా అనుకొంటాం? 'నిర్భయ' దోషులకు ఉరి శిక్ష వేయకుండా ఇంకా రోజులు పొడిగిస్తున్నారంటే న్యాయం, రక్షణ ఎక్కడున్నాయి ? కనీసం ఇలాంటి రోజునైనా జరుగుతున్న అకృత్యాల మీద గొంతెత్తి మాట్లాడాలనీ, ఇప్పటికైనా ఈ ధోరణి మారాలంటూ పోరాటం చేయాలనిపిస్తుంది. వచ్చే ఏడాది కన్నా మంచి మార్పు వస్తే సంపూర్ణంగా మహిళా దినోత్సవ వేడుకను ఘనంగా జరుపుకోవచ్చు'

# భద్రత లేదు

**- దివ్యా విజయ్**



"భారతదేశానికి స్వాతంత్రం వచ్చిందనీ, ఆడవాళ్లు అన్ని రంగాల్లో రాణిస్తున్నారనే మాటలు వినడానికే బాగుంటాయి. 'నిర్భయ', 'దిశ' లాంటి సంఘటనలు ఎన్ని ఎదురైనా భద్రత విషయంలో ఇంకా వెనకబడే ఉన్నాం. విధులు పూర్తి చేసుకుని ఓ మహిళ ఒంటరిగా ఇంటికి వెళ్లాంటే పక్కన మనిషి తోడు కావలసిన పరిస్థితిని మనం చూస్తున్నాం. ఏళ్ల తరబడి మార్పు కోసం ఎదురుచూస్తూనే ఉన్నాం. ఏళ్లు గడుస్తున్నాయి తప్ప జరిగేది, ఒరిగేది ఏమీలేదు" అని అంటున్నారు దివ్యా విజయ్. తెలుగు చిత్రసీమలో పేరు పొందిన ఫైట్ మాస్టర్ విజయ్ కుమార్తె ఈమె! ఆడవాళ్లకు అతి తక్కువ స్పేస్ ఉండే చిత్ర పరిశ్రమలో ఎగ్జిక్యూటివ్ ప్రొడ్యూసర్‌గా బిజీగా ఉన్నారు.

"విజయ్ మాస్టర్ అమ్మాయిగా చాలామందికి నేను సుపరిచితమే! అమెరికాలో ఎంబీఏ చేశా. ప్రొడక్షన్‌లో నాకు బాగా ఇంట్రెస్ట్ ఉందని 18 ఏళ్ల వయసులో పూర్తిగా అర్థమైంది. చదువు పూర్తి చేసి పరిశ్రమలో అడుగుపెట్టా. వర్క్ మీద ఐడియా కోసం 'రంగస్థలం' సినిమాకు ఇంటర్న్‌షిప్‌లా చేశా. తమ్ముడు రాహుల్‌తో 'ఈ మాయ పేరేమిటో' సినిమా తీశాం. ఆ తర్వాత పీపుల్ మీడియా ఫ్యాక్టరీ బ్యానర్‌లో 'ఓ బేబీ', 'వెంకీమామ' - ఇలా ప్రస్తుతం ఏడు సినిమాలకు ఎగ్జిక్యూటివ్ ప్రొడ్యూసర్‌గా పనిచేస్తున్నా. గతంలో సినిమా పరిశ్రమ అనగానే ఓ అపోహ ఉండడంతో పాటు నచ్చిన శాఖలోకి రావడానికి సరైన గేట్‌వే ఉండేది కాదు. ఇప్పుడు చదువుకున్నవాళ్లు, సినిమా ఇండస్ట్రీలో ఎలా ముందుకెళ్లాలి అన్నదానిపై అవగాహన ఉన్నవాళ్లు ఎక్కువయ్యారు. మహిళలు పరిశ్రమలో రాణించాలంటే ఉండాల్సింది మంచి కమ్యూనికేషన్. సమస్యలు, ఇబ్బందులు రంగంలో ఏ రంగంలో అయినా సహజం. వాటిని అధిగమించే టెక్నిక్ తెలియాలి. 'ఎదుటి వ్యక్తి మనతో ఎలా ఉంటున్నారు? మనం వాళ్లతో ఎలా ఉండాలి' అన్న విషయంలో క్లియర్‌గా ఉండాలి. నేను ఆ విషయంలో చాలా జాగ్రత్తగా ఉంటా. ఎందుకంటే నా కుటుంబ సభ్యులు 'మనసుకు నచ్చింది చెయ్యి' అని ఫ్రీడమ్ ఇచ్చారు. నా హద్దులు మీరకుండా ముందుకెళ్తున్నా.

- సినీ పరిశ్రమ పురుషాధిక్యత గల ఇండస్ట్రీ. ఆడవాళ్లు ఇక్కడ రాణించడం అంత సులువేం కాదు. కానీ ఒకప్పటితో పోలిస్తే ఇప్పుడు మార్పు వస్తోంది. ఓ మహిళ ఐటీ రంగంలో ఉన్నా, సినిమాల్లో ఉన్నా వర్క్ ఇంటిగ్రిటీ, డెడికేషన్ ఒకేలా ఉండాలి. ఎక్కడికెళ్లినా అమ్మాయిలకు భద్రత మాత్రం కరువైంది. జిమ్ నుంచి ఇంటికి వెళ్లాలంటే తమ్ముడు వస్తే కానీ వెళ్లను. తను రావడం కుదరదు అంటే ఆ రోజు జిమ్ మానేసి ఇంట్లో కూర్చుంటా. నేనే కాదు... చాలామంది అమ్మాయిలకు ఇదే పరిస్థితి. అందుకే ఈ మహిళా దినోత్సవం నుంచైనా సమాజంలో మహిళల్ని చూసే విధానంలో మార్పు రావాలని ఆశిస్తున్నాం. మహిళకు పూర్తిస్థాయి భద్రత, స్వేచ్ఛ ఉన్న రోజే అసలైన మహిళా దినోత్సవం జరుపుకోవాలి."

**"పదిహేనేళ్లుగా నేను చేసిన చిత్రాలు వేరే. నిజంగా నా ఆలోచనా విధానం వేరే. ఇప్పుడు నా ఆలోచనలకు తగ్గట్టు చిత్రాలు చేయాలని బలంగా నిర్ణయించుకున్నాను. ఇప్పుడు... విష్ణు ఒరిజినల్ వెర్షన్ రావొచ్చు. ప్రారంభం నుండి నేను నాకు నచ్చినట్టు చేసుంటే... నా ఒరిజినాలిటీ నాకు ఉండేది. నేను నమ్మింది 'మోసగాళ్ళు'లో చేస్తున్నా" అని మంచు విష్ణు అన్నారు. ప్రస్తుతం ఆయన 'మోసగాళ్లు' చిత్రంలో నటిస్తున్నారు. ఇటీవల 'చదరంగం' వెబ్ సిరీస్ నిర్మించారు. వీటితో పాటు కలల చిత్రం 'భక్త కన్నప్ప' గురించి విష్ణు మాట్లాడారు.**

# ఆ రాజకీయాలు ఇప్పుడే ఎక్కువ!

**- మంచు విష్ణు**



**'చదరంగం' వెబ్ సిరీస్ కోసం పరిశోధన చేసినప్పుడు... ఆ రోజుల్లో కంటే ఇప్పుడే కుల రాజకీయాలు ఎక్కువని తెలిసింది. 'థాంక్ గాడ్... నేను రాజకీయాల్లో లేను' అనుకున్నా. రాజకీయాల పరంగా తప్పు, ఒప్పు... ఏదైనా నా తొలి ప్రాధాన్యం కుటుంబానికి. నా భార్య వెరోనికా ఫ్యామిలీకి. తన తర్వాతే ఎవరైనా!**

ఇప్పటివరకూ నేను నటించిన చిత్రాలన్నీ మంచివే. కాకపోతే... వాటిని తెరపై ఆవిష్కరించే క్రమంలో కొన్ని తప్పులు జరిగాయి. అమెరికాలో 'ఆచారి అమెరికా యాత్ర' చిత్రీకరణ చేస్తున్నప్పుడు ఆడదని అర్థమైంది. తప్పు ఎక్కడ జరుగుతుందో విశ్లేషించుకోవాలని... ఏడాదిన్నర విరామం తీసుకున్నా. ఈ విరామంలో 'నాకు నచ్చినది కాదు. నాకు నప్పే డ్రస్ వేసుకోవాలి' అని తెలుసుకున్నా.

**కథలపై ఖర్చుపెట్టా!**

ఏడాదిన్నరగా నా దగ్గరున్న కాస్త డబ్బును కథలు తయారు చేయడంపై ఖర్చుపెట్టా. అమెరికాలో 'వియామార్ ఎంటర్‌టైన్‌మెంట్స్' సంస్థ స్థాపించి అక్కడి రచయితలతో కథలు సిద్ధం చేయిస్తున్నా.

**'లార్డ్ ఆఫ్ ది రింగ్స్' శైలిలో 'భక్త కన్నప్ప'**

హాలీవుడ్ సినిమా 'లార్డ్ ఆఫ్ ది రింగ్స్' శైలిలో 'భక్త కన్నప్ప'ను భారీగా తీయాలనేది నా సంకల్పం. అందుకని, నాలుగైదేళ్ల క్రితం తనికెళ్ల భరణి అంకుల్ కథ చెప్పినప్పుడు హాలీవుడ్ సాంకేతిక నిపుణులతో ప్రీ-ప్రొడక్షన్ వర్క్స్ ప్రారంభించా. నేను అనుకున్నట్టుగా సినిమాను తీయాలంటే సుమారు రూ. 100 కోట్లు కావాలి. అంత భారీగా తీయాలంటే తన వల్ల కాదని భరణిగారు అన్నారు. తెలుగులో అగ్రస్థాయి దర్శకుల దగ్గరకు వెళితే ఎక్కువ పారితోషికం అడిగారు. అందుకని, హాలీవుడ్ దర్శకుడితో సినిమా తీస్తా.

**జూన్‌లో డ్రీమ్ ప్రాజెక్ట్ ప్రకటన!?**

నిర్మాతగా మూడు చిత్రాలు చేయబోతున్నా. జూన్ లేదా ఆగస్టులో నా డ్రీమ్ ప్రాజెక్ట్ ప్రకటిస్తా. ఇప్పుడు నేను అనుకున్నవి అనుకున్నట్టు జరగాలంటే... 'మోసగాళ్ళు' విజయం సాధించాలి!

**నా శ్రీమతి వెరోనికా చాలా తెలివైనది. స్మార్ట్ మమ్మీ! మాకు నలుగురు పిల్లలు. వాళ్ల పెంపకం విషయంలో తనని అనుసరిస్తా. రాత్రి ఏడు గంటల తర్వాత బయటకు వెళ్లను. రాత్రి భోజనం అందరం కలిసే చేస్తాం.**

విశేషం



## అతి పొడవైన వాటర్ స్లైడ్

అమ్యూజ్‌మెంట్ పార్కుల్లో వాటర్ స్లైడ్‌లపై ఎంజాయ్ చేసుంటారు కదా! వాటర్ స్లైడ్ ఎక్కితే కొన్ని సెకన్లలోనే జారుకుంటూ నీళ్లలో పడిపోతారు. కానీ మలేసియాలో ఉన్న వాటర్‌స్లైడ్ ఎక్కితే నాలుగు నిమిషాల పాటు మీరు స్లైడ్‌పై జారిపోతూనే ఉంటారు. చివరగా పెద్ద స్విమ్మింగ్‌పూల్‌లో పడతారు. 1140 మీటర్ల పొడవు ఉన్న దీనికి 'వరల్డ్ లాంగెస్ట్ వాటర్ స్లైడ్'గా గుర్తింపు ఉంది. గత ఏడాది ఆగస్టులో పెనాంగ్ ఎస్కేప్ థీమ్ పార్క్‌లో దీన్ని ప్రారంభించారు. ఇప్పటి వరకు న్యూజెర్సీలో ఉన్న వాటర్‌స్లైడ్ అతి పొడవైన స్లైడ్‌గా రికార్డుల్లో నమోదయింది. దాని పొడవు 605 మీటర్లు. ఇప్పుడు మలేసియాలో ప్రారంభమైన ఈ స్లైడ్ ఆ రికార్డును బద్దలుకొట్టింది.



8 తేడాలు గుర్తించండి



జవాబు



సరైన నీడను గుర్తించండి



ఏ భాగం ఎక్కడ?

## డైలీ సుడోకు - 301

| | | | | | | | | |
|---|---|---|---|---|---|---|---|---|
| 5 | | | | | | | | 2 |
| | | | 4 | 7 | 9 | | | |
| 7 | 1 | 6 | 2 | | | | | |
| | 9 | | 6 | 4 | 1 | 5 | | 8 |
| 6 | 5 | | | | | | 7 | 4 |
| 4 | | 1 | 5 | 3 | 7 | | 6 | |
| | | | | | 4 | 3 | 9 | 5 |
| | | | 8 | 2 | 3 | | | |
| 1 | | | | | | | | 6 |

ప్రతి బాక్స్‌లో 9 గళ్లు ఉంటాయి. ఒక్కో బాక్స్‌ను 1 నుంచి 9 వరకు అంకెలతో పూరించాలి. అన్ని బాక్స్‌లనూ కలిపి చూస్తే నిలువుగా, అడ్డంగానూ ఏ లైనులోనూ ఒకసారి వాడిన అంకెను తిరిగి వాడకూడదు.

సుడోకు- 300 సమాధానం

| | | | | | | | | |
|---|---|---|---|---|---|---|---|---|
| 8 | 9 | 2 | 7 | 1 | 6 | 4 | 3 | 5 |
| 4 | 1 | 3 | 5 | 9 | 2 | 8 | 6 | 7 |
| 6 | 5 | 7 | 3 | 4 | 8 | 2 | 9 | 1 |
| 5 | 4 | 8 | 1 | 6 | 3 | 9 | 7 | 2 |
| 1 | 7 | 6 | 8 | 2 | 9 | 3 | 5 | 4 |
| 3 | 2 | 9 | 4 | 5 | 7 | 1 | 8 | 6 |
| 9 | 8 | 4 | 2 | 7 | 5 | 6 | 1 | 3 |
| 2 | 3 | 5 | 6 | 8 | 1 | 7 | 4 | 9 |
| 7 | 6 | 1 | 9 | 3 | 4 | 5 | 2 | 8 |


ARKA MEDIAWORKS PRESENTS
MAHAYANA MOTION PICTURES
ఉమామహేశ్వర ఉగ్రరూపస్య...
PRODUCED BY VIJAYA PRAVEENA PARUCHURI M.D. SHOBU YARLAGADDA PRASAD DEVINENI
STORY BY SYAM PUSHKARAN
ADAPTED & DIRECTED BY VENKATESH MAHA
DIRECTOR OF PHOTOGRAPHY APPU PRABHAKAR
MUSIC DIRECTOR BIJIBAL
డియర్ CBSE,ICSE
మరియు ఇంటర్మీడియట్ విద్యార్థులు,
ఫైనల్ ఎగ్జామ్స్ వ్రాస్తున్న తమ్ముళ్లు మరియు
చెల్లెమ్మలందరికీ, అన్నయ్య మహేషు వైపునుండి ఆల్ ది బెస్ట్.
ఇట్లు : జి.ఉమామహేశ్వరరావు, ప్రొ : కోమలి ఫోటో స్టూడియో,
అరకు వేలి, విశాఖ జిల్లా.
ADITYA MUSIC
/ARKAMEDIAWORKS
/ARKAMEDIAWORKS
/ARKAMEDIAWORKS


బగ్గిడి గోపాల్
నిర్మాత : బగ్గిడి గోపాల్ B.Sc
స్క్రీన్ ప్లే - దర్శకత్వం : అర్జున్ కుమార్
మార్చి 13
విడుదల


LOVED BY MASSES & CRITICS
THAMMAREDDY BHARADWAJ PRESENTS
SUDHAS MEDIA
media9
SURESH PRODUCTIONS
MASS
HIT
RAKSHIT IN
1978
పలాస
Written & Directed by
KARUNA KUMAR
DHYAN ATLURI MANOJ KUMAR ARUL VINCENT RAGHU KUNCHE
KOTAGIRI VENKATESWAR RAO SUDDALA ASHOKTEJA
A.R BELLANA BHASKARABATLA RAVIKUMAR LAKSHMI BHUPALA BANDI SATHYAM
RAM SUNKARA VIJAY POLAKI NAGENDRA KASI SURESH MARPINA GSK MEDIA I QUBE DIGITALS
#PALASA1978


LAKSHMI VENKATESWARA FRAMES
D.V. Cine Creations PROUDLY PRESENTS
FROM MARCH 13th
పిజ్జా
తరువాత
భారీ అంచనాలతో
వస్తున్న
పిజ్జా-II
Never Seen Story
Producer
Uday Harsha Vaddella, D.Venkatesh
Director Ranjit Jeyekodi
Sam C.S Dinesh Krishna Bhavan Sreekumar
GUNTUR & KRISHNA- P.Chanbasha(through) GUNTUR- Kamakshi films: 9849448471 KRISHNA-A.B.Enterprises: 9393999937 NELLORE- Sri Hanuman Sai Films: 9849118745 EAST-Mahadeva Naidu Visuals: 9391444599 WEST-Usha Pictures: 9246664689 VIZAG- Kiran:97890 55799 CEDED- Chittoor:S.K.Picture- 9989830794,9391048646 Kadapa: S.A.Pictures:9676906041 Karnool: Sitaare Films: 7794945888 Anantapur: Jagadeswari films: 9440155064 BELLARY-? NIZAM-? for TRADE ENQUIRES-9160111911 / 8332964379


HIGH INTENSITY THRILLER
WALL POSTER CINEMA
NANI PRESENTS
BIG
VISHWAK SEN IN
HIT
THE FIRST CASE
PRODUCED BY PRASHANTI TIPIRNENI
WRITTEN & DIRECTED BY Dr SAILESH KOLANU
DOP S MANIKANDAN MUSIC DIRECTOR VIVEK SAGAR
ART DIRECTOR AVINASH KOLLA EDITOR GARRY BH
EXECUTIVE PRODUCER S VENKATARATHNAM (VENKAT)
SOUND DESIGN SYNC CINEMA STUNTS NABA
PUBLICITY DESIGNERS ANIL & BHANU PRO VAMSI KAKA
SMOKING IS INJURIOUS TO HEALTH
#HITMOVIE SONY MUSIC U/A


SREE MOOKAMBIKA PRODUCTIONS
RAVI KUMAR PRESENTS
మహిళా దినోత్సవ
శుభాకాంక్షలతో
త్వరలో...
మా
గంగానది
అంత పవిత్రమైనది స్త్రీ
WRITTEN & DIRECTED BY : V. BALA NAGESWARA RAO
PRODUCERS : V. NAGESWARA RAO, SURYA VANTARAM, M.N.V. SUDHAKAR
MUSIC : SUNIL KASHYAP DOP : PRAVEEN VANAMALI EDITOR : BONTHALA NAGESWARA REDDY PRO : CHANDRA VATTI KUTI, MOHAN THUMMALA


HAAWSOME BLOCKBUSTER
PDV PRASAD PRESENTS
SITHARA ENTERTAINMENTS
భీష్మ
SINGLE FOREVER
SURYADEVARA NAGA VAMSI VENKY KUDUMULA
SAI SRIRAM MAHATI SWARA SAGAR NAVIN NOOLI
SAHI SURESH VENKAT S.VENKATARATHNAM (VENKAT)


THIRD EYE PRODUCTIONS
"SPARSE, BLUNT AND WHOLLY ENGROSSING" - CICFF
"A NARRATIVE FULL OF TENSION AND MYSTERY" - ROME PRISMA AWARDS
MADHA
MARCH 13TH 2020
A FILM BY: SRIVIDYA BASAWA PRODUCED BY: INDIRA BASAWA
DIRECTOR OF PHOTOGRAPHY: ABHIRAJ NAIR MUSIC: NARESH KUMARAN WRITTEN BY: PRASHANTH SAGAR ATLURI
EDITOR: RENITH TOACHRIYER SFX & MIXING: SYNC CINEMA, ARAVIND MENON PUBLICITY DESIGN: JAIRAM POSTERWALA

# దీర్ఘకాలిక 'సిప్'కు వేళాయె..

**పెట్టుబడులకు 70:20:10 నిష్పత్తి మంత్రం**

**ఆచరిస్తే భవిష్యత్‌లో మెరుగైన ప్రతిఫలాలు**



కరోనా కలకలంతో భారత ఈక్విటీలు ఈ ఏడాదిలో ఆర్జించిన లాభాలు తుడిచిపెట్టుకుపోయాయి. కొన్ని కంపెనీల షేర్ల విలువలైతే ఈ ఏడాది ఆరంభ స్థాయి కంటే దిగువకు పడిపోయాయి. చిన్న మదుపరులు దీర్ఘ కాలిక వ్యూహంతో క్రమానుగత పెట్టుబడి పథకాల్లో (సిప్)కి పొదుపు సొమ్ము మళ్లించేందుకు ఇది మంచి తరుణమని ఆర్థిక సలహాదారులు సూచిస్తున్నారు. సిప్ ఇన్వెస్టర్లు తమ పెట్టుబడి పోర్ట్‌ఫోలియోలో 70 శాతం లార్జ్‌క్యాప్ ఫండ్లలోకి, 20 శాతం మిడ్‌క్యాప్, మిగతా 10 శాతం స్మాల్‌క్యాప్ ఫండ్లలోకి మళ్లించడం మేలని ప్లాన్ ఎహెడ్ వెల్త్ మేనేజర్స్ సీఎఫ్‌పీ (చీఫ్ ఫైనాన్షియల్ ప్లానర్) విశాల్ ధావన్ సూచించారు. గతంలో తమ మెజారిటీ పెట్టుబడులను మిడ్, స్మాల్‌క్యాప్ ఫండ్లలోకి మళ్లించిన వారు సైతం ప్రస్తుతం పోర్ట్‌ఫోలియోను 70:20:10 శాతం నిష్పత్తికి అనుగుణంగా సర్దుబాటు చేసుకోవడం మేలని అంటున్నారు.

తద్వారా దీర్ఘకాలంలో మెరుగైన ప్రతిఫలాలు అందుకునే అవకాశాలుంటాయని ధావన్ అభిప్రాయపడ్డారు. కరోనా వైరస్ ఇతర దేశాలకు వేగంగా వ్యాప్తి చెందుతుండటంతో ఈ నెలలో ప్రపంచవ్యాప్తంగా ఈక్విటీ మార్కెట్లు భారీ పతనాన్ని చవిచూశాయి. భారత మార్కెట్లూ ఇందుకు అతీతం కాదు. అయితే, గత కొద్దికాలంగా ప్రపంచవ్యాప్తంగా ఈక్విటీ మార్కెట్లలో భారీగా కొనుగోళ్లు జరిగాయి. దాంతో చాలా కంపెనీల షేర్ల విలువలు సముచిత స్థాయికి ఎగువన ట్రేడవుతూ వచ్చాయి.

దీంతో బడా ఇన్వెస్టర్లు కరోనా భయాలను సాకుగా చూపుతూ పెద్దఎత్తున లాభాల స్వీకరణకు పాల్పడ్డారన్న వాదనలూ విన్పిస్తున్నాయి. పోటెత్తిన అమ్మకాలతో శరవేగంగా పతనమైన ఈక్విటీ మార్కెట్లు మళ్లీ అంతే వేగంతో పుంజుకునే అవకాశాలున్నాయని ఓరోవెల్త్ వ్యవస్థాపకులు విజయ్ కుప్ప అన్నారు.

కాబట్టి, మార్కెట్ పతనమైన తరుణంలో పెట్టుబడులు పెడితే సిప్ ఇన్వెస్టర్లకు తక్కువ సొమ్ముకు ఎక్కువ యూనిట్లు లభించే అవకాశం ఉంటుందన్నారు. సిప్ ఇన్వెస్టర్లు కనీసం 7-10 ఏళ్లపాటు తమ పెట్టుబడులను కొనసాగించే వ్యూహంతో ఈక్విటీ మ్యూచువల్ ఫండ్లలోకి ప్రవేశిస్తే మెరుగైన ప్రతిఫలాలు రాబట్టుకోవచ్చని ఫైనాన్షియల్ ప్లానర్లు సూచిస్తున్నారు.

**గత మూడేళ్లలో సిప్ ప్రతిఫలాలు**

| ఫండ్ కేటగిరీ | ప్రతిఫలాలు(%) |
|---|---|
| లార్జ్‌క్యాప్ | 5.90 |
| లార్జ్ అండ్ మిడ్‌క్యాప్ | 4.77 |
| మల్టీక్యాప్ | 5.24 |
| మిడ్‌క్యాప్ | 3.96 |
| స్మాల్‌క్యాప్ | - 0.16 |

# ఆన్‌లైన్ లావాదేవీలకు కార్డులు వాడలేదా?




మీకు డెబిట్, క్రెడిట్ కార్డులున్నాయా? వాటిని దుకాణాల్లో లేదా ఇతర ప్రాంతాల్లో పాయింట్ ఆఫ్ సేల్ మిషన్ల వద్ద బిల్లుల చెల్లింపులకే తప్ప ఎప్పుడూ ఆన్‌లైన్ లావాదేవీలకు వినియోగించలేదా? అయితే మీరు ఒక్కసారైనా ఆన్‌లైన్ లావాదేవీల కోసం ఈ కార్డులను వినియోగించుకోండి. లేకపోతే ఇకపై మీరు ఈ కార్డులతో ఆన్‌లైన్ లావాదేవీలు చేసే అవకాశం ఉండదు. ఒక్కసారి కూడా ఆన్‌లైన్ లావాదేవీల కోసం కార్డులను వినియోగించుకోకపోతే మార్చి 16 నుంచి ఆన్‌లైన్, కాంటాక్ట్‌లెస్ లావాదేవీలకు ఈ కార్డులు పని చేయవు. డెబిట్, క్రెడిట్ కార్డుల భద్రతను పెంచే నిమిత్తం ఈ ఏడాది జనవరి 20న భారత రిజర్వు బ్యాంక్ ఒక నోటిఫికేషన్‌ను జారీ చేసింది. ఇప్పటి వరకు ఆన్‌లైన్ లేదా కాంటాక్ట్‌లెస్ లెస్ లావాదేవీలను నిర్వహించని కార్డులకు ఈ సదుపాయాన్ని నిలిపివేయాలని కార్డుల జారీ సంస్థలను కోరింది. ఈ నేపథ్యంలో డెబిట్, క్రెడిట్ కార్డులున్న వారు మార్చి 16 వరకు ఆన్‌లైన్ లావాదేవీలు నిర్వహిస్తే ఈ సదుపాయం కొనసాగుతుంది. లేకపోతే ఆ సదుపాయం నిలిచిపోతుంది.

# అమ్మకానికి బీపీసీఎల్

**బిడ్ల దాఖలుకు ఆహ్వానం**

న్యూఢిల్లీ: భారత్ పెట్రోలియం కార్పొరేషన్ లిమిటెడ్ (బీపీసీఎల్)లో 52.98 శాతం వాటాలను విక్రయించేందుకు గాను ప్రభుత్వం శనివారం బిడ్లను ఆహ్వానించింది. ఆసక్తి కలిగిన సంస్థలు మే 2వ తేదీలోగా బిడ్లను దాఖలు చేయవచ్చని తెలిపింది. వ్యూహాత్మక పెట్టుబడుల ఉపసంహరణలో భాగంగా బీపీసీఎల్‌లో ప్రభుత్వం తన వాటాను విక్రయిస్తోందని డిపార్ట్‌మెంట్ ఆఫ్ ఇన్వెస్ట్‌మెంట్ అండ్ పబ్లిక్ అసెట్ మేనేజ్‌మెంట్ (దీపమ్) వెల్లడించింది. అయితే.. నుమాలీగఢ్ రిఫైనరీ లిమిటెడ్‌లో బీపీసీఎల్‌కు ఉన్న 61.65 శాతం ఈక్విటీ షేర్లను మాత్రం.. ప్రభుత్వ చమురు సంస్థకు మాత్రమే విక్రయించనున్నట్లు పేర్కొంది. బీపీసీఎల్ బిడ్డింగ్ ప్రక్రియను రెండు దశల్లో నిర్వహించనున్నారు. ఆసక్తి వ్యక్తీకరణ (ఈఓఐ) దశలో అర్హులైన బిడ్డర్లు, రెండవ దశలో ఫైనాన్షియల్ బిడ్ దాఖలు చేయాల్సి ఉంటుంది.

**వేలం నిబంధనల ప్రకారం..**

- నాలుగు సంస్థలకు మించి ఉన్న కన్సార్షియం, ప్రభుత్వ రంగ సంస్థలు బిడ్డింగ్‌కు అనర్హం. రూ. 74,000 కోట్ల విలువ కలిగిన ప్రైవేటు సంస్థలు పాల్గొనవచ్చు
- కన్సార్షియంలోని ప్రధాన సంస్థకు 40 శాతం వాటా ఉండాలి. మిగిలిన వాటాదారుల నికర విలువ కనీసం రూ. 7,400 కోట్లు ఉండాలి
- బీపీసీఎల్ వాటాను చేజిక్కించుకున్న సంస్థకు భారత్‌లోని చమురు శుద్ధి సామర్థ్యంలో 14 శాతం వాటా, ఇంధన మార్కెట్‌లో నాలుగో వంతు వాటా దక్కుతుంది.

**ఫామ్‌గేట్ ధర (కిలో) రూ. వెన్‌కాబ్ బ్రాయిలర్ చికెన్**



| | | | |
|---|---|---|---|
| హైదరాబాద్ | 37 | విజయవాడ | 45 |
| వరంగల్ | 37 | గుంటూరు | 45 |
| మహబూబ్‌నగర్ | 37 | ఒంగోలు | 45 |
| కరీంనగర్ | 35 | చిత్తూరు | 45 |
| కర్నూలు | 37 | నెల్లూరు | 45 |
| విశాఖపట్నం | 30 | అనంతపురం | 35 |
| గోదావరి | 30 | | |

**ఫారం గేటు అమ్మకం ధరలు (నెక్ 100 గుడ్లు)**



| | | | |
|---|---|---|---|
| 7వ తేదీకి.. | | | |
| హైదరాబాద్ | 280 | విజయవాడ | 316 |
| 8వ తేదీకి.. | | విశాఖపట్నం | 350 |
| చిత్తూరు | 323 | వరంగల్ | 283 |
| గోదావరి | 316 | డజను గుడ్లు రూ. 54 | |



*మన దేశంలో మహిళలు ఆర్థిక సాధికారత విషయంలో ఇంకా వెనుకబడి ఉన్నారు. విభిన్న రంగాల్లో మహిళలు ఎంతగానో పురోగమించినా ఆర్థిక సాధికారతలో మాత్రం వెనుకబడిపోవడానికి కుటుంబ కట్టుబాట్లు, తల్లిదండ్రుల ఆలోచనా ధోరణులు, మహిళలు స్వయంగా విధించుకునే పరిమితులు కారణమని చెప్పవచ్చు. పని ప్రదేశాల్లో మహిళలకు పురుషులతో పోల్చితే తక్కువ వేతనాలు అందుతున్నాయి. ఆర్థికపరమైన అంశాలపై అవగాహన లేకపోవడం, కుటుంబ బాధ్యతలు, వివాహపరమైన అవరోధాలు మహిళలు ఆర్థికంగా పురోగమించకుండా అడ్డు తగులుతున్నాయి. చట్టాల్లో కూడా వారి పట్ల వివక్ష అధికంగా ఉంది. ఈ అవరోధాలన్నీ దాటుకుంటూ వారు ఆర్థిక సాధికారత సాధించడం ఎలాగంటే..*

# ఆర్థిక సాధికారత.. మహిళకు భద్రత

## ఆర్థిక అక్షరాస్యతకు ప్రాధాన్యం

భారత మహిళలు ఆర్థిక బాధ్యతలు చేపట్టేందుకు విముఖంగా ఉంటారు. దీనివల్ల వారి వ్యక్తిగత ఆర్థిక వ్యవహారాల నిర్వహణలో కూడా పురుషులదే పైచేయిగా మారుతుంది. ఉద్యోగాలు చేస్తున్న మహిళలు కూడా తమ ఆర్థిక వ్యవహారాల నిర్వహణను భర్తకు అప్పగిస్తుంటారు. దీంతో ఆర్థికపరమైన అంశాలపై అవగాహన తక్కువగా ఉండటానికి అవకాశం ఏర్పడుతుంది. పురుషులతో పోల్చితే మహిళల సగటు జీవిత కాలం అధికంగా ఉంటుంది. ఒక అధ్యయనం ప్రకారం 60 ఏళ్లు నిండే సమయానికి పురుషుల సగటు జీవిత కాలం 77.2 సంవత్సరాలుంటే మహిళలకు 78.6 సంవత్సరాలుంది. అంటే పురుషులతో పోల్చితే మహిళలే సగటున ఎక్కువ కాలం జీవిస్తున్నారన్న మాట. 2011 జనాభా లెక్కల ప్రకారం అవివాహితలు, విడాకులు తీసుకున్నవారు, భర్త లేని వారు, ఒంటరి మహిళల సంఖ్య 7.4 కోట్లుంది. ఇలాంటి వారు ఆర్థికంగా ఇబ్బందులు ఎదుర్కోకుండా ఉండాలంటే ఆర్థిక అక్షరాస్యత ఎంతైనా అవసరం.

## పొదుపు పెరగాలి

పురుషులతో పోల్చితే మహిళలు అందుకునే వేతనాలు తక్కువగా ఉండడం పరిపాటి. సమాన హోదాలో పని చేస్తున్నప్పటికీ వారు తక్కువ వేతనాలు పొందుతున్నారు. దీనికి తోడు మహిళలు ఆర్థిక వ్యవహారాలు సమర్థవంతంగా నిర్వహించలేరనే అపోహ కూడా సమాజంలో ఉంది. మహిళల సగటు జీవిత కాలం అధికంగా ఉంటున్న తరుణంలో సొంతంగానే ఆర్థిక వ్యవహారాలు చక్కబెట్టుకోగల నైపుణ్యాలు సాధించడం, దీర్ఘకాలిక పొదుపుపై దృష్టి పెట్టడం అవశ్యం. వేతనాలు తక్కువ ఉన్నందు వల్ల పురుషుల కన్నా అధికంగా పొదుపు చేయాల్సి ఉంటుంది. మహిళలు ఉద్యోగం చేసే కాలపరిమితి పురుషులతో పోల్చితే తక్కువ. మాతృత్వపు సెలవులతోపాటు కుటుంబ సభ్యులు తీవ్ర అనారోగ్యం పాలైతే వారి సంరక్షణ బాధ్యతలు నిర్వర్తించేందుకు దీర్ఘకాలిక సెలవులు తీసుకోవడం వంటివి తప్పనిసరి.

## భద్రత ప్రధానం

కుటుంబ సంక్షేమంతో పాటు తమ సొంత భద్రతకు మహిళలు ప్రాధాన్యం ఇవ్వాలి. తమ పిల్లల భవిష్యత్ కోసం పొదుపు చేయడంతో పాటు తమ రిటైర్మెంట్ కోసం పొదుపు చేయడంపై దృష్టి పెట్టాలి. ఇందుకు విభిన్న పొదుపు సాధనాలను ఎంచుకోవడంతో పాటు వయసుల వారీగా కేటాయింపులు చేసుకోవాలి. ఉదాహరణకు 30 ఏళ్ల వయసున్న మహిళలు తమ కోసం పొదుపు చేసుకునే మొత్తంలో 70 శాతం ఈక్విటీకి, 30 శాతం డెట్‌కు కేటాయించుకోవచ్చు. వీటిలో ఈక్విటీ ఫండ్లతో పాటు ఈపీఎఫ్, వీపీఎఫ్, పీపీఎఫ్, ఎన్‌పీఎస్ వంటి రక్షిత సాధనాలపైనా దృష్టి పెట్టాలి. పొదుపు ఒక్కటే కాదు.. ఏదైనా ఆర్థిక సంక్షోభం తలెత్తితే ఆదుకునేందుకు కనీసం నాలుగు నుంచి ఆరు నెలల పాటు కుటుంబ ఖర్చులను తట్టుకోగల అత్యవసర నిధి సమకూర్చుకోవాలి. అంతేకాకుండా వార్షిక వేతనానికి 7 నుంచి 10 రెట్లు అధికంగా బీమా రక్షణ పొందాలి. జీవిత బీమాతో పాటు ఆరోగ్య రక్షణ ప్లాన్లు, క్రిటికల్ ఇల్‌నెస్ ప్లాన్లపై దృష్టి పెట్టాలి. ఒకేసారి ఇంత భారీ మొత్తం ఇన్వెస్ట్ చేయడానికి తటపటాయించే ఆస్కారం ఉంది.

**వయసును బట్టి పొదుపు:** వయోవృద్ధుల కోసం నిర్దేశించుకున్న పెట్టుబడిలో 20 శాతం ఈక్విటీలో, 30 శాతం డెట్‌లో ఇన్వెస్ట్ చేసి 50 శాతం నగదును చేతిలో ఉంచుకోవాలి. పిల్లల కోసం కేటాయించే పెట్టుబడిలో 90 శాతం ఈక్విటీ, 5 శాతం డెట్, 5 శాతం నగదు ఉంటే చాలు.

| పొదుపు వ్యూహం | ఈక్విటీ | డెట్ | నగదు నిల్వ |
|---|---|---|---|
| సొంతానికి | 65 శాతం | 25 శాతం | 10 శాతం |
| అత్తమామలకు | 20 శాతం | 30 శాతం | 50 శాతం |
| పిల్లలకు | 90 శాతం | 5 శాతం | 5 శాతం |

అత్తమామల కోసం పెట్టే పెట్టుబడిలో కొంత మొత్తాన్ని ఆరోగ్య బీమాకు కేటాయించాలి. వయసు పెరిగే కొద్ది అనారోగ్యాల రిస్క్ అధికంగా ఉంటుంది. ఆ రిస్క్‌ను తట్టుకోవాలంటే అత్తమామలకు బీమా ఉండి తీరాలి. అలాగే పిల్లల కోసం పెట్టుబడి పెట్టే తరుణంలో 18 ఏళ్లు నిండే సమయానికి వారి ఆర్థిక అవసరాలకు అనుగుణంగా స్వల్పకాలిక, దీర్ఘకాలిక సాధనాల్లో ఇన్వెస్ట్ చేసుకోవచ్చు. పిల్లలకు 18 ఏళ్లు నిండే నాటికి ఉన్నత విద్యాభ్యాసం, వివాహం కోసం ఖర్చు చేయాల్సి ఉంటుంది. ఇందుకోసం దీర్ఘకాలిక క్రమానుగత పెట్టుబడి ప్రణాళిక (సిప్)ను అనుసరించాలి.

**25 ఏళ్ల వయసులో ఉన్న పురుషులు, మహిళల్లో వేతన వ్యత్యాసం, కెరీర్ బ్రేక్‌లు ఇతరత్రా అంశాలను పరిగణనలోకి తీసుకుంటే పదవీ విరమణ నాటికి ఎవరి చేతిలో ఎంత కార్పస్ ఉంటుందో చూద్దాం.**

| | పురుషులు | మహిళలు |
|---|---|---|
| 25 ఏళ్ల వయసులో ప్రారంభ వేతనం | రూ.40,000 | రూ.32,400 |
| తొలి దశలో వేతన వ్యత్యాసం | ------- | 19 శాతం |
| వార్షిక ఇంక్రిమెంట్ | 8 శాతం | 8 శాతం |
| వేతనంలో పొదుపు | 10 శాతం | 10 శాతం |
| పెట్టుబడి వృద్ధి రేటు | 10 శాతం | 10 శాతం |
| సంతానం కోసం కెరీర్‌కు విరామం | ------ | 3 ఏళ్లు |
| కెరీర్ బ్రేక్ తర్వాత వేతనం | ------ | రూ.47,000 |
| అత్తమామల సంరక్షణకు విరామం | ------ | 2 ఏళ్లు |
| విరామం తర్వాత వేతనం | ------ | రూ.1.5 లక్షలు |
| 60 ఏళ్ల వయసులో కార్పస్ | రూ.4.08 కోట్లు | రూ.2.39 కోట్లు |
| 60 ఏళ్ల తర్వాత సగటు జీవిత కాలం | 77 ఏళ్లు | 79 ఏళ్లు |
| కార్పస్ నుంచి వార్షిక ఉపసంహరణ | రూ.20 లక్షలు | రూ.20 లక్షలు |
| 6 శాతం ద్రవ్యోల్బణం లెక్కన పెట్టుబడి వృద్ధి రేటు | 2 శాతం | 2 శాతం |
| కార్పస్ ఆదుకునే కాలపరిమితి | 27 ఏళ్లు | 14 ఏళ్లు |

ఈ పట్టికను పరిగణనలోకి తీసుకుంటే ఉద్యోగం ప్రారంభించిన సమయంలో వేతన వ్యత్యాసం, కెరీర్ బ్రేక్‌లు అన్నీ లెక్క వేసుకుంటే 60 ఏళ్లు నిండే సమయానికి మహిళలు పొదుపు చేసే సొమ్ము, అప్పటికి సమకూరే కార్పస్ రెండూ పురుషులతో పోల్చితే తక్కువగా ఉంటాయి. ఈ కారణంగా కార్పస్ ఆదుకునే కాలపరిమితి కూడా పురుషులతో పోల్చితే తక్కువే. అదే సమయంలో సగటు జీవన కాలపరిమితి పురుషులకన్నా ఎక్కువగా ఉంటుంది కాబట్టి వేతనం, పొదుపులో కూడా పురుషులకన్నా మహిళలది పైచేయిగా ఉండాలి. ఇది సాధ్యం కావాలంటే మహిళలు ఉద్యోగాల్లో చేరే సమయంలోనే మెరుగైన వేతనం కోసం బేరసారాలు సాగించడంతోపాటు పురుషుల కన్నా ఎక్కువ పొదుపు చేయడానికి ప్రయత్నించాలి. పై ఉదాహరణనే పరిశీలనలోకి తీసుకుంటే పురుషులు తమ వేతనంలో 10 శాతం పొదుపు చేస్తే మహిళలు 17 శాతం పొదుపు చేయాలి. అప్పుడే రిటైర్మెంట్ సమయానికి పురుషులతో సమానంగా కార్పస్ సమకూర్చుకోగలుగుతారు.

# 49% వాటాకు రూ.2,450 కోట్లు

**యెస్ బ్యాంక్‌లో పెట్టుబడి కోసం రూ.10,000 కోట్లు సిద్ధం చేశాం.. ఎస్‌బీఐ చైర్మన్ రజనీశ్ కుమార్**






ముంబై: యెస్ బ్యాంక్‌లో 49 శాతం వాటాను రూ.2,450 కోట్లకు కొనుగోలు చేయనున్నట్లు ఎస్‌బీఐ ప్రకటించింది. 49 శాతం వాటా కొనుగోలుతో ఎస్‌బీఐకి 245 కోట్ల షేర్లు లభిస్తాయని, ఒక్కో షేరుకు రూ.10 చొప్పున మొత్తం రూ.2,450 కోట్ల పెట్టుబడులు అవసరమవుతాయంది. పునర్నిర్మాణం తర్వాత కూడా యెస్ బ్యాంక్‌కు చెందిన అన్ని డిపాజిట్లు, అప్పులు యథావిధిగా కొనసాగుతాయని శనివారం ఒక ప్రకటనలో పేర్కొంది. యెస్ బ్యాంక్ పునర్నిర్మిత బోర్డులో సీఈఓ, ఎండీతోపాటు నాన్ ఎగ్జిక్యూటివ్ చైర్మన్, నాన్ ఎగ్జిక్యూటివ్ డైరెక్టర్లు సభ్యులుగా ఉంటారని, ఎస్‌బీఐ కూడా తన తరపున డైరెక్టర్లను నియమిస్తుందని తెలిపింది. ఆర్‌బీఐ కూడా అదనపు డైరెక్టర్లను నియమించవచ్చని ప్రకటనలో వెల్లడించింది. కాగా, యెస్ బ్యాంక్ కోసం రూ.10,000 కోట్ల వరకు పెట్టుబడులు పెట్టేందుకు సిద్ధంగా ఉన్నట్లు ఎస్‌బీఐ చైర్మన్ రజనీశ్ కుమార్ తెలిపారు. ఆర్థిక సంక్షోభంలోకి జారుకున్న యెస్ బ్యాంక్‌ను పునరుద్ధరించేందుకు శుక్రవారం ఆర్‌బీఐ ముసాయిదా పథకాన్ని విడుదల చేసింది. ఈ ముసాయిదా ప్రకారం.. యెస్ బ్యాంక్‌లో ప్రతిపాదిత ఇన్వెస్టర్ (ఎస్‌బీఐ) 49 శాతం వాటా కొనుగోలు చేయాల్సి ఉంటుంది. బ్యాంకులో పెట్టుబడులు పెట్టిన తేదీ నాటి నుంచి మూడేళ్ల వరకు ఇన్వెస్టర్ తన వాటాను 26 శాతం కంటే తగ్గించుకోరాదు. యెస్ బ్యాంక్‌లో పెట్టుబడులు పెట్టేందుకు ఎస్‌బీఐ బోర్డు ఇప్పటికే సూచనప్రాయంగా అంగీకారం తెలిపింది. రజనీశ్ ఇంకా ఏమన్నారంటే..

- యెస్ బ్యాంక్ పునర్నిర్మాణం కోసం ఆర్‌బీఐ రూపొందించిన ముసాయిదా పథకం ఎస్‌బీఐకి అందింది. అందులోని నియమ, నిబంధనలతోపాటు ఇతర విషయాలపై తమ బ్యాంక్ లీగల్ టీమ్ జాగ్రత్తగా పరిశీలిస్తోంది. ఈ ప్రక్రి య పూర్తి కాగానే, ఆర్‌బీఐకి బ్యాంక్ తన తుది అభిప్రాయాన్ని తెలియజేయనుంది
- పునర్నిర్మాణ పథకం విడుదల తర్వాత యెస్ బ్యాంక్‌లో పెట్టుబడులు పెట్టేందుకు ఆసక్తిగా ఉన్నవారిలో చాలా మంది తమను సంప్రదించారు. వారితో ప్రాథమిక చర్చలు సాగించాం.
- ఆర్‌బీఐ ముసాయిదా పథకం ఎస్‌బీఐ బ్యాలెన్స్‌షీట్‌పై ఎలాంటి ప్రభావం చూపబోదు. ఎస్‌బీఐ షేర్‌హోల్డర్ల ప్రయోజనాలపైనా ఎలాంటి ప్రభావం ఉండదు
- యెస్ బ్యాంక్‌లో వాటా కొనుగోలుకు మా ర్కెట్ నుంచి నిధులు సేకరించాల్సిన లేదా ప్ర భుత్వాన్ని అభ్యర్థించాల్సిన అవసరముండదు
- ఈ ప్రైవేట్ బ్యాంక్‌లో పెట్టుబడులతో పరస్పర విరుద్ధ ప్రయోజనాలు వంటి సమస్యలకు దారితీసే అవకాశాలూ లేవు
- మనీలాండరింగ్ ఆరోపణల కేసులో యెస్ బ్యాంక్ సహ-వ్యవస్థాపకుడు రాణా కపూర్ ప్రాంతాల్లో ఈడీ సోదాలు జరపడం, ఆయన్ని ప్రశ్నించడం బ్యాంక్ పునరుద్ధరణ ప్రణాళికపై ఎలాంటి ప్రభావం చూపబోదు
- యెస్ బ్యాంక్ సంక్షోభ పరిష్కారంలో ఎస్‌బీఐ పాలుపంచుకోవడం ద్వారా ఇన్వెస్టర్లు, డిపాజిటర్లలో ఆందోళనలు సద్దుమణుగుతాయి. ఆర్థిక మార్కెట్లో స్థిరత్వానికి దోహదపడుతుంది
- యెస్ బ్యాంక్ డిపాజిటర్లకు ఎలాంటి భయాలు అక్కర్లేదు. వారి సొమ్ము భద్రం

**రూ.8,000-10,000 కోట్ల ప్రత్యేక ద్రవ్య వసతి**

సంక్షోభంలోకి జారుకున్న యెస్ బ్యాంక్‌కు ఆర్థికంగా చేయూతనిచ్చేందుకు ఆర్‌బీఐ రూ.8,000-10,000 కోట్లతో ప్రత్యేక ద్రవ్య వసతిని ఆఫర్ చేయనున్నట్లు సమాచారం. తద్వారా బ్యాంక్‌కు తక్షణమే నిధులు అందుబాటులోకి వస్తాయని, బ్యాంక్ కస్టమర్లలో ఆందోళనలు తగ్గించేందుకు ఇది దోహదపడుతుందని ఆర్‌బీఐ భావిస్తున్నట్లు సమాచారం.

**బ్రాంచీలు, ఏటీఎంల వద్ద కస్టమర్ల క్యూ**

యెస్ బ్యాంక్‌పై ఆర్‌బీఐ మారటోరియం విధించడంతో బ్యాంక్ కస్టమర్లు తీవ్ర ఆందోళనకు గురవుతున్నారు. వరుసగా రెండ్రోజుల నుంచి దేశవ్యాప్తంగా ఈ బ్యాంక్ బ్రాంచీలు, ఏటీఎంల వద్ద కస్టమర్లు నగదు విత్‌డ్రా కోసం భారీగా క్యూ కట్టిన దృశ్యాలు కన్పించాయి. చాలా వరకు ఏటీఎంలలో ఇప్పటికే క్యాష్ అయిపోయింది. ఒకవేళ ఏటీఎంలో నగదు ఉన్నప్పటికీ రూ.3,000-4,000 మించి విత్‌డ్రా చేసుకోలేకపోతున్నామని ఓ కస్టమర్ వాపోయారు. బ్యాంక్ ఇంటర్నెట్ బ్యాంకింగ్ సేవలు, క్రెడిట్ కార్డు పనిచేయడం లేదని ఖాతాదారులు ఆరోపించారు.

**రెండో రోజూ రాణా కపూర్ విచారణ**

మనీలాండరింగ్ ఆరోపణల కేసులో యెస్ బ్యాంక్ సహ వ్యవస్థాపకుడైన రాణా కపూర్‌కు చెందిన ప్రాంతాల్లో ఎన్‌ఫోర్స్‌మెంట్ డైరెక్టరేట్ (ఈడీ) శుక్రవారం రాత్రి సోదాలు జరిపింది. ఈ సందర్భంగా కపూర్‌తో పాటు తదితరులను విచారించిన ఈడీ అధికారులు.. శనివారం తమ కార్యాలయానికి తరలించి మరీ ప్రశ్నించారు. అంతేకాదు, తన సోదాలను మరింత విస్తృతం చేసింది. రెండో రోజు కపూర్ ముగ్గురు కూతుళ్ల ప్రాంతాల్లోనూ తనిఖీలు నిర్వహించింది. దివాలా తీసిన ఎన్‌బీఎఫ్‌సీ దివాన్ హౌసింగ్ ఫైనాన్స్ లిమిటెడ్(డీహెచ్‌ఎఫ్‌ఎల్)కు యెస్ బ్యాంక్ ఇచ్చిన రుణాలు మొండిపద్దుల్లోకి చేరాయి. దీంతోపాటు కొన్ని కార్పొరేట్ కంపెనీలకు రుణాల మంజూరుకు సంబంధించి ఆ కంపెనీల నుంచి రాణా కపూర్ కుటుంబానికి ముడుపులు అందినట్లు ఆరోపణలు వచ్చాయి.



ఒకవేళ బ్యాంకులు వ్యాపార నిర్వహణలో విఫలమైతే, ఇందుకు బాధ్యులైన ఉన్నతాధికారులపై క్రిమినల్ చర్యలు చేపట్టాలి. కఠినంగా శిక్షించాలి. అంతే తప్ప వారి పట్ల ఉపేక్ష తగదు. ఈమధ్య కాలంలో ప్రైవేట్ బ్యాంక్‌లు ఒక దాని తర్వాత మరొకటి విఫలమవుతున్నాయి. ఇందుకు ఆర్‌బీఐ బాధ్యత వహించాలి. 1969 సంవత్సరంలో లాగే ప్రైవేట్ బ్యాంకులన్నింటినీ ప్రభుత్వం తన పరిధిలోకి తీసుకోవాలి.

*- సీహెచ్ వెంకటాచలం, ఏఐబీఈఏ జనరల్ సెక్రటరీ*

యెస్ బ్యాంక్ చాలా కాలంగా మొండిబకాయిలతో సతమతం అవుతోంది. మోదీ ప్రభుత్వానికి సన్నిహితుడైన అనిల్ అంబానీతోపాటు ఆర్థికంగా దివాళా తీస్తూ వచ్చిన పలువురు కార్పొరేట్ వర్గాలకు ఇచ్చిన రుణాలదే మొండి పద్దుల్లో మెజారిటీ భాగం. యెస్ బ్యాంక్ పతనం ప్రైవేట్ బ్యాంకుల నిర్వహణ తీరును ప్రశ్నించేలా ఉంది. అంతేకాదు, ఆర్‌బీఐ సకాలంలో కలుగజేసుకోవడంలో విఫలమైనట్లు అన్పిస్తోంది. దేశంలో క్రోనీ క్యాపిటలిజానికి యెస్ బ్యాంక్ ఉదంతం మరో ఉదాహరణ.

*- సీపీఎం*



ఆర్థిక సంస్థల నిర్వహణలో బీజేపీ ప్రభుత్వ వైఫల్యమే యెస్ బ్యాంక్ సంక్షోభానికి కారణం. ఆర్థిక సంక్షోభంలోకి కూరుకుపోయిన బ్యాంకులో 49 శాతం వాటా కోసం ఎస్‌బీఐ రూ.2,450 కోట్లు పెట్టుబడి పెట్టడం హాస్యాస్పదమే.

*- పీ చిదంబరం, ఆర్థిక శాఖ మాజీ మంత్రి*



పరంజ్యోతి

## మనసును నిలువరిస్తేనే..



ఆధ్యాత్మిక సాధన అనేది జీవిత పర్యంతం కొనసాగాల్సిన నిరంతర ప్రక్రియ. దీనికి దీర్ఘకాలిక కృషి, పట్టుదల అవసరం. భగవంతుడి పట్ల మనకు ఉండే భక్తి విశ్వాసాలు ఇందుకు ప్రాతిపదిక. సాధనలో త్వరగా ఫలితాలు లభించాలనుకోవడం పొరపాటు. ఒక యువకుడికి బీఏ/బీఎస్సీ/బీకాం డిగ్రీకి ఎంతకాలం పడుతుందో గమనించండి. ఎల్‌కేజీ నుంచి ప్రారంభమైతే డిగ్రీ చేతికి రావడానికి 15 సంవత్సరాలు పడుతుంది. ఆపై పీజీ, టెక్నికల్ డిగ్రీ పొందటానికి, ఉద్యోగం సంపాదించడానికి మరో 5, 6 సంవత్సరాలు పట్టవచ్చు. ఈ రెండు దశాబ్దాల కాలంలో ఎంతో కష్టపడాల్సి ఉంటుంది? ఎంతో టెన్షన్ ఉంటుంది. ఎంతో ఎదురుచూపు ఉంటుంది? పైగా ఫలితం దైవాధీనమే. కేవలం భుక్తి కోసం, ధనార్జన కోసం, ప్రాపంచిక విద్య కోసం ఇంత కాలాన్ని, శక్తిని వినియోగించాల్సి వస్తే.. నిత్య సత్యమైన, ఈ సకల జగత్తుకు అధిపతియైన, చరాచర సృష్టికి మూల కారణమైన ఆ భగవంతుడి అనుగ్రహం పొందడానికి ఎంత సాధన కావాలో అర్థం చేసుకోవచ్చు. ఈ సాధన ఎంత కాలం కొనసాగాలంటే..?

మనలో స్థిరత్వం, భగవంతుడి పట్ల అచంచలమైన పరిపూర్ణ భక్తి విశ్వాసాలు, తుదకు శరణాగతి తత్వం అలవరచుకునేంత వరకు..! మనం రోడ్డు పక్కన పెద్ద వృక్షాలను చూస్తుంటాం. అల్లంత దూరంలో వరిపైరు ఉంటుంది. పెద్ద వృక్షాలకు నిత్యమూ నీరు అందించాల్సిన అవసరం లేదు. వాటి వ్రేళ్ల విస్తారంగా వ్యాపించి ఉంటాయి. నీటిమట్టం వరకు భూమిలో లోతుగా దిగి ఉంటాయి. కానీ వరిపైరుకు నీరు అందుతోందా? లేదా? అని నిత్యం చూడాల్సిందే. తరచూ నీళ్ల పట్టాల్సిందే. లేకుంటే పైరు వాడిపోతుంది. ఎందుకంటే వాటి వేర్లు పైపైనే.. 3, 4 అంగుళాల లోతు వరకే దిగి ఉంటాయి. ఈ ఉదాహరణ మాదిరిగానే.. విశ్వాసం అనే వేర్లు, మీ హృదయాంతరాళమును చేరి, మీ మనస్సును కదలక, మెదలక, అదరక, బెదరక ఎన్ని కష్టనష్టాలు ఎదురైనా భరించగల శక్తి, ఓపిక వచ్చేంత వరకు ఆధ్యాత్మిక సాధన కొనసాగాల్సిందేనని భగవాన్ శ్రీ సత్య సాయిబాబా చెప్పేవారు. సామాన్యులమైన మన భక్తి విశ్వాసాలు వరి పైరు వేర్ల మాదిరిగానే ఉంటాయి. నిత్యం నీళ్లపట్టినట్లే.. నిత్య సాధన లేకుంటే.. మన భక్తి విశ్వాసాలు క్షీణించిపోతాయి. భగవదనుగ్రహానికి చేరువ కాలేం. ఎంతచేసినా దేవుడు కరుణ చూపలేదని పరితపిస్తాం. లోపం మనలోనే ఉంది. భగవత్‌తత్వంలో కాదు. ఇందుకు కారణం.. చాలా మంది సాధనలో మనస్సును నిలువరించలేకపోతున్నారు. మనం దేవాలయంలో ఉన్నా.. మనస్సు మాత్రం మార్కెట్లో తిరుగుతుంది. మనస్సు తత్వం అటువంటిదే. ఆ మనస్సును నిగ్రహించే ప్రయత్నంలో భాగమే ఆధ్యాత్మిక సాధన. కోరికలను ఒక్కొక్కటిగా తొలగించుకోగల్గితే మనస్సే మాయమవుతుంది. మనస్సు నిలవకపోవడమనే సమస్యే ఉత్పన్నం గాదు. సైకిల్ తొక్కుతున్నప్పుడు, కారు నడుపుతున్నప్పుడు, పుస్తకం చదువుతూ విషయాలు గ్రహిస్తున్నప్పుడు, ఆఫీసు పని శ్రద్ధగా చేస్తున్నప్పుడు ఏకాగ్రతతోనే ఉంటాం. మరో ఆలోచన రాదు. ఎందుకంటే ఆ స్థితిలో వేరే ఆలోచనలు చేస్తే ప్రమాదంలో పడతామని మన అంతరాత్మ ప్రబోధిస్తుంది. ఆధ్యాత్మిక సాధనలోనూ అదేవిధంగా ఆలోచించాలి

.- మాదిరాజు రామచంద్రరావు, 9393324940

# వివాదాల మాన్సాస్!

- గజపతులతో 'నాలుగు స్తంభాలాట'
- అశోక్ ఉద్వాసనపై మాట్లాడలేని స్థితి
- సంచయిత మతంపైనా చర్చ
- సోషల్ మీడియాలో చర్చిల్లో దిగిన ఫొటోలు

(విజయనగరం/అమరావతి - ఆంధ్రజ్యోతి)

ఉత్తరాంధ్రలోనే ప్రసిద్ధి చెందిన 'మాన్సాస్' ట్రస్టును రాష్ట్ర సర్కారు వివాదాలకు కేంద్రంగా మార్చింది. టీడీపీ సీనియర్ నేత అశోక్‌గజపతిరాజు స్థానంలో ఆయన అన్న కుమార్తె సంచయితను మాన్సాస్‌తోపాటు సింహాచలం దేవస్థానం బోర్డు సారథిగా నియమిస్తూ అర్ధరాత్రి రహస్య జీవోలు జారీ చేయడమే ఒక వివాదం! ఇప్పుడు... సంచయిత 'మతం'పైనా చర్చ మొదలైంది. అశోక్ గజపతిరాజు శనివారం మీడియాతో మాట్లాడుతూ ఈ అంశంపై నర్మగర్భ వ్యాఖ్యలు చేశారు. "వారు ఏ మతమో నాకు తెలియదు. ఇతర మతాలకు చెందినవారు సింహాచలం దేవస్థానం బోర్డు, మాన్సాస్‌కు అధిపతులైతే సమస్యలు వస్తాయి" అన్నారు. ఇక... సంచయిత, ఆమె తల్లి ఉమా గజపతి గతంలో వాటికన్ సిటీ చర్చిలో దిగిన ఫొటోలు, క్రిస్మస్ సంబరాల్లో పాల్గొన్న చిత్రాలు కూడా ఇప్పుడు వెలుగులోకి వచ్చాయి. నిజానికి, ఈ ఫొటోలు గతంలో సంచయిత స్వయంగా సోషల్ మీడియాలో పోస్ట్ చేసినవే.

### ఆ నలుగురు ఎందుకు?

మాన్సాస్ కొత్త ట్రస్టు కూర్పుపైనా రకరకాల అనుమానాలు వ్యక్తమవుతున్నాయి. గజపతిరాజుల కుటుంబంలో చిచ్చు పెట్టేందుకు వ్యూహాత్మకంగా సభ్యుల ఎంపిక జరిగిందని భావిస్తున్నారు. గతంలో ట్రస్టుకు అశోక్ గజపతి చైర్మన్‌గా ఉండేవారు. ఆయన కేంద్ర మంత్రిగా బిజీగా ఉండటంతో స్థానికంగా ట్రస్టు కార్యక్రమాల పర్యవేక్షణకోసం కుమార్తె అదితిని సభ్యురాలిగా నియమించారు. ఇప్పుడు అనూహ్యంగా గజపతిరాజుల కుటుంబం నుంచే నలుగురిని సభ్యులుగా నియమించారు. అశోక్ అన్న కుమార్తెను చైర్‌పర్సన్‌గా నియమిస్తూనే... అశోక్, అదితిలను సభ్యులుగా చేర్చారు. ఆనందగజపతి రెండో భార్య కుమార్తె ఊర్మిళ, అశోక్ సోదరి సునీతా ప్రసాద్‌ను కూడా సభ్యులుగా నియమించారు. తమకు సభ్యత్వం దక్కిందనే ఆనందంతో... అశోక్‌ను పదవీచ్యుతుడిని చేయడం గురించి వారెవరూ మాట్లాడలేని పరిస్థితి ఉంటుందని చెబుతున్నారు. ఇక గతంలో ఆర్థికనిపుణులు, ఐఏఎస్ స్థాయి అధికారులకు ట్రస్టులో సభ్యత్వం ఇచ్చేవారు. ఇప్పుడు... ఢిల్లీకి చెందిన అరుణ్ కపూర్, విజయ్ కే.సోంధీలను ట్రస్టులో చేర్చారు. ఢిల్లీ హైకోర్టు సీనియర్ న్యాయవాది అయిన విజయ్ సంచయిత కుటుంబానికి సంబంధించిన న్యాయ వివాదాలు చూస్తారని తెలుస్తోంది. అరుణ్ ఢిల్లీలో సంచయిత చదువుకున్న స్కూలు కరస్పాండెంట్ కావడం గమనార్హం.




వాటికన్ సిటీలోని చర్చిలో తల్లి ఉమాగజపతి రాజుతో కలిసి సంచయిత. (ఫైల్)



క్రిస్మస్ సంబరాల్లో ఉమా గజపతి రాజు. (ఫైల్)

## రాత్రికి రాత్రే చీకటి జీవో

**మాన్సాస్ ట్రస్టుపై ప్రభుత్వ పెత్తనమేంటి? .. వారిది ఏ మతమో నాకు తెలియదు**

**ఆధార్ పరిశీలిస్తే ఏ ప్రాంతంవారో తెలుస్తుంది .. పురుషులనే చైర్మన్‌గా గుర్తించాలని బైలాలో ఉంది**

**భూములు కాజేయడానికే నన్ను తొలగించారు.. న్యాయపోరాటం చేస్తాం: అశోక్ గజపతిరాజు**



బాబాయి వర్సెస్ అమ్మాయి

విజయనగరం, మార్చి 7(ఆంధ్రజ్యోతి): "చీకటి జీవోలతో అన్యాయం చేస్తున్నారు. ప్రజాస్వామ్యాన్ని మంటగలిపే రీతిలో వ్యవహరిస్తున్నారు. మాన్సాస్ ట్రస్టుపై ప్రభుత్వ పెత్తనం మంచిదికాదు" అంటూ కేంద్ర మాజీమంత్రి, టీడీపీ సీనియర్ నాయకుడు పూసపాటి అశోక్ గజపతి రాజు ధ్వజమెత్తారు. విజయనగరంలోని అశోక్ బంగ్లాలో శనివారం ఆయన మీడియాతో మాట్లాడారు. "కొత్తగా బాధ్యతలు చేపట్టిన చైర్‌పర్సన్ రాజకీయ జోక్యంతో వచ్చారు. విజయనగరం వచ్చాక తొలుత ఎమ్మెల్యే కోలగట్ల ఇంటికెళ్లారు. ఇక్కడ తమవాళ్లు, ట్రస్టుకు సంబంధించినవారు ఉండగా ఎమ్మెల్యే ఇంటికి వెళ్లాల్సిన అవసరమేంటి? అక్కడి నుంచి రాజకీయాలు జరిపి వారి జోక్యంతో మాన్సాస్ కార్యాలయానికి వెళ్లడం ఏంటి? వారు ఏ మతమో నాకైతే తెలియదు. కానీ దేవస్థానం, ట్రస్టు చైర్మన్లను వేరే మతానికి చెందినవారిని నియమిస్తే సమస్యలు పుట్టుకొస్తాయి. సంచయిత ఆధార్ కార్డును పరిశీలిస్తే ఆమె ఏ ప్రాంతానికి చెందిన వారో తెలుస్తుంది" అని ఆయన పేర్కొన్నారు. "మహారాజా అలక్ నారాయణ్ సొసైటీ ఆఫ్ ఆర్ట్స్ అండ్ సైన్స్(మాన్సాస్)ను మా తండ్రి పీవీజీ రాజు స్థాపించారు. ట్రస్టుబాడీని మార్చుతున్నప్పుడు కనీసం నోటీసు ఇవ్వాలి. చైర్మన్‌గా నేను అవినీతి, అక్రమాలకు పాల్పడితే దర్యాప్తు చేయాలి. నోటీసు ఇవ్వాలి. ఇదేదీ లేకుండా ఏకపక్షంగా వ్యవహరించడం మంచిది కాదు. ట్రస్టు బోర్డు నియామకంలో ప్రభుత్వ ప్రమేయం ఏమిటి? సింహాచలం దేవస్థానంలో అనువంశిక ధర్మకర్తగా ఉన్న నాకు సమాచారం, నోటీసు లేకుండా ఏవిధంగా కొత్త పాలకవర్గాన్ని వేస్తారు? దీనిపై న్యాయపోరాటం చేస్తాను. మాన్సాస్, సింహాచల దేవస్థానం పరిధిలో 108ఆలయాలు, విలువైన భూములు ఉన్నాయి. భూములు కాజేయడానికే నన్ను తొలగించారు. నేను ఆరోగ్య తనిఖీ కోసం ఢిల్లీకి వెళితే రాత్రికి రాత్రి చీకటి జీవో తెచ్చారు. పురుషులనే చైర్మన్‌గా గుర్తించాలని ట్రస్టు బైలాలోనే స్పష్టంగా ఉంది. చట్టప్రకారం రిజిస్టర్ అయిన దానికే విలువలేకుండా చేయటం దారుణం" అంటూ అశోక్ మండిపడ్డారు. బైలాలో రొటేషన్ పదమే లేకపోయినా, ఆ విధానంలో పదవులు కట్టబెడుతున్నట్లు పేర్కొనడం అన్యాయమన్నారు.

### ఇది కక్షసాధింపు చర్యే

మాన్సాస్ ట్రస్టు బోర్డులో నా పేరు పెడుతున్నట్లు కనీసం నాకు కూడా తెలియజేయలేదు. ఇష్టానుసారం వ్యవహరించడం ప్రజాస్వామ్యబద్ధం కాదు. ఇది ముమ్మాటికీ కక్ష సాధింపు చర్య. దీనిపై న్యాయపోరాటం చేస్తాం. ఇప్పటికీ జీవోలు రహస్యంగానే ఉంచుతున్నారు. ఇదే నా పారదర్శకత. ప్రభుత్వం కావాలనే కక్ష కట్టి ఇలా చేసింది. ఇది ముమ్మాటికీ అన్యాయం.

- అదితి విజయ లక్ష్మీగజపతి, అశోక్ గజపతి కుమార్తె

## నేనేంటో నా పనే చెబుతుంది

**మసీదు, చర్చికి వెళ్తే మతం మారిపోతుందా?.. కుటుంబసభ్యులే ఆరోపణలు చేయడం బాధిస్తోంది..**

**ప్రభుత్వానికి నేనే లీగల్ రిప్రజెంటేషన్ ఇచ్చా .. బీజేపీలోనే కొనసాగుతా...: సంచయిత**



విశాఖపట్నం/అమరావతి, మార్చి 7(ఆంధ్రజ్యోతి): "సింహాచలం దేవస్థానం, మాన్సాస్ ట్రస్టు బోర్డు చైర్‌పర్సన్‌గా ఎటువంటి భయం, పక్షపాతం లేకుండా పని చేస్తా. పారదర్శకంగా నిర్ణయాలు తీసుకుంటా. నా పనే నేను ఏమిటో అర్థమయ్యేలా చేస్తుంది' అని సంచయిత పేర్కొన్నారు. శనివారం ఆమె విశాఖపట్నంలో మీడియాతో మాట్లాడుతూ కుటుంబసభ్యులే తనపై ఆరోపణలు చేయడం బాధిస్తోందన్నారు. మసీదు, చర్చిలకు వెళితే మతం మారిపోతుందా అని ప్రశ్నించారు. తనవెనుక ఎటువంటి రాజకీయ శక్తులు లేవని స్పష్టం చేశారు. సింహాద్రి అప్పన్న ఆస్తులను రక్షించడంతో పాటు భక్తులకు మెరుగైన సేవలందించి శక్తివంతమైన మహిళగా నిరూపించుకుంటానని ధీమా వ్యక్తంచేశారు. తనకు న్యాయపరమైన హక్కులు ఉన్నాయన్నారు. రాష్ట్ర ప్రభుత్వానికి తానే లీగల్ రిప్రజెంటేషన్ ఇచ్చానని, ఆ మేరకే తనను ట్రస్టుబోర్డులకు చైర్‌పర్సన్‌గా నియమించారని వివరించారు. తాను న్యాయవాదినని, ఈ ట్రస్టుల కేసులపై హైకోర్టు తనను వారసురాలిగా ఇంప్లీడ్ చేసిందన్నారు. ఇవన్నీ ఎప్పుడో జరిగిన విషయాలైనా తన నియామకంపై వివాదం వచ్చినందున ఇప్పుడు చెప్పాల్సి వచ్చిందని వివరించారు. బీజేపీ అధిష్ఠానం తననుంచి ఎలాంటి వివరణ కోరలేదని, తాను బీజేపీలోనే కొనసాగుతానన్నారు. 'మతం విషయంలో నాపై నిందలు వేస్తున్నవాళ్లు ఎన్నికలప్పుడు ఓట్ల కోసం చర్చిలు, మసీదులకు వెళుతుంటారు. వాళ్లది ఏ మతం. ఇవన్నీ పిచ్చిమాటలు' అని వ్యాఖ్యానించారు. 'మన్సాస్ కుటుంబ వ్యవహారం అంటున్నారు గతంలో ఆయన(అశోక్ గజపతి రాజు) నియామకం జరిగినట్లే ఇప్పుడు నా నియామకం జరిగింది. ఇందులో ఎలాంటి రాజకీయాల్లేవు' అని స్పష్టం చేశారు. విశాఖ శారదా పీఠాధిపతిని తాను ఎప్పుడూ కలవలేదని, కాకపోతే ఆయనంటే గౌరవం ఉందన్నారు. తన నియామకంలో ఆయన పాత్రలేదని చెప్పారు. 'నేను ఆధునిక మహిళను. ఏం మాట్లాడాలో, ఎలాంటి దుస్తులు వేసుకోవాలో నాకు ఎవరూ చెప్పక్కర్లేదు' అని సంచయిత పేర్కొన్నారు.

## ఉగాది రోజున ఇళ్ల స్థలాలు: సీఎస్



నేలపాడులో భూములిచ్చిన రైతులతో మాట్లాడుతున్న సీఎస్ నీలం సాహ్ని

తెనాలి టౌన్, మార్చి 7: ఉగాది పండుగ రోజున రాష్ట్రంలో అర్హులందరికీ ఇళ్ల స్థలాలిచ్చేందుకు ప్రభుత్వం గొప్పగా ఏర్పాట్లు చేస్తోందని రాష్ట్ర ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి నీలం సాహ్ని చెప్పారు. శనివారం గుంటూరు జిల్లా తెనాలి వచ్చిన ఆమె సంగం జాగర్లమూడి, అత్తోట, నేలపాడు గ్రామాల్లో నివేశన స్థలాలకు ఇచ్చిన భూములను పరిశీలించారు. భూములిచ్చిన రైతులతో ముఖాముఖి మాట్లాడారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ రాష్ట్రంలో 26.5లక్షల మందికి ఇళ్ల స్థలాలు ఇచ్చేందుకు సిద్ధంగా ఉన్నామని, దీని కోసం 26వేల ఎకరాల ప్రభుత్వ భూమి ఉండగా, మరో 14వేల ఎకరాలు కొనుగోలు చేస్తున్నామని తెలిపారు. కలెక్టర్ శామ్యూల్ ఆనంద్, జేసీ దినేష్ కుమార్ తదితరులు పాల్గొన్నారు.

## పోలవరంలో అవకతవకలు లేవు

- కేంద్ర జలశక్తి శాఖకు రాష్ట్రం లేఖ.. పీఎంవోకు అధికారుల వివరణ

న్యూఢిల్లీ, మార్చి 7(ఆంధ్రజ్యోతి): పోలవరం ప్రాజెక్టు కాంట్రాక్టుల్లో అవినీతి అంటూ వైసీపీ ప్రభుత్వం పదేపదే చేస్తున్న ఆరోపణలు అవాస్తవమేనా? 'రివర్స్ టెండర్' బాటపట్టడానికి కారణంగా చెప్తున్న 'ప్రజాధనం దుర్వినియోగం' అంతా ఉత్తమాటేనా? ఔను... అవన్నీ అవాస్తవాలే! ఏకంగా రాష్ట్ర ప్రభుత్వమే ఈ విషయం ఒప్పుకొంది!ప్రాజెక్టు పనుల కాంట్రాక్టుకు సంబంధించి నిబంధనలపరంగా ఎలాంటి ఉల్లంఘనలూ లేవని రాష్ట్ర ప్రభుత్వం స్పష్టం చేసింది. ఈ మేరకు కేంద్రానికి లేఖ రాసింది. సంబంధిత అథారిటీ ఆమోదముద్ర లభించిన తర్వాతే అన్ని నిర్ణయాలు తీసుకున్నట్లు జగన్మోహన్‌రెడ్డి ప్రభుత్వం 2019 నవంబరు 13న తమకు లేఖ రాసినట్లు కేంద్ర జలశక్తి మంత్రిత్వశాఖ సీనియర్ జాయింట్ కమిషనర్ అనూప్ శ్రీవాత్సవ తెలిపారు. ఈ విషయాన్ని పీఎంవో దృష్టికి తీసుకెళ్లారు.

## 'అమ్మఒడి' అనగానేమి?

- టెన్త్ ప్రీ ఫైనల్‌లో విద్యార్థులకు 'పరీక్ష'

విజయవాడ, మార్చి 7(ఆంధ్రజ్యోతి): అమ్మఒడి పథకంపై టెన్త్ విద్యార్థులకు సర్కారు 'పరీక్ష' పెట్టింది. గత నెల 29 నుంచి రాష్ట్రవ్యాప్తంగా పదో తరగతి విద్యార్థులకు ప్రస్తుతం ప్రీ ఫైనల్ పరీక్షలు జరుగుతున్నాయి. ఇందులో ఇంగ్లిష్, హిందీ సబ్జెక్టుల్లో అమ్మఒడి పథకంపై ప్రశ్నల్విడం చర్చనీయాంశమైంది. హిందీ ప్రశ్నపత్రంలో అమ్మఒడి నిబంధనల గురించి వ్యాసం రాయాలని అడిగారు. దీనికి 8 మార్కులు. ఇంగ్లిష్‌లోనూ సృజనాత్మక వ్యక్తీకరణ(క్రియేటివ్ ఎక్స్‌ప్రెషన్) విభాగంలో రెండు మల్టిపుల్ చాయిస్ ప్రశ్నలు అడిగారు. ఒక ప్రశ్నలో అమ్మఒడి పథకం గురించి.. నిబంధనల గురించి.. లబ్ధిదారుల సంఖ్య గురించి తెలియజేస్తూ స్నేహితుడికి లేఖ రాయాలని ఇచ్చారు. ఇదే విభాగంలో చాయిస్‌గా అడిగిన మరో ప్రశ్నలో.. విద్యార్థి పాఠశాలలో అమ్మఒడి పథకం ప్రారంభం గురించి ఓ పత్రిక రిపోర్టర్‌గా భావించి వార్తాకథనం రాయాలని కోరారు. ఈ విభాగంలో ఇచ్చిన రెండు చాయిస్ ప్రశ్నలూ అమ్మఒడిపైనే రావడంతో విద్యార్థులు గందరగోళానికి గురయ్యారు.

## జగన్‌కు మనసెలా వచ్చింది: లోకేశ్

అమరావతి, మార్చి7 (ఆంధ్రజ్యోతి): "అశోక్‌గజపతిరాజు లాంటి గొప్పవ్యక్తిపై అవినీతి ముద్ర వేయాలని వైకాపా నాయకులు ప్రయత్నించడం సూర్యుడిపై ఉమ్మి వేయాలనుకోవడమే. ఆయన్ను ఏకవచనంతో సంబోధిస్తూ కనీస అవగాహన లేకుండా మంత్రి మాట్లాడడం జగన్ ప్రభుత్వ అధికార దాహానికి నిదర్శనం" అని టీడీపీ జాతీయ ప్రధాన కార్యదర్శి నారా లోకేశ్ విమర్శించారు. వేల ఎకరాల భూమిని, సంపదను మాన్సాస్ ట్రస్ట్‌కు ఇవ్వడంతో పాటు ఉత్తరాంధ్రలో వేలమంది విద్యార్థులకు ఉచిత విద్యాబుద్ధులు నేర్పి ప్రయోజకులను చేసిన అశోక్‌పై అవినీతి ముద్ర వేయడానికి జగన్‌కు మనసెలా వచ్చిందని ప్రశ్నించారు. "చీకటి జీవో ఇచ్చి మాన్సాస్ ట్రస్ట్‌లో రాజకీయ క్రీడ మొదలుపెట్టారు. ఉత్తరాంధ్రలో మొదలైన వైకాపా విధ్వంసకాండను సింహాచలం అప్పన్న చూస్తున్నారు" అంటూ లోకేశ్ శనివారం ట్వీట్ చేశారు.

## ఇద్దరికి రాజ్యసభ ఖరారు!

- దరఖాస్తు తీసుకొన్న అయోధ్యరామిరెడ్డి
- మరో ఇద్దరు ఎవరన్నదే సర్వత్రా ఆసక్తి

అమరావతి, మార్చి 7(ఆంధ్రజ్యోతి): ఆంధ్రప్రదేశ్ నుంచి నాలుగు రాజ్యసభ స్థానాలు ఖాళీ అవుతున్నాయి. వాటిలో రెండింటికి అభ్యర్థులు దాదాపు ఖరారయ్యారు. మిగిలిన రెండింటికీ ఎవరన్న సందేహమే ఇప్పుడు వైసీపీ నేతలను వేధిస్తోంది. ప్రపంచలోనే అత్యంత ధనవంతుల్లో ఒకరైన ముఖేశ్ అంబానీ నేరుగా సీఎం క్యాంపు కార్యాలయానికి వెళ్లి జగన్‌తో భేటీ అయ్యారు. రిలయన్స్ గ్రూప్ ప్రెసిడెంట్ పరిమళ్ ధీరజ్‌లాల్ నత్వానీకి రాష్ట్రం నుంచి రాజ్యసభకు ప్రాతినిధ్యం వహించే అవకాశం ఇవ్వాలని కోరారు. పార్టీ నేతలకే కేటాయింపులంటూ వైసీపీ విధానాన్ని వివరించిన సీఎం జగన్.. ప్రస్తుత పరిస్థితుల నేపథ్యంలో పరిశీలిస్తానని హామీ ఇచ్చినట్లు రాజకీయ వర్గాల్లో చర్చ జరుగుతోంది. రాజ్యసభ రేసులో ముందువరుసలో ఉన్న అయోధ్యరామిరెడ్డి శనివారం రాజ్యసభ అభ్యర్థిత్వం కోసం దరఖాస్తును ఎన్నికల రిటర్నింగ్ అధికారి నుంచి తీసుకు వెళ్లారని అంటున్నారు. దీంతో పరిమళ్, అయోధ్యరామిరెడ్డికి రాజ్యసభ స్థానాలు దాదాపు ఖరారైనట్లేనని ఆ వర్గాల భావన. ఇక మిగిలిన రెండు స్థానాలకూ టీటీడీ చైర్మన్ వైవీ సుబ్బారెడ్డి, టీడీపీని వీడి వైసీపీలోకి వచ్చిన బీద మస్తాన్‌రావు, ఎమ్మెల్సీలుగా ఉన్న మంత్రులు మోపిదేవి వెంకటరమణ, పిల్లి సుభాష్ చంద్రబోస్‌లలో ఎవరికి గ్రీన్ సిగ్నల్ ఇస్తారన్నది రాజకీయ వర్గాల్లో చర్చనీయాంశమైంది.

### రెండు రోజులైనా బోణీ కాలేదు

రాజ్యసభ స్థానాల ఎన్నికలకు నామినేషన్ల ప్రక్రియ ప్రారంభమై రెండు రోజులు గడిచినా ఒక్క నామినేషన్‌కూడా దాఖలు కాలేదు. ఎన్నికల సంఘం శుక్రవారం రాజ్యసభ ద్వైవార్షిక ఎన్నికల ప్రకటన జారీ చేసింది. ఈ నెల 13 వరకు నామినేషన్లు స్వీకరిస్తారు. శనివారం సాయంత్రం వరకూ రాష్ట్రంలోని నాలుగు స్థానాలకూ ఒక్క నామినేషన్ కూడా దాఖలు కాలేదని రాష్ట్ర ఎన్నికల ప్రధానాధికారి విజయానంద్ ఒక ప్రకటనలో తెలిపారు. ఆదివారం మినహాయిస్తే మరో 5 రోజులు మాత్రమే నామినేషన్ల స్వీకరణకు సమయం ఉంది. వైసీపీకి అసెంబ్లీలో ఉన్న సంఖ్య ప్రకారం నాలుగు రాజ్యసభ స్థానాలు ఆ పార్టీకే దక్కనున్నాయి.

## రాష్ట్రంలో కొత్త ప్రైవేట్ జూనియర్ కాలేజీలు!

- త్వరలో నోటిఫికేషన్..

అమరావతి, మార్చి 7(ఆంధ్రజ్యోతి): రాష్ట్రంలో ప్రైవేట్‌రంగంలో కొత్త జూనియర్ కళాశాలల ఏర్పాటుకు రంగం సిద్ధమవుతోంది. ఈ మేరకు ఆన్‌లైన్‌లో దరఖాస్తులను ఆహ్వానిస్తూ త్వరలోనే నోటిఫికేషన్ విడుదల చేసేందుకు ఇంటర్ బోర్డు సన్నాహాలు చేస్తోంది. పదో తరగతి పరీక్షల్లో ఉత్తీర్ణులైన విద్యార్థుల సంఖ్య, జూనియర్ కాలేజీలు తక్కువగా ఉండటం, వయబిలిటీ తదితర అంశాలను ప్రాతిపదికగా తీసుకుని మండలాల వారీగా అన్ సర్వ్‌డ్ ఏరియాను గుర్తించి నోటిఫికేషన్ విడుదల చేస్తారు. రాష్ట్రం మొత్తంమీద ఎన్ని కాలేజీలు అవసరమన్నది కాకుండా.. అన్ని ప్రాంతాల అవసరాలను దృష్టిలో ఉంచుకుని కొత్తకాలేజీల ఏర్పాటుకు అవకాశం కల్పించాలని బోర్డు భావిస్తోంది. రాష్ట్రంలో కొత్త ప్రైవేట్ జూనియర్ కాలేజీల కోసం ఐదేళ్ల క్రితం నోటిఫికేషన్ ఇచ్చారు. తర్వాత నోటిఫికేషన్ లేక ఇంటర్‌బోర్డుపై ఒత్తిడి పెరుగుతోంది. రాజకీయ పైరవీలతో సీఎం జగన్ ప్రభుత్వం దొడ్డిదారిలో పలు కాలేజీలను మంజూరు చేసింది. ఈ నేపథ్యంలో వయబిలిటీ ఉన్న ప్రాంతాలను గుర్తించి నోటిఫికేషన్ ద్వారానే కొత్త కాలేజీలు ఇవ్వడం మంచిదని ఇంటర్‌బోర్డు ఓ నిర్ణయానికి వచ్చింది.

## మాతా మాణికేశ్వరి అస్తమయం



అస్తమించిన మాణికేశ్వరి మాత

బళ్లారి, మార్చి 7 (ఆంధ్రజ్యోతి) : తెలంగాణ సరిహద్దులోని కర్ణాటక రాష్ట్రం సూర్యనంది క్షేత్రం(యానగుంది)లో మాణిక్యగిరి కొండపై వెలిసిన మాతా మాణికేశ్వరి శనివారం రాత్రి 7.30గంటలకు పరమపదించారు. విషయం తెలియడంతో ఆశ్రమ ట్రస్టు కమిటీ సభ్యులు బండి శివరాంరెడ్డి, ఏవీ మందార్, జగ్జీవన్ రెడ్డి, సిద్రామప్ప, జ్ఞానేశ్వర్ తదితరులు హుటాహుటిన యానగుంది చేరుకున్నారు. మాతను గుల్బర్గా మెడికల్ అధికారి, వైద్యసిబ్బందితో వచ్చి పరీక్షలు నిర్వహించి పరమపదించినట్లు ధ్రువీకరించారని ట్రస్ట్ సభ్యుడు బండి శివరాం రెడ్డి తెలిపారు. ఈవిషయం సోషల్ మీడియా ద్వారా తెలుసుకున్న భక్తజనం దిగ్భ్రాంతికి లోనయ్యారు. మాతకు కర్ణాటక, తెలంగాణ, ఆంధ్ర, మహారాష్ట్ర తదితర ప్రాంతాల్లో లక్షలాది మంది భక్తులు ఉన్నారు. తాజాగా శివరాత్రి పర్వదినాన మాతను వేలాది మంది భక్తులు దర్శించుకున్నారు. మాత పార్థివ దేహాన్ని ధ్యాన మందిరంలో ఆదివారం నుంచి మూడ్రోజుల పాటు(మంగళవారం సాయంత్రం వరకు) భక్తుల దర్శనార్థం ఉంచనున్నారు.

## 31 నుంచి టెన్త్ పరీక్షలు

- 14 నుంచి హాల్ టికెట్ల డౌన్‌లోడ్ చేసుకోవచ్చు
- విద్యాశాఖ మంత్రి ఆదిమూలపు సురేశ్

అమరావతి, మార్కాపురం, మార్చి 7(ఆంధ్రజ్యోతి): పదో తరగతి పబ్లిక్ పరీక్షలు ఈ నెల 31 నుంచి జరగనున్నాయి. ఏప్రిల్ 17వ తేదీతో పరీక్షలు ముగుస్తాయి. ముందుగా ప్రకటించిన షెడ్యూల్ ప్రకారం ఈ నెల 23 నుంచి పరీక్షలు ప్రారంభం కావాల్సి ఉండగా... స్థానిక సంస్థల ఎన్నికల షెడ్యూల్‌ను విడుదల కావడంతో ప్రభుత్వం పరీక్షలను వాయిదా వేసింది. ఈమేరకు రివైజ్డ్ పరీక్షల షెడ్యూల్‌ను విద్యాశాఖ శనివారం విడుదల చేసింది. పరీక్షల సమయాల్లో ఎలాంటి మార్పులు లేవు. ఉదయం 9.30 గంటల నుంచి 12.15 వరకూ జరుగుతాయి. చివరి రోజు ఒకేషనల్ థియరీ పరీక్ష మాత్రం ఉదయం 9.30 గం. నుంచి 11.30 గంటల వరకు జరుగుతుంది. కాగా, 31 నుంచి జరిగే పరీక్షలకు పకడ్బందీ ఏర్పాట్లు చేస్తున్నట్లు విద్యాశాఖ మంత్రి ఆదిమూలపు సురేశ్ తెలిపారు. ప్రకాశం జిల్లా మార్కాపురంలో ఆయన మీడియాతో మాట్లాడారు. రాష్ట్రంలో 638 సీ కేటగిరి పరీక్ష కేంద్రాల్లో సీసీ కెమెరాల నిఘా ఏర్పాటు చేసినట్లు చెప్పారు. 156 ఫ్లయింగ్ స్క్వాడ్ బృందాలను నియమించామన్నారు. పరీక్షల పర్యవేక్షణ అంతా విద్యాశాఖాధికారులు మాత్రమే చూస్తారన్నారు. విద్యార్థులు ఈ నల 14 నుంచి హాల్ టికెట్లను డౌన్‌లోడ్ చేసుకోవచ్చని మంత్రి సూచించారు. ముందుగా నిర్ణయించిన తేదీల్లోనే మూల్యాంకనం జరుగుతుందని తెలిపారు.

పరీక్షల రివైజ్డ్ టైమ్‌టేబుల్

| తేదీ | సబ్జెక్టు మరియు పేపర్ |
|---|---|
| 31.03.2020 | ఫస్ట్ లాంగ్వేజ్ పేపర్-1 (గ్రూప్-ఎ) |
| | ఫస్ట్ లాంగ్వేజ్ పేపర్-1 (కాంపోజిట్ కోర్స్) |
| 01.04.2020 | ఫస్ట్ లాంగ్వేజ్ పేపర్-2 (గ్రూప్-ఎ) |
| | ఫస్ట్ లాంగ్వేజ్ పేపర్-2 (కాంపోజిట్ కోర్స్) |
| | ఒఎస్ఎస్‌సి మెయిన్ లాంగ్వేజ్ పేపర్-1 (సంస్కృతం, అరబిక్, పర్షియన్) |
| 03.04.20 | సెకండ్ లాంగ్వేజ్ |
| 04.04.20 | ఇంగ్లీషు పేపర్-1 |
| 06.04.20 | ఇంగ్లీషు పేపర్-2 |
| 07.04.20 | మేథ్స్ పేపర్-1 |
| 08.04.20 | మేథ్స్ పేపర్-2 |
| 09.04.20 | జనరల్ సైన్స్ పేపర్-1 |
| 11.04.20 | జనరల్ సైన్స్ పేపర్-2 |
| 13.04.20 | సోషల్ స్టడీస్ పేపర్-1 |
| 15.04.20 | సోషల్ స్టడీస్ పేపర్-2 |
| 16.04.20 | ఒఎస్ఎస్‌సి మెయిన్ లాంగ్వేజ్ పేపర్-2 (సంస్కృతం, అరబిక్, పర్షియన్) |
| 17.04.20 | ఎస్ఎస్‌సి వొకేషనల్ కోర్స్ (థియరీ) |

## లోకం తీరు




**ఎండాకాలం**

| కేంద్రం | గరిష్ఠం | కనిష్ఠం |
|---|---|---|
| రాజమండ్రి | 27.0 | 18.0 |
| శ్రీకాకుళం | 33.0 | 22.0 |
| గుంటూరు | 31.2 | 23.9 |
| విశాఖపట్నం | 31.0 | 25.0 |
| విజయవాడ | 31.8 | 25.2 |
| హైదరాబాద్ | 34.0 | 23.4 |
| అనంతపురం | 36.0 | 24.4 |

### కోస్తాలో వర్షాలు

విశాఖపట్నం, మార్చి 7 (ఆంధ్రజ్యోతి): దక్షిణ ఉత్తరప్రదేశ్ నుంచి విదర్భ, తెలంగాణ, రాయలసీమ మీదుగా తమిళనాడు వరకు ద్రోణి కొనసాగుతోంది. ఎండ తీవ్రతకు సముద్రం నుంచి తేమగాలులు వీస్తున్నాయి. వీటి ప్రభావంతో కోస్తా, రాయలసీమల్లో ఎక్కువచోట్ల శనివారం వర్షాలు కురిశాయి. పొదిలి సమీపంలోని అన్నవరంలో ఎనిమిది, చెన్నపాడు, మార్టూరు, పోతవరం, సీతారామపురంలో ఐదు, చీమకుర్తి, చింతకాయలపల్లెలో నాలుగు సెంటీమీటర్ల వర్షపాతం నమోదైంది. రానున్న ఇరవై నాలుగు గంటల్లో కోస్తా, రాయలసీమల్లో పలుచోట్ల తేలికపాటి నుంచి ఒక మోస్తరు వర్షాలు కురుస్తాయని వాతావరణ శాఖ తెలిపింది. శనివారం కర్నూలు, అనంతపురం, తిరుపతిలో 36 డిగ్రీల ఉష్ణోగ్రత నమోదైంది.

### ఎస్ బ్యాంక్ సంక్షోభం పెట్టుబడిదారీ విధానానికి నిదర్శనం

మోదీ సర్కారు ఆశ్రిత పెట్టుబడిదారీ విధానానికి ఎస్ బ్యాంకు సంక్షోభం ఓ చెత్త ఉదాహరణ. ప్రైవేటు బ్యాంకుల పనితీరుపై పలు సందేహాలు వ్యక్తమవుతున్నాయి. బ్యాంకుల వ్యవహారాల్లో రిజర్వు బ్యాంకు సమయానికి జోక్యం చేసుకోవడంలో విఫలమవుతోందని ఈ ఘటన నిరూపిస్తోంది.

- భారత కమ్యూనిస్టు పార్టీ(మార్క్సిస్టు)



### హిందువులు నిజంగానే ప్రమాదంలో ఉన్నారు

దేశంలో హిందువులు ప్రమాదంలో ఉన్నారని బీజేపీ, హిందూ సంస్థలు ప్రచారం చేస్తున్నాయి. కొన్ని ప్రైవేటు బ్యాంకుల సంక్షోభంతో మోదీ పాలనలో హిందువులు నిజంగానే ప్రమాదంలో ఉన్నారు. ఒడిశాలోని జగన్నాథ దేవాలయానికి చెందిన రూ.545 కోట్లు కూడా ఎస్ బ్యాంకులోనే డిపాజిట్ చేశారు.

- సచిన్ సావంత్, మహారాష్ట్ర కాంగ్రెస్ నేత

### చిత్తవైకల్యం గుట్టువిప్పే మెదడులోని ఇనుము!

లండన్, మార్చి 7 : వణుకుడు వ్యాధి 'పార్కిన్సన్స్', మతిమరుపు(అల్జీమర్స్), చిత్త వైకల్యం(డిమెన్షియా).. ఈ మూడు వ్యాధుల మూలం మెదడులోనే ఉందని బ్రిటన్‌లోని యూనివర్సిటీ కాలేజ్ లండన్ శాస్త్రవేత్తలు అంటున్నారు. వయసు పెరుగుతున్న కొద్దీ మెదడులోని పలు భాగాల్లో పరిమితికి మించి ఇనుము(ఐరన్), హానికారక ప్రొటీన్లు పేరుకుపోవడం వల్లే ఈ వ్యాధులు వస్తుంటాయని వారు తెలిపారు. పార్కిన్సన్స్ బాధితుల్లో చిత్తవైకల్యం ఏ దశలో ఉందనేది తెలుసుకునేందుకు మెదడులోని ఇనుము మోతాదును ప్రామాణికంగా తీసుకోవచ్చన్నారు.

### వెన్ను నొప్పికి మానవ పరిణామ క్రమంలోనే బీజాలు!

మెల్‌బోర్న్, మార్చి 7 : ఈతరాన్ని వేధిస్తున్న వెన్నునొప్పి సమస్యకు బీజాలు మానవ పరిణామ క్రమంలోనే పడ్డాయని కెనడాలోని సైమన్ ఫ్రేజర్ వర్సిటీ శాస్త్రవేత్తలు అంటున్నారు. మన పూర్వీకులైన ఆది మానవులు తొలుత కాళ్ల,చేతులతో ఇతర జంతువుల్లా నడిచేవారు. ఆ కారణంగా అప్పట్లో వారి మెడ, నడుము భాగాల అమరిక, పనితీరు కాస్త భిన్నంగా ఉండేవి. శరీరానికి ముఖ్య ఆధారమైన వెన్నెముక వంపుగా ఉండేది. దాదాపు 40 లక్షల ఏళ్ల క్రితం తొలిసారిగా చాలా ఆది మానవ జాతులు లేచి నిలబడి, కాళ్లపై నడవడం మొదలుపెట్టాయి. ఇంచుమించు 10.9 లక్షల ఏళ్ల క్రితం అన్ని ఆది మానవజాతులు కాళ్లతోనే నడక సాగించాయి. ఆది మానవుల వంపైన వెన్నెముక.. నిటారుగా నిలబడే స్థితికి మారే దశలో చోటుచేసుకున్న శారీరక మార్పులే నేటికీ వెన్నునొప్పికి దారితీస్తున్నాయని శాస్త్రవేత్తలు విశ్లేషించారు.

## సంప్రదాయ దుస్తుల్లో వస్తేనే అమ్మవారి అంతరాలయ దర్శనం



విజయవాడ, మార్చి 7 (ఆంధ్రజ్యోతి): బెజవాడ కనకదుర్గమ్మను అంతరాలయంలోనికి వెళ్లి దర్శించుకోవాలనుకునే భక్తులు ఇక మీదట తప్పనిసరిగా సంప్రదాయ దుస్తుల్లోనే గుడికి రావాల్సి ఉంటుంది. అమ్మవారిని అంతరాలయం నుంచి దర్శనం చేసుకోవాలనుకునే భక్తులు పురుషులైతే పంచె, చొక్కా, కండువాలను ధరించాలి. మహిళలైతే భారతీయ సంప్రదాయం ప్రకారం చీర, జాకెట్టు ధరించి రావాలి. చుడీదార్లు, పంజాబీ డ్రెస్సుల్లో వచ్చే మహిళలు తప్పనిసరిగా చున్నీ ధరించాలి. ఉచిత దర్శనం, ముఖమండపం నుంచి అమ్మవారిని దర్శించుకునే భక్తులకు ఈ సంప్రదాయ దుస్తుల నిబంధన వర్తించదు. కేవలం అంతరాయ దర్శనం కోరుకునే భక్తులకు మాత్రమే ఈ 'సంప్రదాయం' నిబంధన వర్తిస్తుంది. అమ్మవారి దర్శనం కోసం వచ్చే భక్తులు హిందూ ధర్మాన్ని అనుసరించి సంప్రదాయ దుస్తుల్లోనే దేవస్థానానికి రావాలనే నిబంధనను గత ఏడాది జనవరి ఒకటో తేదీ నుంచే అమలులోకి తీసుకువచ్చారు. కొంతమంది భక్తులు ఇప్పటికీ ఆ నిబంధనను పాటించకపోవడంతో ఈ ఉగాది నుంచి తప్పనిసరిగా సంప్రదాయ దుస్తుల్లో వచ్చినవారికి మాత్రమే అమ్మవారి అంతరాలయ దర్శనం కల్పించాలని దుర్గగుడి నూతన పాలక మండలి తీర్మానించింది.

## పద్య, వచన కవిత పోటీల విజేతలకు 21న బహుమతుల ప్రదానం

- కవిసంధ్య సంపాదకుడు శిఖామణి

యానాం, మార్చి 7: యానాంలో ఆంధ్రీకుటీరం, కవిసంధ్య సంయుక్తంగా నిర్వహించిన పద్య, వచన కవిత పోటీల విజేతల వివరాలను కవిసంధ్య సంపాదకుడు డాక్టర్ శిఖామణి, కన్వీనర్ దాట్ల దేవదానం రాజు వెల్లడించారు. వచన కవితలకు న్యాయనిర్ణేతగా అద్దేపల్లి ప్రభు వ్యవహరించారు. ప్రథమ బహుమతి పంట పువ్వు-సీహెచ్ లక్ష్మీనాయుడు (కెన్యువ), ద్వితీయ బహుమతి ఊరు మారిపోయింది-లండ సాంబమూర్తి (ఒంకులూరు), తృతీయ బహుమతి చీకటి పాట-శిఖా అకాష్ (నూజవీడు), కన్సొలేషన్ తలదిండు-శిల్ప జగదీష్ (హైదరాబాద్), వీధి బాలుడు-కొలూరి ప్రసాదరావు (వేళ్ల చింతలగూడెం), మీ టూ, నెత్తురోడని గాయాలు- ఆవాల శారద (విజయవాడ) ఎంపికయ్యారు. పద్యాల పోటీల్లో వరుసగా ఆకాంక్షకు-కందిపాటి గోపాలరావు (నెల్లూరు), వెర్రి రైతు-శినారా (ముమ్మిడివరం), పరిష్కారం-పూసల రజనీ గంగాధర్ (హైదరాబాద్) కన్సొలేషన్ బహుమతులు సామాజిక దృశ్యమాలిక-ఎ.గోపినాధరావు (కోటిపల్లి), మహాకవి జాషువా-డాక్టర్ కేవీఎల్ఎన్ శర్మ (విజయవాడ), మహిళా సంరక్షణీయ-డాక్టర్ ఎస్వీ రాఘవేంద్రరావు (రాజమహేంద్రవరం) ఎంపికయ్యారని శిఖామణి తెలిపారు. ప్రపంచ కవితా దినోత్సవాన్ని పురస్కరించుకుని మార్చి 21న యానాంలో బహుమతి ప్రదానం జరుగుతుందని చెప్పారు.

# సముద్రం పక్క స్థలాలా!

- పేదలను ముంచేలా సేకరణ తీరు
- తీరానికి 200 మీటర్ల దూరంలోనే..
- ముంపును అడ్డుకొనే ఇసుకమేటల్ని చదును చేస్తున్న కృష్ణా అధికారులు
- 500 మీటర్లలోపు నిర్మాణాలు వద్దన్న సీఆర్‌జెడ్ నిబంధనలూ బేఖాతరు
- గొల్లగూడెంగ్రామ పేదలంతా గగ్గోలు..



కృష్ణాజిల్లా గొల్లగూడెంలో అల్లంత దూరంలో కనిపిస్తున్న సముద్రం సమీపంలోనే ఇళ్ల స్థలాల కోసం సిద్ధంచేస్తున్న భూమి ఇదే!

విజయవాడ/మచిలీపట్నం, మార్చి 7 (ఆంధ్రజ్యోతి): స్థలాలు సేకరించామా, పేదలకు ఇచ్చామా! అంతవరకే లెక్క! అవి సముద్రంలో మునుగుతాయా లేక జనసంచారమేలేని మారుమూల కొండప్రాంతాల్లో ఉన్నాయా అన్నది మాత్రం పట్టదు. కృష్ణాజిల్లా అధికార యంత్రాంగం చేపడుతున్న స్థల సేకరణ తీరు ఇలాగే ఉంది. బందరు మండలం పెదపట్నం పంచాయతీలోని గొల్లగూడెం గ్రామానికి సముద్రం 200 మీటర్ల దూరంలోనే ఉంది. అలాంటిచోట సుమారు 1.60 ఎకరాలు సేకరించాలని అధికారులు నిర్ణయించారు. అక్కడ ఇళ్ల స్థలాలు ఇస్తే మేం ఏం చేసుకుంటామని పేదలు గగ్గోలుపెడుతున్నా అధికారులు వినే పరిస్థితిలో లేరు. 'కావాలంటే తీసుకోండి.. లేకుంటే మీ ఖర్మ' అంటూ చేతులు దులుపుకొంటున్నారు. ఈ గ్రామానికి, సముద్రానికి మధ్య ఇసుకమేటలు ఉన్నాయి. తుపానులు, సునామీ వంటి విపత్తుల సమయంలో వేసవిలో కత్తెర పోట్లు, అమావాస్య, పౌర్ణమి సమయాల్లో సముద్రపు నీరు గ్రామంలోకి చొచ్చుకురాకుండా ఈ ఇసుకమేటలు, వాటిపై పెరిగిన చెట్లు రక్షణ కవచంగా ఉంటాయి. ఈ గ్రామంలో 300లకు పైగా కుటుంబాలు నివాసం ఉంటుండగా, లబ్ధిదారులుగా ప్రభుత్వం 71 కుటుంబాలను ఎంపిక చేసింది. వారిలో 30 మందికి సముద్రానికి దూరంగా ఇళ్లస్థలాలు ఇచ్చేందుకు భూమిని గుర్తించారు. మరో 41మందికి మాత్రం సముద్రం పక్కనే 1.60 ఎకరాల ప్రభుత్వ భూమిని స్థలాల కింద ఇవ్వడానికి అధికారులు రంగం సిద్ధం చేశారు. దానికోసం ఇసుకమేటలు చదును చేసే పనులను ఇప్పటికే ప్రారంభించారు. అక్కడ పెరిగిన వేప, ఇతర రకాల చెట్లను తొలగించారు. అయితే ఆ కలప ఏమైందో లెక్కాపత్రం లేదు. 2004 డిసెంబరు 26న సునామీ సంభవించగా గొల్లగూడెం గ్రామం వరకు నీరు వచ్చింది. ఇసుకమేటలు సహా మొత్తం ముంపునకు గురైంది. సీఆర్‌జెడ్ (తీర ప్రాంత నియంత్రణ జోన్) నిబంధనల ప్రకారం సముద్రం నుంచి 500 మీటర్లలోపు ఎలాంటి కట్టడాలు నిర్మించకూడదు. ఆ నిబంధనలను సైతం తుంగలో తొక్కి, సముద్రానికి 200 మీటర్ల దూరంలో ఇళ్ల స్థలాలు కేటాయించడం పేదల ప్రాణాలను ప్రమాదంలో పడేయడమే అవుతుంది.

### అప్పుడు పీకేశారుగా!

గొల్లగూడెం గ్రామస్థులకు సముద్రపు వేటే ఆధారం. 2005లో 10 కుటుంబాలు ఇప్పుడు ఇళ్లస్థలాలు ఇస్తామంటున్న ప్రాంతంలోనే చిన్నపాటి పాకలు వేసుకొని ఉండేవారు. సముద్రం పక్కనే నివాసం ఉంటే విపత్తుల బారిన పడతారంటూ ఈ కుటుంబాలను అప్పట్లో అధికారులు ఖాళీ చేయించారు. వారి పాకలు పీకేయించారు. అప్పటినుంచి ఈ కుటుంబాలవారు సమీపంలోని సరంగిపాలెంలో నివాసం ఉంటున్నారు. అప్పట్లో ఖాళీ చేయించిన ప్రాంతంలోనే ఇప్పుడు ఇళ్ల స్థలాలు ఇవ్వడం గమనార్హం!

### ముంచేస్తున్నారు

"సముద్రానికి దగ్గర్లో ఇళ్లస్థలాలు వద్దని అధికారులకు చెబితే వినడం లేదు. పైగా ఆహ్లాదకరంగా ఉంటుందని చెబుతున్నారు. సముద్రపు వాగ ఎత్తుగా వస్తే ఇప్పుడు స్థలాలు ఇచ్చే ప్రాంతం, మేమూ మునిగిపోతాం"

- బసవాని జగదీశ్, గొల్లగూడెం

### వేరే చోట ఇస్తే వెళతాం

"మా గ్రామంలోని 30 మందికి వేరుశనగ పండేభూమిలో ఇళ్లస్థలాలు ఇస్తున్నారు. మాకు సముద్రానికి దగ్గరలో ఇస్తామంటున్నారు. ఇక్కడున్న వాస్తవ పరిస్థితులను అధికారులు గ్రహించాలి. వేరేచోట మాకు స్థలాలు ఇవ్వాలి"

- బసవాలక్ష్మయ్య, గొల్లగూడెం

### కొండలు, గుట్టల్లో స్థలాలా!

విజయవాడలోని ఇళ్లు లేని పేదల కోసం ఈ నగరానికి 20 కిలో మీటర్ల దూరంలోని గన్నవరం మండలం కొండపావులూరు, సూరంపల్లి గ్రామాలకు సుదూరంగా 300 ఎకరాలలో లే అవుట్లు వేసేందుకు జిల్లా యంత్రాంగం సిద్ధమవుతోంది. కొండపావులూరు గ్రామానికి ఏడు కిలోమీటర్ల దూరంలో ఉన్న కొండ ప్రాంతంలోని మామిడి తోటల నడుమ 200 ఎకరాలు, సూరంపల్లి గ్రామానికి ఆరు కిలోమీటర్ల దూరంలో ఉన్న మామిడి తోటల మధ్యన 100 ఎకరాలలో లేఅవుట్లు వేస్తున్నారు. ఈ రెండు లే అవుట్లలోకి వెళ్లేందుకు సరైన దారి కూడా లేదు. సాయంత్రం అయితే ఈ ప్రాంతంలో నరమానవుడు కూడా సంచరించడు. ఈ ప్రాంతాలకు వెళ్లాలంటే వాగు డొంకలను దాటుకుని వెళ్లాలి. అలాంటి ప్రాంతంలో ఇళ్లస్థలాలు కేటాయిస్తే ఎలా ఉండాలని పేదలు వాపోతున్నారు.

## భూములు లాక్కొంటే చావే శరణ్యం



ఆత్మహత్య చేసుకుంటామంటూ నిరసన తెలుపుతున్న అంజలి, రాజశేఖర్, కుటుంబ సభ్యులు

బాపట్ల రూరల్, మార్చి 7: 'తరతరాలుగా మేం అనుభవిస్తున్న భూమిని దౌర్జన్యంగా లాక్కొంటే ఇక మాకు చావే శరణ్యం' అంటూ గుంటూరు జిల్లా బాపట్ల మండలం జిల్లెళ్ళమూడి గ్రామంలో వేల్పూరి అంజలి కుటుంబ సభ్యులు పెట్రోలు సీసాలతో ఆందోళనకు దిగారు. సర్వే నంబరు 19/1లోని ఎకరం 1.37 సెంట్ల భూమిని వంశపారంపర్యంగా సాగుచేసుకుంటున్నామని, తన తండ్రి చనిపోతూ తన తల్లి అంజలి పేరు మీద దీనిని రిజిస్ట్రేషన్ చేయించారని రాజశేఖర్ చెప్పారు. పొలానికి సంబంధించిన దస్తావేజులు చూపినా, సర్వే చేయాలని కోరినా అధికారులు పట్టించుకోలేదని వాపోయారు. ఈ పొలంపై తప్పుడు పత్రాలు సృష్టించి గ్రామంలోని కొందరు నాయకులు భూమిని లాక్కోవాలని చూస్తున్నారని ఆరోపించారు.



సమావేశానికి హాజరైన వలంటీర్లు

# సైనికుల్లా పనిచేసి.. జగనన్న రుణం తీర్చుకోండి!

- వలంటీర్లతో డిప్యూటీ సీఎం అంజద్‌బాషా
- రాష్ట్రవ్యాప్తంగా వైసీపీ నేతల సమావేశాలు

సీకేదిన్నె, మార్చి 7: 'జగనన్న రుణం తీర్చుకునే అవకాశం వచ్చింది. మీరంతా ఈ 15 రోజులు సైనికుల్లా పనిచేయాలి. రేయింబవళ్లు కష్టపడి కడప కార్పొరేషన్‌లోని మొత్తం 50 డివిజన్లనూ గెలిపించి ముఖ్యమంత్రికి కానుకగా ఇవ్వాలి'.. స్థానిక ఎన్నికల నగారా మోగిన నేపథ్యంలో డిప్యూటీ సీఎం అంజద్‌బాషా చేసిన వ్యాఖ్యలివి. అయితే ఈ పిలుపునిచ్చింది వైసీపీ కార్యకర్తలకు కాదు.. ప్రభుత్వ పథకాల అమలు కోసం నియమించుకున్న గ్రామ, వార్డు సచివాలయ వలంటీర్లకు. కడప జిల్లా చింతకొమ్మదిన్నెలో శనివారం కడప కార్పొరేషన్ 50 డివిజన్లకు సంబంధించి 2 వేల మందికిపైగా వలంటీర్లతో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా డిప్యూటీ సీఎం మాట్లాడుతూ.. జగనన్న రుణం తీర్చుకునేందుకు వలంటీర్లు నిర్విరామంగా కృషి చేయాలన్నారు. జగన్ ముఖ్యమంత్రి అయిన వెంటనే వలంటీర్లను నియమించారని, కాబట్టి వారంతా రాబోయే ఎన్నికల్లో సైనికుల్లా రాత్రింబవళ్లు కష్టపడి వైసీపీకి విజయం అందించాలని తెలిపారు. రాష్ట్రవ్యాప్తంగా అనేక చోట్ల వైసీపీ నాయకులు ఇలాంటి సమావేశాలే ఏర్పాటు చేసి ఎన్నికల సన్నద్ధతపై వలంటీర్లకు దిశానిర్దేశం చేస్తున్నారు.

### ఓటమికి స్థానిక నేతలదే బాధ్యత: విజయసాయిరెడ్డి

శ్రీకాకుళం, మార్చి 7(ఆంధ్రజ్యోతి): "స్థానిక ఎన్నికల్లో అభ్యర్థుల ఎంపికలో స్థానిక నాయకులకు పూర్తి స్వేచ్ఛ ఇస్తున్నాం. ఓటమికి నాయకులే బాధ్యత వహించాల్సి ఉంటుంది" అని ఎంపీ విజయసాయిరెడ్డి అన్నారు. శనివారం శ్రీకాకుళంలో వైసీపీ శ్రేణులతో జరిగిన సమావేశంలో ఆయన మాట్లాడారు.

### చంద్రబాబు, పవన్ డ్రామా ఆర్టిస్టులు: మంత్రి కొడాలి

"టీడీపీ డ్రామా కంపెనీ. చంద్రబాబు, పవన్ డ్రామా ఆర్టిస్టులు. ఇప్పటికైనా తీరు మారకపోతే చంద్రబాబును ప్రజలే తుక్కుతుక్కుగా కొడతారు" అని మంత్రి కొడాలి నాని అన్నారు. శనివారం శ్రీకాకుళంలో ఆయన మాట్లాడారు. చంద్రబాబువి చిల్లర మాటలన్నారు. ప్రజా సంక్షేమానికి జగన్ కృషి చేస్తుంటే... వీడియో గేమ్స్ ఆడుతారని కొందరు తప్పుడు కూతలు కూస్తున్నారని మండిపడ్డారు.


**SANKARA NETHRALAYA**
(A Unit of Medical Research Foundation)
18, College Road, Chennai - 600 006. Phone: 28271616
A renowned Ophthalmic Tertiary Care Hospital requires for its Centre at Sricity, TADA, AP
Ophthalmologists with 2 - 5 years experience in performing Cataract Surgeries (SICS, Phaco with IOL)
Interested candidates may e-mail their Resume within 7 days to: hr@snmail.org


# మహిళా దినోత్సవానికి జగన్ పేరా!

- సోషల్ మీడియా పేటీఎం.. గ్యాంగులకు అంకితమిస్తున్నారా?
- తెలుగు మహిళలు అనిత, అనురాధ ఆగ్రహం

అమరావతి, మార్చి7 (ఆంధ్రజ్యోతి): మహిళా దినోత్సవాన్ని వైసీపీ జరపడాన్ని ఎద్దేవా చేస్తూ టీడీపీ మహిళా నేతలు ట్విటర్‌లో స్పందించారు. "వైసీపీ పేటీఎం బ్యాచ్ మహిళల్ని అసభ్యకర పోస్టులతో కించపరుస్తున్నారు. కేసు పెడితే పట్టించుకోవడం లేదు. వృద్ధులు, చిన్నారులపై కూడా అత్యాచారాలు పెరిగిపోయాయి. నీ పాలనలో మహిళలు పడుతున్న ఇబ్బందులకు గుర్తుగానే జగనన్న మహిళా దినోత్సవం చేస్తున్నావా?" అంటూ తెలుగు మహిళ రాష్ట్ర అధ్యక్షురాలు వంగలపూడి అనిత ప్రశ్నించారు. 'మహిళలను వేధింపులకు గురి చేస్తున్న మీకు మహిళా దినోత్సవంలో పాల్గొనే అర్హత లేదు' అంటూ అనిత, జగన్‌కు ఓ లేఖ రాశారు. మహిళలకు రాజ్యాంగం కల్పించిన హక్కులను పరిరక్షించడంలో వైసీపీ ప్రభుత్వం ఘోరంగా విఫలమైందని ధ్వజమెత్తారు. నరకాసురుని మించిన వైసీపీ అకృత్యపాలనకు సత్యభామలుగా మారి మహిళలు చరమగీతం పాడతారని హెచ్చరించారు. టీడీపీ అధికార ప్రతినిధి పంచుమర్తి అనురాధ తన ట్వీట్‌లో "బీసీ మహిళనైన తన లాంటి ఎందరో ఆడపడుచుల్ని అసభ్య పదజాలంతో దూషిస్తూ, కించపరుస్తున్న వైసీపీ నేతలు, సోషల్ మీడియా పేటీఎం గ్యాంగ్‌లకు అంకితమిచ్చేందుకేనా జగనన్న మహిళా దినోత్సవంఅని పేరుపెట్టుకుని మరీ జరుపుతున్నారు?" అంటూ ఆగ్రహం వ్యక్తం చేశారు.

## జగన్‌ది మొసలి కన్నీరు

- నాడు తండ్రి, నేడు తనయుడు.. బీసీల వెన్ను విరిచే కుట్ర: టీడీపీ

అమరావతి, మార్చి7 (ఆంధ్రజ్యోతి): స్థానిక ఎన్నికల్లో బీసీ రిజర్వేషన్ అంశంపై టీడీపీ నేతలు ట్విటర్ వేదికగా విరుచుకుపడ్డారు. "బీసీల రిజర్వేషన్లు ఎత్తేసి జగన్ మొసలి కన్నీరు కారుస్తున్నారు. బీసీలకు రైట్ రాయల్‌గా రావాల్సిన రిజర్వేషన్లలో 10% కోతేశారు. సుప్రీం కోర్టుకు వెళ్లకుండా 34% ఇస్తామంటూ వైసీపీ నేత సజ్జల కోతలు కోయడమెందుకు?' అని టీడీఎల్పీ ఉపనేత అచ్చెన్నాయుడు మండిపడ్డారు. 'నాడు వైఎస్సార్, నేడు జగన్ 16,500 మంది బీసీలకు పదవులను దూరం చేసి తీరని అన్యాయం చేస్తున్నారు' అని కాల్వ శ్రీనివాసులు మండిపడ్డారు. "బీసీల రిజర్వేషన్లు పెంచింది టీడీపీ. కాదనే దమ్ము ఏ వైసీపీ నేతకైనా ఉందా? బీసీలు గర్జిస్తే వైసీపీ నామరూపాలు లేకుండా పోతుంది" అని ఎమ్మెల్సీ కేఈ ప్రభాక ర్ అన్నారు. మాజీ విప్ కూన రవికుమార్ ట్వీట్ చేస్తూ... "టీడీపీకి వెన్నుముక బీసీలు. వారి వెన్ను విరిచే కుట్ర నాడు త్రండి, నేడు తనయుడు చేస్తున్నారు. బీసీల రిజర్వేషన్లు 34-24 శాతంకాగా, అమలులో మాత్రం 10% విదిలిస్తున్నారు" అని విమర్శించారు.

## కుడిగట్టు రక్షణ గోడ నిర్మించాలి: నిపుణుల కమిటీ

శ్రీశైలం, మార్చి 7: శ్రీశైలం ప్రాజెక్టు దిగువన కుడిగట్టు రక్షణ గోడ నిర్మాణం చేపట్టాల్సి ఉందని డ్యాం భద్రత నిపుణుల కమిటీ చైర్మన్ పాండ్యా తెలిపారు. భూగర్భ శాస్త్రవేత్తలచే ప్రొటెక్షన్ వాల్ పరిస్థితి తెలుసుకోవాల్సి ఉందని.. క్రస్ట్‌గేట్లకు చిన్న చిన్న మరమ్మతులు చేయాలని ఆయన వెల్లడించారు. ప్రస్తుతం డ్యాం భద్రతకు ఎలాంటి ఢోకా లేదని స్పష్టంచేశారు. మూడు రోజుల పాటు శ్రీశైలం డ్యాంను 9 మంది సభ్యులతో కూడిన బృందం పరిశీలించింది.. శనివారం అతిథిగృహంలో పాండ్యా బృందం మాట్లాడుతూ ఆనకట్ట నిర్మించి 50 సంవత్సరాలు పూర్తవడంతో కొన్ని మరమ్మతులు చేపట్టాల్సిన అవసరం ఉందన్నారు.

## వెంకన్నకు తలనీలాల ద్వారా రూ.26.44 కోట్లు

తిరుమల, మార్చి 7 (ఆంధ్రజ్యోతి): భక్తులు సమర్పించిన తలనీలాల విక్రయం ద్వారా టీటీడీకి రూ.26.44 కోట్ల ఆదాయం సమకూరింది. టీటీడీ అదనపు ఈవో ధర్మారెడ్డి ఆధ్వర్యంలో తలనీలాలకు శనివారం ఆన్‌లైన్ ఈ-వేలం నిర్వహించారు. మొదటి, రెండు, మూడు, నాలుగు గ్రేడ్ల తలనీలాలు, తెల్లవెంట్రుకలను వేలం వేయగా మొత్తం 33,800 కిలోల కేశాలు అమ్ముడుపోయాయి.

## 10న రూ.300 టికెట్ల ఆన్‌లైన్ కోటా విడుదల

శ్రీవారి దర్శనానికి సంబంధించి రూ.300 టికెట్ల జూన్ నెల కోటాను ఈ నెల 10వ తేదీన విడుదల చేయనున్నట్టు టీటీడీ శనివారం ఒక ప్రకటనలో తెలిపింది. భక్తులు ఈ విషయాన్ని గమనించి ఆన్‌లైన్, ఈ-దర్శన్ కౌంటర్లు, తపాలా కార్యాలయాల్లో టికెట్లు బుక్ చేసుకోవచ్చని పేర్కొంది.

# మద్యం.. కాదు మృత్యువు!

- సముద్రంలో దొరికిన సీసా
- మందు అనుకుని తాగేసిన మత్స్యకారులు
- ఇద్దరు మృతి.. ఒకరి పరిస్థితి విషమం



గుండమాల (కొత్తపట్నం), మార్చి 7: ఆ ముగ్గురూ మత్స్యకారులు.. సముద్రంలో చేపల వేటకు వెళ్లిన వారికి నీళ్లపై తేలుతున్న బాటిల్ దొరికింది. అది మద్యం సీసా అనుకుని ఒడ్డుకు వచ్చిన తర్వాత ఆనందంగా తాగేశారు. అలా తాగిన కొద్దిసేపటికే ఇద్దరు ప్రాణాలు విడిచారు. మరొకరు చావుబతుకులతో పోరాడుతున్నారు. ప్రకాశం జిల్లా కొత్తపట్నం మండలం గుండమాల తీరంలో శుక్రవారం అర్ధరాత్రి ఈ దుర్ఘటన చోటుచేసుకుంది. గుండమాల గ్రామానికి చెందిన పొన్నాడి నరసింహారావు (55), రాసాని చిననాగేంద్రం (60), పిన్ని వీరరాఘవులు అనే మత్స్యకారులు శుక్రవారం మధ్యాహ్నం వేటకు వెళ్లారు. సముద్రంలో నీటిపై తేలుతున్న సీసాను చూసి ఖరీదైన మద్యం బాటిల్‌గా భావించారు. వేటాడిన మత్స్యసంపదతో ఒడ్డుకు చేరుకున్న తర్వాత ముగ్గురూ ఆ సీసాలో ఉన్న ద్రావణాన్ని సేవించారు. కొద్దిసేపటికే నరసింహారావు అస్వస్థతకు గురయ్యాడు. ఆస్పత్రికి తరలిస్తుండగా ప్రాణాలు వదిలాడు. అరగంట తర్వాత చిననాగేంద్రం కుప్పకూలిపోయాడు. ఆస్పత్రికి తరలించేలోపే అతను కూడా చనిపోయాడు. దీంతో భయంతో వీరరాఘవులును కూడా ఒంగోలు రిమ్స్ ఆస్పత్రికి తరలించారు. ప్రస్తుతం అతని పరిస్థితి విషమంగా ఉంది. శనివారం మత్స్యకారులకు దొరికిన సీసాలో విషపదార్థం ఉండి ఉంటుందని భావిస్తున్నారు.



చికిత్సపొందుతున్న విద్యార్థులు

## విద్యార్థులకు పురుగుల మందు ఘాటు

- 28 మందికి అస్వస్థత, 'పశ్చిమ'లో ఘటన

గోపాలపురం, మార్చి 7: పురుగు మందుల ప్రభావంతో సుమారు 28 మంది విద్యార్థులు అస్వస్థతకు గురైన సంఘటన పశ్చిమగోదావరి జిల్లా జగన్నాథపురం జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో శనివారం చోటు చేసుకుంది. పాఠశాలకు ఆనుకుని ఉన్న పొలంలో పశువుల పాక ఉంది. పశువులకు పేను నియంత్రించేందుకు పాకకు శనివారం మందు పిచికారి చేశారు. అదే సమయంలో పాఠశాలకు వచ్చిన విద్యార్థులు తరగతి గదికి వెళ్లేసరికి పురుగుల మందు ఘాటును భరించలేక బయటకు వచ్చారు. ఉపాధ్యాయులు తరగతి గదిలోకి ఎవరు వెళ్లవద్దని బయట ఉన్న హాలులోనే కూర్చోవాలని సూచించారు. కొంతసేపటికి పురుగుల మందు ఘాటుకు ముగ్గురు విద్యార్థులు స్పృహతప్పి పడిపోవడంతో ఉపాధ్యాయులు హుటాహుటిన కొయ్యలగూడెం ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. అనంతరం 8, 9 తరగతులకు చెందిన 25 మంది విద్యార్థులు కూడా కళ్లు తిరిగి పడిపోగా, వారినీ ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు.

## అకాల వర్షం... రైతుకు కష్టం

అమరావతి, మార్చి 7(ఆంధ్రజ్యోతి): రాష్ట్రంలో అకాల వర్షాలు మరోసారి రైతులకు నష్టాన్ని కలిగించాయి. గత నెలలో అకాల వర్షాలు కురవగా.. శనివారం ఉపరితల ద్రోణి ప్రభావంతో దక్షిణ కోస్తా, రాయలసీమ జిల్లాల్లో వర్షాలు పడ్డాయి. ప్రకాశం జిల్లాలో భారీ వర్షం కురిసింది. గుంటూరు, నెల్లూరు, కడప, కర్నూలు, కృష్ణా, విజయనగరం జిల్లాల్లో అక్కడక్కడ చెదురుమదురు నుంచి ఓ మోస్తరు వర్షాలు పడ్డాయి. ప్రకాశం జిల్లా పొదిలిలో గరిష్టంగా 81.5 మిల్లీమీటర్ల వర్షపాతం నమోదయింది. ఈ అకాల వర్షానికి కల్లాల్లో మిర్చి తడిసింది. రైతులు ఆదరబాదరగా పట్టలు కప్పి కాపాడుకునే ప్రయత్నం చేశారు. కోతకొచ్చిన శనగ వర్షానికి దెబ్బతింటుందని రైతులు ఆందోళన చెందుతున్నారు.



## ఢిల్లీలో లేపాక్షి కౌంటర్

న్యూఢిల్లీ, మార్చి 7 (ఆంధ్రజ్యోతి): ఢిల్లీ ఆంధ్రప్రదేశ్ భవన్‌లో లేపాక్షి హస్తకళల సేల్స్ కౌంటర్‌ను రాష్ట్ర గవర్నర్ విశ్వభూషణ్ హరిచందన్ శనివారం ప్రారంభించారు. ఈ సందర్భంగా గవర్నర్ మాట్లాడుతూ... హస్తకళలకు ఆంధ్రప్రదేశ్ ప్రసిద్ధి అని చెప్పారు. రాష్ట్ర ప్రభుత్వం కళలను ప్రోత్సహిస్తోందని, భవిష్యత్తులోనూ ప్రోత్సహిస్తుందని తెలిపారు. కార్యక్రమంలో ఏపీ భవన్ ప్రిన్సిపల్ రెసిడెంట్ కమిషనర్ అభయ్ త్రిపాఠి, రెసిడెంట్ కమిషనర్ భావన సక్సేనా, లేపాక్షి జీఎం ఎల్వీ లక్ష్మీనాథ్ తదితరులు పాల్గొన్నారు.

## మోదీ, షాతో దేశం సర్వనాశనం

- మరో స్వాతంత్ర్య పోరాటానికి సిద్ధంకండి
- వామపక్ష జాతీయ నేతల పిలుపు



కడప, మార్చి 7(ఆంధ్రజ్యోతి): "ప్రధాని మోదీ, హోం మంత్రి అమిత్‌షాల నిర్వాకంతో దేశం సర్వనాశనం అవుతోంది. దేశంలో ఆర్ఎస్ఎస్ అజెండాను అమలు చేస్తున్నారు. స్వాతంత్ర్య పోరాటంలో బ్రిటీష్ వారితో వామపక్షాలు పోరాడితే... ఆర్ఎస్ఎస్ నేతలు వారి బూట్లు నాకారు. రాజ్యాంగాన్ని కాపాడుకునేందుకు మరొక స్వాతంత్ర్య పోరాటానికి సిద్ధంగా ఉండాలి" అని సీపీఎం, సీపీఐ జాతీయ ప్రధాన కార్యదర్శులు సీతారాం ఏచూరి, డి.రాజా పిలుపునిచ్చారు. శనివారం సాయంత్రం కడప మున్సిపల్ గ్రౌండ్‌లో జిల్లా జాయింట్ యాక్షన్ కమిటీ ఆధ్వర్యంలో భారీ బహిరంగ సభ నిర్వహించారు. ఏదైనా తీర్మానం చేసేటప్పుడు మంచి, చెడు ఆలోచించకుండా మోదీ, షాలు రాక్షసుల్లా ప్రవర్తిస్తున్నారంటూ ఏచూరి ఆగ్రహం వ్యక్తం చేశారు. విభజించు, పాలించు అనే బ్రిటీషు వారి నినాదాన్ని వారి బూట్లు నాకిన ఆర్ఎస్ఎస్, బీజేపీ నాయకులు అవలంబిస్తున్నారని డీ రాజా అన్నారు. సభలో సీపీఐ, సీపీఎం రాష్ట్ర కార్యదర్శులు రామకృష్ణ, మధు, పీసీసీ అధ్యక్షుడు శైలజానాథ్ తదితరులు మాట్లాడారు. ఎన్ఆర్‌సీపై వైసీపీ ద్వంద్వ వైఖరిని ఎండగట్టారు.



## లేపాక్షి ఉత్సవాలు ప్రారంభం

హిందూపురం, మార్చి 7: శిల్పకళా పర్యాటక క్షేత్రం లేపాక్షి వైభవం అంబరాన్నంటింది. అనంతపురం జిల్లాలో రెండు రోజుల పాటు నిర్వహించే లేపాక్షి వైభవ ఉత్సవాలు శనివారం ప్రారంభమయ్యాయి. ఏపీఆర్ బీసీ స్కూల్లో ఏర్పాటుచేసిన వేదికపై ఈ ఉత్సవాలను పర్యాటక శాఖ సీఈఓ, ఎండీ ప్రవీణ్‌కుమార్, జిల్లా కలెక్టర్ గంధం చంద్రుడు ప్రారంభించారు. ఈ సందర్భంగా ప్రవీణ్‌కుమార్ మాట్లాడుతూ రాష్ట్రంలో పర్యాటకులను ఆకర్షించడానికి ఇలాంటి ఉత్సవాలు ఎంతగానో ఉపాయోగపడతాయన్నారు. లేపాక్షి వైభవాన్ని ప్రపంచ పటంలో పెట్టేందుకు కృషి చేస్తామన్నారు. రాష్ట్రంలో పర్యాటకులను ఆకర్షించేందుకు టూరిజం అనుసంధానం చేస్తున్నట్లు తెలిపారు. ఉత్సవాల్లో కూచిపూడి, క్లాసికల్ డ్యాన్స్, సినీ పాటలు, లేపాక్షి వైభవంతో అలరించాయి. ఈ ఉత్సవాల్లో గ్రామీణ వాతావరణం ఉట్టిపడేలా స్టాల్స్ ఏర్పాటుచేయగా చూసేందుకు జిల్లాతో పాటు కర్ణాటక ప్రాంత పర్యాటకులు తరలివచ్చారు.


**SHRIRAM City**
MONEY WHEN YOU NEED IT MOST
(SHRIRAM CITY UNION FINANCE LTD.)
రిజిస్టర్డ్ ఆఫీస్: 123, అంగప్పన్ నైక్కెన్ వీధి, చెన్నై-600001.
కార్పొరేట్ ఆఫీస్: 144, శాంథోమ్ హైరోడ్, మైలాపూర్, చెన్నై-600004
గోల్డ్ వేలం మరియు ఇన్విటేషన్ నోటీసు
ఈ క్రింద పేర్కొన్న రుణగ్రహీతలు గోల్డ్ ఆభరణాలు హామీపై శ్రీరామ్ సిటీ యూనియన్ ఫైనాన్స్ లిమిటెడ్ (SCUF) నుండి పొందిన రుణముల యొక్క బకాయిలను తిరిగి చెల్లించవలసినదిగా నోటీసులు పంపడం జరిగినది. కానీ వారు తమ బకాయిలను తిరిగి చెల్లించడంలో విఫలమయ్యారు. ఈ హామీ పెట్టిన బంగారం ఆభరణాల యొక్క వేలంపాటను మేము తేది. 17.03.2020 నాడు వేలం వేస్తాము. ఈ వేలములో కంపెనీకి రావలసిన సొమ్ము కన్నా ఎక్కువ సొమ్ము వచ్చిన యెడల ఆ మొత్తాన్ని రుణగ్రహీతకు చెల్లించటం జరుగుతుంది. తక్కువ వచ్చిన యెడల ఆ మొత్తాన్ని రుణగ్రహీత నుండి చట్టపరమైన చర్యల ద్వారా వసూలు చేయడం జరుగుతుంది. SCUF ఈ క్రింది ఖాతాలలో వేటినైనా వేలం నుండి తొలగించటానికి మరియు ఎటువంటి ముందస్తు నోటీసు లేకుండా వేలం తేదీని మార్చడానికి అధికారం కలిగి ఉంటుంది.

| Loan A/C No | Customer Name | Loan A/C No | Customer Name |
|---|---|---|---|
| GNVRMPJ1906120012 | KHAJAVALI SHAIK | MYLVMPJ1906080003 | ASHOK KUMAR GADE |
| GNVRMPJ1906220004 | USALA KIRAN | MYLVMPJ1906190006 | RAMESH AJMIRA |
| GNVRMPJ1906220005 | NAGARAJU GOLLA | NUZVDPJ1906030001 | SADGURU SWAMY |
| IBPATPJ1906070005 | MALLA REDDY D | NUZVDPJ1906050001 | LAKSHMI DIVYA |
| KCHRLPJ1906060005 | RAJ BAHADHOOR MANNAVA | VIJA8PJ1906080001 | SRIDEVI |
| KCHRLPJ1906070005 | VENKATESWARARAO | VIJA8PJ1906080003 | SRIDEVI |
| KCHRLPJ1906170011 | SRINIVASA RAO ARJA | VIJA8PJ1906080006 | SRIDEVI |
| KCHRLPJ1906190001 | SWARUPA BANKA | VIJA8PJ1906180002 | PRAKASH |
| KCHRLPJ1906210007 | ESOBU BANKA | VIJA8PJ1906180003 | SRIDEVI |
| KCHRLPJ1906250001 | CHITTAREDDY NAGARAJU | VIJA8PJ1906180003 | SRIDEVI |
| KKLRUPJ1906110002 | PARAM JYOTHI ERICHARLA | VUYY4PJ1906070001 | SIVA RAMA PRASAD AMBATI |

క్రింద ఉదహరించిన చిరునామా వద్ద వేలం వేయడం జరుగుతుంది: శ్రీరామ్ సిటీ యూనియన్ ఫైనాన్స్ లిమిటెడ్, డి.నం. 56-11-3/1, 1 వ అంతస్తు, దుర్గామహల్ దగ్గర,గోల్డెన్‌టవర్స్,విజయవాడ -520002. వేలం సమయం: 11.00 AM
మరింత సమాచారం కోసం, నిబంధనలు, షరతులు మరియు వేలంలో పాల్గొనడానికి రిజిస్టర్ చేసుకోవటానికి, ఆసక్తిగల కొనుగోలుదారుడు శ్రీ కె. శ్రీమన్నారాయణ ను సంప్రదించవచ్చు. సమయాభావముతో వేలము ఆ రోజు పూర్తి కాని యెడల మరుసటిరోజు అదే నియమ నిబంధనలకు లోబడి వేలము నిర్వహించబడును. కస్టమర్ మరణించినట్లయితే, వేలంకు సంబంధించిన అన్ని షరతులు అతని/ఆమె చట్టపరమైన వారసులకు వర్తిస్తాయి.
తేది: 07.03.2020 సం/- అధీకృత అధికారి
స్థలం: విజయవాడ శ్రీరామ్ సిటీ యూనియన్ ఫైనాన్స్ లిమిటెడ్



కొనండి 2 పొందండి 1 ఉచితం*



★ షరతులు వర్తిస్తాయి
మేము దుప్పట్లు, పిల్లో కవర్లు, టవల్స్, ఫర్నిషింగ్ క్లాత్స్ వగైరాను ప్రభుత్వ శాఖలు / ప్రైవేట్ రంగ సంస్థలకు పెద్ద మొత్తంలో సరఫరా చేస్తాం.
దగ్గరలోని మా షోరూంను సందర్శించండి
హోటల్ రాజ్ టవర్ దగ్గర, ఏలూరు రోడ్, విజయవాడ
ఫోన్ : 0866 2573350
● మా అన్ని షోరూంలలో ఈ ఆఫరు వర్తిస్తుంది ● ఆదివారాలు మరియు అన్ని సెలవు రోజులలో తెరచి ఉంటుంది
Shop Online at www.cooptex.gov.in www.facebook.com/cooptex www.instagram.com/cooptexindia
DIPR/385/DIS/2020

### మహిళా కమిషన్‌ను మేనేజ్ చేశారు!

అమరావతి మహిళలపై పోలీసుల అనుచిత ప్రవర్తనను నిజనిర్ధారణ చేయటానికి వచ్చిన మహిళా కమిషన్ సభ్యులను వైసీపీ ప్రభుత్వం మేనేజ్ చేసింది. దీంతో జాతీయ మహిళా కమిషన్ సభ్యులకు మేము అందించిన రుజువులు, సాక్ష్యాలను బుట్టదాఖలు చేశారు. జేఏసీ నేతలతో కలిసి నేను ఢిల్లీ పర్యటనలో కమిషన్ చైర్‌పర్సన్ రేఖా శర్మను కలిసిన సందర్భంలో ఈ విషయం తేటతెల్లమయ్యింది. విషయాన్ని కమిషన్ చైర్‌పర్సన్‌కు తెలిపాం. వైసీపీ ప్రభుత్వం అమరావతిపై లేనిపోనివన్నీ ఢిల్లీలో ప్రచారం చేస్తోంది.

-జమ్ముల శైలజ, తుళ్లూరు మహిళ



శ్రమకోర్చి చెమటోడ్చి...
ఇటుక ఇటుక పేర్చి
ధరిత్రిపై చిరి సృష్టికై...
సగం నీవు, సమం నీవు



# చట్టాలకన్నా చైతన్యమే ముఖ్యం

## స్త్రీలను వేధించకూడదనే భావన ప్రతి ఒక్కరిలోనూ పెంపొందాలి

- పురుషులందరూ చెడ్డవారు కాదు వారిలో కొందరివల్లే ఈసమస్యలు
- ఉమెన్ డే స్ఫూర్తి మగవారిలోనూ..
- మహిళలకు భరోసా కోసమే 'దిశ'
- 'దిశ' ప్రత్యేక అధికారి దీపికా ఎం పాటిల్



అమరావతి, మార్చి 7 (ఆంధ్రజ్యోతి): మహిళా దినోత్సవం అంటే కేవలం ఆడవాళ్లు, బాలికలకు సంబంధించినదే కాదని, పురుషులు సైతం మహిళలకు హాని చేయరాదన్న ఆలోచనకు వందశాతం రావాలని 'దిశ' ప్రత్యేక అధికారి దీపికా ఎం. పాటిల్ అభిప్రాయపడ్డారు. ప్రభుత్వాలు ఎన్ని చట్టాలు చేస్తున్నా, వాటిని పోలీసులు కఠినంగా అమలు చేస్తున్నా, న్యాయస్థానాల్లో బాధ్యులకు శిక్షలు పడుతున్నా మహిళలపై లైంగిక దాడులు జరుగుతుండటం బాధాకరం అంటున్న యువ ఐపీఎస్ అధికారి 'ఆంధ్రజ్యోతి'తో ముచ్చటించారు.

### యాప్ ఉంటే సేఫ్

"దాదాపు అందరూ స్మార్ట్ ఫోన్ వాడుతున్నారు. దిశ యాప్‌ను రోజుల్లోనే లక్షల మంది డౌన్‌లోడ్ చేసుకున్నారు.. వేలల్లో టెస్ట్ కాల్స్ వచ్చాయి. వందల్లో ఫిర్యాదులు వచ్చాయి. పదుల సంఖ్యలో ఎఫ్ఐఆర్‌లు నమోదు చేశాం.. 51కేసుల్లో చార్జిషీట్లు కూడా దాఖలు చేశాం. టెక్నాలజీతో పాటు అన్ని విభాగాలు సమన్వయం చేసుకోవడం ద్వారానే ఇదంతా సాధ్యమయింది"

### నేరానికి ముందే చేరిపోయి..

"మనం ఎంత నాగరికత వైపు అడుగులు వేస్తున్నా ఇప్పటికీ మహిళలు, బాలికలు, యువతులపై లైంగిక దాడులు మొదలుకొని ప్రాణాలు తీసేవరకూ అన్ని రకాల నేరాలు జరుగుతున్నాయి. దేశంలో ఐపీసీ సెక్షన్లతో పాటు నిర్భయ, పోక్సో లాంటివి ఉన్నా వీటికి అడ్డుకట్ట పడటం లేదు. రాష్ట్రంలో ఈ చర్యలను మరింత కఠినతరం చేస్తూ ప్రభుత్వం 'దిశ' చట్టం చేసింది. రాష్ట్రపతి నుంచి దానికి ఆమోదం లభించాల్సి ఉంది. 'దిశ' చట్టం తెచ్చిన నేపథ్యంలో ప్రతి మహిళకు భరోసా ఇచ్చేలా డిసెంబరు 15నుంచే చర్యలు చేపట్టాం. ఫిర్యాదు అందిన రెండు, మూడు నిముషాల్లోనే ఘటనా స్థలానికి చేరుతున్నాం. రైల్వే స్టేషన్లు, బస్టాండ్లు, పని చేసే చోటు, రద్దీ ప్రాంతాలు ఎక్కడ సమస్య వచ్చినా పోలీసులు నిమిషాల్లో చేరుతున్నారు"

### ఇప్పటికే చట్టాలు ఉన్నా...

"ఇప్పటికే నిర్భయ, పోక్సో లాంటి చట్టాలున్నా వాటికన్నా 'దిశ' పదును ఎక్కువ. చట్ట పరిధి దాటకుండా సత్వర న్యాయం కోసం వచ్చిందే ఈ చట్టం. ప్రతి జిల్లాలోనూ పోలీస్ స్టేషన్, ప్రత్యేక కోర్టు, ఫోరెన్సిక్ ల్యాబ్‌ల బలోపేతం, దర్యాప్తు వేగవంతం, నాణ్యత లోపించకుండా సమర్థమంతమైన అధికారులకు 30శాతం అధిక వేతనం చెల్లించి ప్రభుత్వం నియమించింది. రెగ్యులర్ డీఎస్పీతోపాటు సూపర్ న్యూమరీ ఉంటారు. ఎస్ఐలు, కింది స్థాయి సిబ్బంది కూడా ఉంటారు"

### గ్రామాలపైనా 'దిశ' దృష్టి

"గ్రామీణ ప్రాంతాల్లోని మహిళలతోపాటు పట్టణాల్లోని నిరుపేదలకు ఇప్పటికీ స్మార్ట్ ఫోన్‌లేదు. వాళ్లల్లో చైతన్యం తీసుకొచ్చేందుకు ఓ వైపు ప్రచారం చేస్తూ మరోవైపు ప్రతి గ్రామానికి ఒక మహిళా రక్షణ కార్యదర్శిని నియమించాం"

### ధైర్యం చేయండి..

"మహిళలు భయపడకుండా ముందుకొచ్చి ఫిర్యాదు చేయాలి. వారికోసం ఫ్రెండ్లీ పోలీస్‌స్టేషన్లున్నాయి. అక్కడికి రాలేకపోతే 'దిశ' యాప్ ఉంది. డయల్ 100,112, మహిళామిత్ర, వార్డు మహిళా రక్షణ కార్యదర్శి, వాట్సాప్ నం. 9121211100 అందుబాటులో ఉన్నాయి."

### పురుషుల్లో మార్పు రావాలి...

"సమాజం కోసం పురుషుల్లో బాధ్యత పెరగాలి. అతికొద్దిమంది చెడు మనస్తత్వం ఉన్న వారిని మార్చేందుకు ప్రయత్నం చేయాలి. లేక పోలీసులకు వారి తీరుపట్ల సమాచారం ఇవ్వాలి"

**'దిశ' సత్తా!**

- తూర్పు గోదావరి జిల్లాలో భర్త హింసను తట్టుకోలేక ఒక మహిళ విషం తాగి పోలీసులకు సమాచారం ఇచ్చింది. ఆమెను బతికించి భర్తను జైల్లో పెట్టాం.
- బస్సులో వెళుతున్న యువతిని సాటి ప్రయాణికుడు అర్ధరాత్రి ఇబ్బంది పెడితే బస్సును వెంబడించి బాధ్యుడిని దించి అదుపులోకి తీసుకున్నాం.
- కర్ణాటకలో యువతిని రైల్లో వేధించిన వ్యక్తిని అనంతపురం జిల్లాలోకి రాగానే పట్టేశాం.

# మహిళల కష్టం పట్టదా?

## జగనన్నా.. మా బాధలు కనపడటం లేదా?

- ఏ అక్కాచెల్లికి కష్టం రానివ్వనన్నావే!
- చెవిలో పువ్వులతో మైనార్టీ మహిళల నిరసన
- 81వ రోజు రాజధాని రైతుల ఆందోళనలు
- అనంతవరం వెంకన్నకు మహిళల పూజలు
- స్థానిక ఎన్నికల్లో ఓటుతో నిరసన తెలుపుతాం

గుంటూరు, విజయవాడ, తుళ్లూరు, మంగళగిరి, తాడికొండ, మార్చి 7(ఆంధ్రజ్యోతి): 'కులం చూడం.. మతం చూడం.. ప్రతి అక్కకు, చెల్లికి అండగా ఉంటాం.. అన్న వస్తున్నాడని చెప్పమన్నారే.. 81 రోజులుగా రోడ్డు మీద కొచ్చి గోడు వెలబోసుకుంటుంటే పట్టించుకోవా జగనన్నా..' అని అమరావతి మహిళలు వాపోయారు. 'రాజధాని తరలింపు నిర్ణయాన్ని ప్రభుత్వం వెనక్కి తీసుకునే దాకా తమ పోరాటం ఆగదని.. సీఎం సహా మంత్రులందరూ అమరావతి గ్రామాల్లో పర్యటించి రైతుల అభిప్రాయాలను తెలుసుకోవాలని ఆ ప్రాంత రైతులు విజ్ఞప్తి చేశారు. రాజధానిగా అమరావతినే కొనసాగించాలంటూ చేపట్టిన ఆందోళనలను వారు శనివారం 81వ రోజు కొనసాగించారు. తుళ్లూరు, మందడంలో మహాధర్నా, వెలగపూడి, రాయపూడి, కృష్ణాయపాలెం, యర్రబాలెం, గుంటూరు కలెక్టరేట్ ఎదురు, తాడికొండ అడ్డరోడ్డు, పెదపరిమి, తాడేపల్లి తదితర ప్రాంతాల్లో రిలే నిరాహార దీక్షలు, ఆందోళనలు కొనసాగించారు.

### నమ్మి ఓట్లేస్తే చెవులో పువ్వులు పెడతారా?

నమ్మి ఓట్లేస్తే జగన్ తమచెవిలో పూలుపెట్టి ముంచారని రాయపూడి రైతులు, మైనార్టీ మహిళలు ఆవేదన వ్యక్తం చేశారు. ఎన్నికల ముందు మూడు రాజధానులు అని ఎందుకు చెప్పలేదని వైసీపీని ప్రశ్నిస్తూ ప్లకార్డులు ప్రదర్శించారు. స్థానిక ఎన్నికల్లో ఓటు ద్వారా తమ నిరసన తెలుపుతామన్నారు.

### వర్షంలోనూ ఆందోళన..

శనివారం ఉదయం కురిసిన వర్షానికి తుళ్లూరు దీక్షా శిబిరం నీటితో నిండిపోయింది. అయినా రోడ్డుపై కుర్చీలు వేసుకొని రైతులు, మహిళలు నిరసన ప్రదర్శన నిర్వహించారు. ఎండా, వాన తేడా లేకుండా రోడ్డెక్కే పరిస్థితికి ఈ ప్రభుత్వం తెచ్చిందని ఆవేదన వ్యక్తం చేశారు. రోడ్లపై నిలిచిన నీటిని తోడి పారబోశారు. తాతముత్తాతల నుంచి సంక్రమించిన భూములు రాష్ట్ర భవిష్యత్తు కోసం దానమిచ్చిన తమకు ఈ ఖర్మ పట్టిందన్నారు. మధ్యాహ్నానికి నీటిని తోడివేసి ఆరబెట్టి, తిరిగి శిబిరాలలోకి వెళ్లి దీక్షను కొనసాగించారు. తాడేపల్లి మండలం పెనుమాక శిబిరంలో ఓ పక్క మహిళలు పూజా కార్యక్రమాలు నిర్వహించారు. ఉండవల్లి దీక్షా శిబిరం వద్ద చేతులు కట్టుకుని వినూత్నంగా నిరసన వ్యక్తం చేశారు. మంగళగిరి మండలం యర్రబాలెం, నవులూరు, కృష్ణాయపాలెం, నిడమర్రు గ్రామాలలో రిలే నిరాహార దీక్షలు కొనసాగాయి. కృష్ణాయపాలెంలో రైతులు నోటికి నల్ల రిబ్బన్లు కట్టుకొని నిరసన తెలిపారు. అనంతవరంలో కొలువై ఉన్న వెంకన్న ఆలయంలో రాజధాని మహిళలు ప్రత్యేక పూజలు నిర్వహించారు.శాఖమూరు తానపతి చెరువు వద్ద ఉన్న సమ్మక్క,సారలమ్మ ఆలయంలో ఆదివారం ప్రత్యేక పూజలు నిర్వహించనున్నారు. ఆ ఆలయానికి పాదయాత్రగా వెళ్లాలని జేఏసీ నేతలు తలపెట్టారు.



విజయవాడలో ప్రదర్శన చేస్తున్న అమరావతి పరిరక్షణ సమితి జేఏసీ

### ఉద్యమానికి రిటైర్డ్ ఏఎస్పీ మద్దతు..

రాజ్యాంగ ప్రసాదించిన హక్కుల మేరకు ఎవరికైనా శాంతియుతంగా నిరసన తెలిపే హక్కు ఉందని రిటైర్డ్ ఏఎస్పీ కాళహస్తి సత్యనారాయణ చెప్పారు. దానిని ఎవరు హరించాలని చూసినా చట్టరీత్యా నేరమే అన్నారు. అమరావతి రైతుల ఆందోళనకు ఆయన తన మిత్రబృందంతో కలిసి మద్దతు తెలిపారు. రూ.70వేలు ఆర్థిక సాయం అందించారు. అనంతపురం, కదిరి రైతులు, మహిళలు బస్సులో వచ్చి ఉద్యమానికి సంఘీభావం తెలిపారు. విజయవాడ రూరల్ మండలం కొత్తూరు తాడేపల్లి రైతులు కూడా వచ్చి మద్దతు తెలిపారు. తమ భూములను పేదల ఇళ్ల స్థలాల పేరిట తహశీల్దార్ వనజాక్షి నేతృత్వంలో అధికారులు లాకుంటున్నారని, ఎవరికీ చెప్పుకోలేని పరిస్థితుల్లో ఉన్నామని వారు ఆవేదన వ్యక్తం చేశారు. అలానే రాష్ట్ర టీడీపీ బీసీ సెల్ కన్వీనర్ తాడిబోయిన చంద్రశేఖర్ అనంతపురం నుంచి వచ్చి రాజధాని ఉద్యమానికి బాసటగా నిలిచారు.

### విజయవాడలో భారీ ర్యాలీ

అమరావతి పరిరక్షణ సమితి(జేఏసీ) ఆధ్వర్యంలో విజయవాడలో భారీ నిరసన ప్రదర్శన నిర్వహించారు. గుణదల క్రీస్తురాజపురం రోడ్డు నుంచి ప్రారంభమై లయోలా కళాశాల వెనుక భాగాన ఉన్న అమ్మ కల్యాణ మండపం వరకు ఈ ర్యాలీ కొనసాగింది. వేలసంఖ్యలో ఉద్యమకారులు ఈ ర్యాలీలో పాల్గొని 'జై అమరావతి' అంటూ నినదించారు. జేఏసీ కన్వీనర్ ఎ.శివారెడ్డి మాట్లాడుతూ రాజధాని అమరావతి కోసం ఎలాంటి త్యాగాలకైనా సిద్ధమన్నారు. రాష్ట్ర మహిళా కమిషన్ మాజీ చైర్‌పర్సన్ నన్నపనేని రాజకుమారి మాట్లాడుతూ అమరావతిలో రాజధాని కోసం అన్ని ఏర్పాట్లు చేసిన తర్వాత కొత్తగా వచ్చిన ప్రభుత్వం లేని సమస్యలను తీసుకువస్తోందని ఆందోళన వ్యక్తం చేశారు. కృష్ణా జిల్లా పరిషత్ మాజీ చైర్‌పర్సన్ గద్దె అనురాధ మాట్లాడుతూ రాజధానిపై అనాలోచిత నిర్ణయాలను ప్రభుత్వం ఇప్పటికైనా మార్చుకోవాలన్నారు. జేఏసీ నాయకుడు ఆర్‌వీ స్వామి, వైవీ రమణారావు, వాసిరెడ్డి వంశీకృష్ణ, అక్కినేని వనజ, సుంకర పద్మశ్రీ, పరుచూరి కిరణ్, మాజీ ఎమ్మెల్యే బోడె ప్రసాద్ తదితరులు పాల్గొన్నారు.

వెలగపూడిలో జై అమరావతి నినాదాలు చేస్తున్న మహిళలు




# అమరావతికి ఉద్యమ తిలకం

(మొదటి పేజీ తరువాయి)

లేదనిపించింది. దీంతో నిన్నటి వరకు వంటింటికి, కుటుంబ సంరక్షణే పరిమితమైన వారు, నేడు దేనికీ వెరవడం లేదు. లాఠీ దెబ్బలు, పోలీసుస్టేషన్ మెట్లు, కోర్టు బోన్లు ఇలా కలలో కూడా అనుకోని ఘటనలు ఎదురైనా తలొగ్గకుండా పోరు సాగిస్తున్నారు. పోలీసులను సైతం ఆత్మస్థైర్యంతో ఎదుర్కొంటున్నారు.

### ఉద్యమం కొత్త పాఠాలు నేర్పింది..

అమరావతి పరిరక్షణ వేదిక పేరుతో సాగుతున్న ఉద్యమంలో మహిళలు ప్రధాన పాత్ర పోషిస్తున్నారు. రోజూ ఆందోళన కార్యక్రమాలకు పెద్ద సంఖ్యలో హాజరవుతున్నారు. గతంలో ఎన్నడూ నిరసన కార్యక్రమాల్లో పాల్గొనని వారికి ఈ ఉద్యమ అనుభవం కొత్త పాఠాలు నేర్పుతోంది. తుళ్లూరు మహిళలు తమ ప్రాంతంలో హైకోర్టు నిర్మాణం పూర్తి అయ్యి, కార్యకలాపాలు సాగిస్తున్నా, ఎప్పుడూ అటువైపు చూడలేదు. కనీసం ఊళ్లో పోలీసుస్టేషన్ లోపల ఎలా ఉంటుందో వారికి తెలియదు. రెండు నెలల వ్యవధిలో అంతా మారిపోయింది. కేసులు, బెయిలు.. ఇలా ఎన్నో విషయాలు తెలుసుకున్నారు. పోలీసు సెక్షన్లు కూడా తెలుసుకుంటున్నారు.

### తారతమ్యాలు చెరిపేసిన ఉద్యమం..

రాజధాని గ్రామాల మహిళలు రోజూ రోడ్డెక్కుతున్నారు. రాష్ట్ర భవిష్యత్‌కోసం వారు భూములను త్యాగం చేస్తే.. ఇప్పుడు ఆ త్యాగాల పునాదుల మీదే, వారి ఆశలను సమాధి చేస్తుండటంతో ధర్నాలు, దీక్షలతో పోరాడుతున్నారు. ఒకరికిఒకరం అన్నట్టు 29 గ్రామాల మహిళలు ఒక్కటి అయ్యారు. రోజూ ఏం జరుగుతోందో చర్చించుకుంటున్నారు. ఐక్యత పెరిగింది. వయసు, కులం, మతం, ధనిక, పేద అనే తారతమ్యాలు చెరిగిపోయాయి. అందుకే వారి పోరాటం ముందుకు సాగుతోంది.

### ఉదయం 8 గంటలకే వంట ముగించి..

ఒకప్పుడు మధ్యాహ్నం వరకూ తీరిగ్గా వంట పని చేసుకునేవారు. రోజూ వంట చేసుకోవడం, పిల్లలకు తినిపించడం. అవసరమైతే పొలం పనులకు వెళ్లడం. ఖాళీ సమయం ఉంటే కబుర్లు, టీవీలతో కాలక్షేపం జరిగిపోయేది. ఇప్పుడలా కాదు. ఉదయం 8 గంటల కల్లా పని ముగించుకుని దీక్షా శిబిరాలకు వస్తున్నారు రాజధాని మహిళలు. మిగిలిన రోజంతా ధర్నా శిబిరంలోనే ఉంటున్నారు. దాదాపు మూడునెలలు కావొస్తోంది. ఐదేళ్లుగా తమ ప్రాంతంలో రాజధాని అభివృద్ధిని కళ్లారా చూసిన వారు.. ఇప్పుడు ఇదంతా నిలిపివేస్తున్నారంటే తట్టుకోలేకపోతున్నారు. ఈ బాధ ముందు తమ వ్యక్తిగత విషయాలు చాల చిన్నవి అనిపిస్తున్నాయి వారికి.

### సాటి మహిళల కోసం మేమున్నామని..

పూలింగ్‌కు భూములివ్వని కుటుంబాల్లోని మహిళలు సైతం రాజధాని ఉద్యమంలో పాల్గొంటున్నారు. రాష్ట్ర భవిష్యత్తు కోసం త్యాగాలు చేసి నేడు లాఠీ దెబ్బలు, అక్రమ కేసులు ఎదుర్కొంటున్న సాటి మహిళల కోసం మేమున్నామంటూ బయటకు వస్తున్నారు. అందరూ ఒక్కమాటపైకి వచ్చారు. గుంటూరు, విజయవాడ రహదారుల్లో నినాదాలు చేస్తూ ర్యాలీలు చేస్తున్నారు. పోరు ఆపేది లేదంటున్నారు. అన్నిదేవుళ్లకు మొక్కుతున్నారు. ఇలా ఆందోళనల్లో పాల్గొంటున్నవారిలో గృహిణులతోపాటు విద్యార్థినులు, ప్రైవేటు ఉద్యోగాలు చేస్తున్న యువతులు, పిల్లలను వెంట తెస్తున్న మహిళలూ ఉన్నారు.



### వేదికపై డిప్యూటీ సీఎం కన్నీరు!

విజయనగరం, మార్చి 7(ఆంధ్రజ్యోతి): నిండు సభలో రాష్ట్ర ఉప ముఖ్యమంత్రి పాముల పుష్పశ్రీ వాణి కంటతడి పెట్టారు. వైసీపీ నేత విజయసాయిరెడ్డి, మంత్రులు, ఎమ్మెల్యేలు, వందలాది మంది కార్యకర్తల సమక్షంలో ఇది జరిగింది. వైసీపీ జిల్లా స్థాయి సమన్వయ కమిటీ సమావేశం శనివారం విజయనగరంలో ఏర్పాటు చేశారు. పుష్పశ్రీవాణి భర్త, పార్టీ అరకు పార్లమెంటరీ నియోజకవర్గ సమన్వయకర్త అయిన పరీక్షిత్‌రాజును వేదికపైకి తొలుత పిలువలేదు. ఎవరో గుర్తుచేసిన తర్వాత ఆయన్ను ఆహ్వానించారు. ఇదే కారణంతో ఆమె కన్నీరు పెట్టుకున్నారు. కొందరు ప్రముఖులు మాట్లాడుతున్నప్పుడు కూడా ప్రొటోకాల్ పాటించలేదని బాధపడ్డారు. తన మామ, మాజీ ఎమ్మెల్యే శత్రుచర్ల చంద్రశేఖర్‌రాజు ఆరోగ్యం బాగోలేదని విజయసాయి రెడ్డికి చెబుతూ కంటతడి పెట్టారు.

# ఏపీ సహకార బ్యాంకు సీఎండీ కిడ్నాప్

(మొదటిపేజీ తరువాయి)

గులాల్‌వాడీ నాకాలో ఏడో బ్రాంచిని ప్రారంభించారు. ఈ క్రమంలో బ్యాంకు సీఎండీ బండారు సత్యనారాయణ అక్కడే ఉంటూ.. బ్రాంచ్ మేనేజర్ మొహినుద్దీన్‌తో కలిసి మార్కెటింగ్ పనుల్లో బిజీగా ఉన్నారు. బ్రాంచి ప్రారంభ ఆహ్వాన పత్రికలో ఉన్న ఫోన్ నంబరు ఆధారంగా ముంబైకి 50 కిలోమీటర్ల దూరంలో ఉన్న కమోతే నుంచి కొందరు వ్యక్తులు సత్యనారాయణకు ఫోన్ చేశారు. "మేమంతా సీనియర్ సిటిజన్లం. మీ బ్యాంకులో డిపాజిట్లు చేస్తాం. మేము ముంబై దాకా రాలేం. మీరు వస్తే.. వడ్డీరేట్లు నచ్చితే.. డిపాజిట్లకు మేం రెడీ" అని చెప్పారు. కమోతేలోని ఎస్వీకే గ్రూప్ అండ్ ఎంటర్‌ప్రైజెస్ కార్యాలయానికి రావాలని సూచించారు. దీంతో.. సత్యనారాయణ, మొహినుద్దీన్ కలిసి శుక్రవారం ఉదయం అక్కడికి చేరుకున్నారు. ఆ కార్యాలయానికి వెళ్లి విచారించగా.. దాదాపు అలాంటివారెవరూ లేరనే సమాధానం వచ్చింది. ఈలోగా.. సత్యనారాయణకు మళ్లీ ఫోన్ వచ్చింది. "మేం కార్యాలయం బయట కారులో ఉన్నాం. మీరొక్కరే రండి" అని పేర్కొన్నారు. సత్యనారాయణ అక్కడకు వెళ్లగానే.. కారులో ఓ వ్యక్తి ఉన్నాడు. కూర్చుని మాట్లాడుకుందాం అంటూ డోర్ ఓపెన్ చేశాడు. సత్యనారాయణ అందులో కూర్చోగానే.. కారును వేరే ప్రాంతానికి తీసుకెళ్లాడు. డిపాజిట్ల గురించి మాట్లాడుతూనే.. దారిలో మరో ముగ్గురిని ఎక్కించుకున్నాడు. తర్వాత కారులో ఉన్నవారు ఆయనపై దాడిచేశారు. అతడి ఫోన్ లాక్కొని స్విచాఫ్ చేశారు. కారును పుణెకు తీసుకువెళ్లారు. అక్కడ సత్యనారాయణను రాత్రంతా చిత్రహింసలకు గురిచేశారు. చేతిగోళ్లను కత్తిరించి.. పిడిగుద్దుల వర్షం కురిపించారు. బెల్టులాంటి వస్తువుతో చర్మం కమిలిపోయేలా కొట్టారు. శనివారం ఉదయం 10.30గంటల సమయంలో అతడి ఫోన్‌ను ఆన్ చేశారు. రూ.కోటి ఇస్తేనే వదిలిపెడతామని.. వెంటనే ఆ మొత్తం సర్దేలా తెలిసినవారికి ఫోన్ చేయాలని డిమాండ్ చేశారు. ఆయన ఒప్పుకోకపోవడంతో మరోమారు దాడి చేశారు. దీంతో సత్యనారాయణ "నా దగ్గర అంత డబ్బులేదు. కావాలంటే మొబైల్‌లో నా బ్యాంకు బ్యాలెన్స్ చూడండి.." అని వివరించబోయారు. మరోసారి ఆయనపై ముష్టిఘాతాలు కురిపించిన కిడ్నాపర్లు.. "నీ ఫ్యామిలీ విజయవాడలో ఫలానా చోట ఉంది. నీ ఆస్తుల వివరాలన్నీ మాకు తెలుసు. నీకు ఒక్కడే కొడుకు. వాడిని చంపేస్తాం" అని హెచ్చరించారు. దీంతో సత్యనారాయణ ముంబై బ్రాంచ్ మేనేజర్ మొహినుద్దీన్‌కు ఫోన్ చేశారు. తెలుగులో మాట్లాడుతుంటే.. హిందీలోనే ఫోన్ మాట్లాడాలని డిమాండ్ చేశారు. రూ.35లక్షల వరకు సమకూర్చగలనని, అదికూడా నగదు బదిలీతోనే సాధ్యమని సత్యనారాయణ చెప్పారు. దానికి అంగీకరించిన కిడ్నాపర్లు.. వినాయక్ ట్రేడర్స్ పేరుతో ఉన్న బ్యాంక్ ఆఫ్ బరోడా ఖాతా వివరాలను అందజేశారు. ఆర్టీజీఎస్‌లో నగదు బదిలీ చేయాలని డిమాండ్ చేశారు. దీంతో మొహియుద్దీన్ రూ.20లక్షలు, రూ.15లక్షల చొప్పున నగదు పంపారు. కిడ్నాపర్లు సత్యనారాయణతో ఖాళీ ఎగ్జిక్యూటివ్ బాండ్‌పేపర్ల మీద సంతకాలు పెట్టించుకున్నారు. అతడి ఆధార్ కార్డు, డ్రైవింగ్ లైసెన్సును తీసుకున్నారు. బదిలీ చేసిన నగదును సాయంత్రం వరకు వేర్వేరు మార్గాల్లో విత్‌డ్రా చేసుకున్నాక.. చిరిగిన బట్టలు, రక్తపు గాయాలతో ఉన్న సత్యనారాయణ జేబులో రూ. వెయ్యి పెట్టి, ముంబై వెళ్లే బస్సెక్కించారు. బాధితుడు బస్సులో ప్రయాణికుల ఫోన్ తీసుకుని, తమవాళ్లకు విషయం చెప్పారు. "దీనిపై ఇప్పటికే కమోతే పోలీసులకు సమాచారం అందించాం. వాళ్లు బ్యాంకు ఖాతా నంబరు ఆధారంగా దర్యాప్తు ప్రారంభించారు. విజయవాడలో ఉన్న సీఎండీ కుటుంబానికి భద్రత కల్పించాల్సిందిగా ఏపీ పోలీసులను కోరతాం" అని బ్యాంకు సిబ్బంది 'ఆంధ్రజ్యోతి'కి తెలిపారు.



# అమిత్‌షాజీ స్పందించండి

- జగన్‌కు తగు సూచనలు చేయండి
- ప్రతిపక్ష నేతలకు భద్రత కరువు
- కేంద్ర హోం మంత్రికి బుద్దా బహిరంగ లేఖ

విజయవాడ, మార్చి 7(ఆంధ్రజ్యోతి): వైసీపీ ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తరువాత ప్రతిపక్ష నేతలకు భద్రత కరువైన తీరును వివరిస్తూ ఎమ్మెల్సీ బుద్దా వెంకన్న కేంద్ర హోం మంత్రి అమిత్‌షాకు ఓ బహిరంగ లేఖ రాశారు. శనివారం ఆ లేఖను మీడియాకు విడుదల చేశారు. టీడీపీ జాతీయ అధ్యక్షుడు చంద్రబాబుకు, జాతీయ ప్రధాన కార్యదర్శి లోకేశ్‌కు భద్రతా సిబ్బందిని భారీగా కుదించడంపై ఆయన తన లేఖలో ఆందోళన వ్యక్తం చేశారు. అమిత్ షా వెంటనే కలుగచేసుకొని రాష్ట్ర ప్రభుత్వానికి తగు సూచనలు చేయాలని విజ్ఞప్తి చేశారు. లేఖలోని ప్రధాన అంశాలు... "ఆంధ్రప్రదేశ్‌లో వైకాపా ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత ప్రతిపక్ష నేతలకు భద్రతా సిబ్బందిని తగ్గించారు. ప్రధాన ప్రతిపక్ష నేత, మాజీ సీఎం చంద్రబాబు, ఆయన కుమారుడు, ఎమ్మెల్సీ నారా లోకేశ్ భద్రత కోసం గతంలో నియమించిన సిబ్బందిని కుదించారు. వారు రాష్ట్రంలో పర్యటిస్తున్నప్పుడు వైసీపీ నేతలు, కార్యకర్తలు వారిని అడ్డుకుంటూ శాంతిభద్రతలకు భంగం కలిగిస్తున్నారు. ప్రతిపక్షనేతల పర్యటనలకు రక్షణగా ఉండాల్సిన పోలీసులు.. అధికార పక్షమైన వైసీపీ నాయకులు, కార్యకర్తలు అడ్డుకుంటున్నప్పుడు కనీసం నిరోధించే ప్రయత్నం కూడా చేయడం లేదు. ఇది అనుమానాలకు తావిస్తోంది" అని పేర్కొన్నారు. ముందస్తు అనుమతితో చంద్రబాబు చేపట్టిన ఉత్తరాంధ్ర ప్రజాచైతన్య యాత్రను అడ్డుకొనేందుకు విశాఖ విమానాశ్రయంలో వైసీపీ శ్రేణులు సృష్టించిన అలజడని ఎమ్మెల్సీ తన లేఖలో కళ్లకు కట్టినట్లు వివరించారు. దాదాపు 5 గంటల పాటు చంద్రబాబు కాన్వాయ్‌లోనే కూర్చోవడం, అదే సమయంలో వైసీపీ వర్గాలు కోడిగుడ్లు, టమాటాలతో చంద్రబాబు కాన్వాయ్‌పై దాడి చేయడం... తదితర అంశాలను ఆయన లేఖలో పేర్కొన్నారు. పల్నాడు పర్యటన సందర్భంగా చంద్రబాబు ఇంటికి స్వయంగా పోలీసులే తాళం వేసి గృహ నిర్బంధంలో పెట్టినతీరునూ పేర్కొన్నారు. ఎమ్మెల్సీ లోకేశ్‌కు ఏపీ ప్రభుత్వం ఈ తొమ్మిది నెలల్లోనే రెండు సార్లు భద్రతను తగ్గించిందన్నారు. తూర్పుగోదావరి జిల్లాలోని సీతానగరం మండలం, మునికూడలిలో లోకేశ్ ప్రజాచైతన్య యాత్రపై వైసీపీ కార్యకర్తలు చెప్పులు, కుర్చీలు విసురుతూ, నినాదాలు చేస్తూ ఉద్రిక్త వాతావరణాన్ని నెలకొల్పిన తీరును పరిగణలోకి తీసుకోవాలని అమిత్ షాకు బుద్దా విజ్ఞప్తి చేశారు.



## ముహూర్తం చూడాలి మరి..!

అమలాపురం రూరల్, మార్చి 7: ఎన్నికల్లో గెలుపు, ఓటమిలను నిర్ణయించేది ఓటర్లే. అయితే ముహూర్త బలం ఓటర్ల మనసు మార్చి గెలుపును సుగమం చేస్తుందనేది అభ్యర్థుల నమ్మకం. అందుకే నామినేషన్లు వేసే సమయం, చివరకు ఇంటి నుంచి బయలుదేరే సమయాలకూ ముహూర్తాలు పెట్టించుకునే సెంటిమెంట్ ఉంది. సాధారణంగా అభ్యర్థుల పేర్లు, జన్మ నక్షత్రాలను బట్టి సిద్ధాంతులు, పంచాంగకర్తలు ముహూర్తాలు నిర్ణయిస్తారు. అయితే, ఎంపీటీసీ, జడ్పీటీసీ ఎన్నికల నామినేషన్లకు మూడు రోజులే గడువు ఇచ్చారు. ఇప్పటికింకా ప్రధాన పార్టీల తరపున అభ్యర్థులు ఖరారు కాలేదు. అయినా, కలిసివచ్చిన రిజర్వేషన్లను సద్వినియోగం చేసుకుని ఎన్నికల్లో పోటీ చేసేందుకు సిద్ధపడుతున్న నాయకులు ముందుగానే ముహూర్తాల కోసం క్యూ కడుతున్నారు.

# భేరీ మోగింది

(మొదటి పేజీ తరువాయి)

ఈ నెల 27వ తేదీ వరకు నిర్వహిస్తారు. పంచాయతీలకు ఈ నెల 15వ తేదీన నోటిఫికేషన్ ఇస్తారు. అక్కడి నుంచి ఈ 29వ తేదీ దాకా ప్రక్రియ కొనసాగుతుంది. అదేరోజు కౌంటింగ్, ఫలితాల వెల్లడి ఉంటాయి. స్థానిక సంస్థల ఎన్నికల పర్వం కూడా ఆరోజుతో ముగుస్తుంది. మరునాడు, అంటే మార్చి 30వ తేదీన గెలుపొందిన అభ్యర్థులు చైర్పర్సన్లను పరోక్ష ఎన్నికల విధానంలో ఎన్నుకుంటారు. జడ్పీ కోఆప్టెడ్ సభ్యులను, చైర్పర్సన్, వైస్ చైర్పర్సన్లను జడ్పీటీసీలు, మండల పరిషత్ కోఆప్టెడ్ సభ్యులు, మండలాధ్యక్షుడు, మండల ఉపాధ్యక్షులను ఎంపీటీసీలు ఎన్నుకుంటారు. ఇక మున్సిపల్ కార్పొరేషన్ల మేయర్, డిప్యూటీ మేయర్లను, నగర పంచాయతీల చైర్పర్సన్, వైస్ చైర్పర్సన్లను కార్పొరేటర్లు ఈ నెల 31న ఎన్నుకుంటారు. అదే రోజు వారు పదవులను చేపడతామని రాష్ట్ర ఎన్నికల కమిషన్ వెల్లడించింది.


స్థానిక ఎన్నికల షెడ్యూల్ను ప్రకటిస్తున్న రమేశ్ కుమార్

### ఓటర్లు 2.82 కోట్లు.. కేంద్రాలు 33,663

పరిషత్ ఎన్నికల్లో 2,82,15,104 మంది ఓటర్లు ఓటు వినియోగించుకోనున్నారు. వీరి కోసం 33,663 పోలింగ్ కేంద్రాలను సిద్ధం చేస్తున్నారు. ఇందులో 10487 కేంద్రాలను సమస్యాత్మకం, 11251 కేంద్రాలను అత్యంత సమస్యాత్మకమైనవిగా గుర్తించారు. 2,01,978 మంది సిబ్బందిని ఈ ఎన్నికల విధుల్లో పాల్గొంటారు. 15 మంది ఐఏఎస్ అధికారులను ఎన్నికల పరిశీలకులుగా, ఎన్నికల వ్యయాన్ని పరిశీలించేందుకు 15 మంది ఐఎఫ్ఎస్ అధికారులను నియమించారు. కాగా, రాష్ట్ర వ్యాప్తంగా 9984 ఎంపీటీసీలు, 660 జడ్పీటీసీలకు ఎన్నికలు నిర్వహిస్తారు. ఎంపీటీసీల్లో 4928 స్థానాలు జనరల్ కేటగిరికి కేటాయించారు. ఇక మహిళలకు 5119, ఎస్టీలకు 632, ఎస్సీలకు 1900, బీసీలకు 2433 కేటాయించారు. జడ్పీటీసీల్లో 322 స్థానాలు జనరల్కు కేటాయించారు. ఇక మహిళలకు 333, ఎస్టీలకు 57, ఎస్సీలకు 127, బీసీలకు 154 కేటాయించారు. ఇదే సంఖ్యలో ఎంపీపీలు రిజర్వు చేయబడ్డాయి.

### ఎటపాక ఆపారు..

తూర్పుగోదావరి జిల్లాలోని ఎటపాక మండల పరిషత్కు పాలనా గడువు తీరకపోవడంతో ఆ స్థానాన్ని ఎన్నికలకు నోటిఫై చేయలేదు. 2021 జూన్ 28 వరకు అక్కడ పాలనకు గడువు ఉంది. కాగా, జడ్పీటీసీ ఎన్నికల్లో పోటీ చేసే అభ్యర్థులకు ఈ సారి రూ.6 వేలు, ఎంపీటీసీలకు రూ.3 వేలు డిపాజిట్ నిర్ణయించారు. ఎస్సీ, ఎస్టీ, బీసీలు 50% డిపాజిట్ చేస్తే సరిపోతుంది. ఎన్నికల వ్యయం జడ్పీటీసీలకు 4 లక్షలు, ఎంపీటీసీలకు 2 లక్షలుగా నిర్ధారించారు.

| వరుస సంఖ్య | జిల్లా పేరు | ఎన్నికలు నిర్వహించే జడ్పీటీసీల సంఖ్య | ఎన్నికలు నిర్వహించే ఎంపీటీసీలు | విత్హెల్డ్లో పెట్టిన ఎంపీటీసీలు |
|---|---|---|---|---|
| 1 | అనంతపురం | 63 | 841 | - |
| 2 | చిత్తూరు | 65 | 886 | 5 |
| 3 | తూర్పుగోదావరి | 62 | 1143 | 41 |
| 4 | గుంటూరు | 57 | 862 | - |
| 5 | కృష్ణా | 49 | 812 | - |
| 6 | కర్నూలు | 53 | 807 | - |
| 7 | ప్రకాశం | 56 | 772 | 12 |
| 8 | నెల్లూరు | 46 | 562 | - |
| 9 | శ్రీకాకుళం | 38 | 668 | 10 |
| 10 | విశాఖపట్నం | 39 | 652 | - |
| 11 | విజయనగరం | 34 | 549 | - |
| 12 | పశ్చిమగోదావరి | 48 | 876 | - |
| 13 | కడప | 50 | 554 | - |
| | మొత్తం | 660 | 9984 | 68 |

### పరిషత్ ఓటు..

మార్చి 9 : ఎన్నికల నోటీసు
మార్చి 9-11 : నామినేషన్ల స్వీకరణ
మార్చి 12 : నామినేషన్ల పరిశీలన
మార్చి 13 : తిరస్కరణ అయిన నామినేషన్లపై అప్పీల్
మార్చి 14 : అప్పీల పరిష్కారం, అభ్యర్థిత్వాల ఉపసంహరణ, పోటీలో ఉన్న అభ్యర్థుల తుది జాబితా విడుదల
మార్చి 21 : పోలింగ్ (7గంటల నుంచి 5వరకు)
మార్చి 24 : కౌంటింగ్ (8గంటల నుంచి), ఫలితాలు

### మునిసిపల్ పోల్

మార్చి 9 : నోటిఫికేషన్
మార్చి 11 : ఎన్నికల నోటీసు
మార్చి 11-13 : నామినేషన్ల స్వీకరణ
మార్చి 14 : నామినేషన్ల పరిశీలన
మార్చి 16 : అభ్యర్థిత్వాల ఉపసంహరణ, అభ్యర్థుల తుదిజాబితా విడుదల
మార్చి 23 : (ఉదయం 7-సాయంత్రం 5) పోలింగ్
మార్చి 27 : (ఉదయం 8 గంటల నుంచి) కౌంటింగ్, ఫలితాలు

### పంచాయతీ పోరు..

| | తొలి దశ | రెండో దశ |
|---|---|---|
| నోటిఫికేషన్ | మార్చి 15 | మార్చి 17 |
| ఎన్నికల నోటీసు | మార్చి 17 | మార్చి 19 |
| నామినేషన్ల స్వీకరణ | మార్చి 17-19 | మార్చి 19-21 |
| నామినేషన్ల పరిశీలన | మార్చి 20 | మార్చి 22 |
| అప్పీలుకు అవకాశం | మార్చి 21 | మార్చి 23 |
| నామినేషన్ల ఉపసంహరణ, తుది జాబితా విడుదల | మార్చి 22 | మార్చి 24 |
| పోలింగ్, కౌంటింగ్, ఫలితాలు | మార్చి 27 | మార్చి 29 |

## కోడ్ వచ్చినా బది'లీలలు'!

- ముందు తేదీలతో చేస్తున్నారని ఆరోపణలు
- పూర్తికాని పంచాయతీ కార్యదర్శుల బదిలీలు
- ఎమ్మెల్యేలు లేఖ ఇస్తేనే మోక్షం!

అమరావతి, మార్చి 7(ఆంధ్రజ్యోతి): రాష్ట్రంలో ఎన్నికల కోడ్ అమల్లోకి వచ్చినా పంచాయతీ కార్యదర్శుల బదిలీలు ఆగడం లేదన్న విమర్శలు వెల్లువెత్తుతున్నాయి. నాలుగు నెలల కిందట సాధారణ బదిలీలు నిర్వహించినప్పటికీ, రాజకీయ ఒత్తిళ్లతో పంచాయతీ కార్యదర్శుల బదిలీలపై నిషేధాన్ని ఎత్తివేస్తూ ఇటీవల పంచాయతీరాజ్శాఖ ఉత్తర్వులు జారీచేసింది. జిల్లాల్లో డీపీఓలు, కలెక్టర్లు ఈ బదిలీలు నిర్వహిస్తున్నారు. మూడేళ్ల సర్వీసు పూర్తి చేసిన పంచాయతీ కార్యదర్శులకు బదిలీలు చేయాలని మార్గదర్శకాల్లో పేర్కొన్నారు. అయితే.. జిల్లాల్లో ఈ బదిలీలు అస్తవ్యస్తంగా తయారయ్యాన్న విమర్శలొస్తున్నాయి. ఎన్నికల కోడ్ అమల్లోకి వచ్చినా లెక్కచేయకుండా ముందు తేదీలను వేసి బదిలీలు చేస్తున్నారని ఆరోపణలొస్తున్నాయి. గ్రామ పంచాయతీ ఎన్నికలు నిర్వహిస్తుండటంతో గ్రామాల్లో తమ చెప్పుచేతుల్లో ఉన్న కార్యదర్శులను నియమించుకోవాలన్న యోచనతో మంత్రులు, ఎమ్మెల్యేలు ఈ ఉత్తర్వులు తీసుకొచ్చారంటున్నారు. మూడేళ్ల సర్వీసు పూర్తి చేసుకున్న కార్యదర్శులు ఎక్కడైనా ఖాళీ చూపించి.. బదిలీ కోరుతూ ఎమ్మెల్యేల నుంచి లెటర్ తెస్తేనే అక్కడకు బదిలీ చేస్తామని చెప్తున్నారు. దీంతో ఆ కార్యదర్శుల బాధలు వర్ణనాతీతంగా ఉన్నాయి. తమకు అనుకూలమన్న కార్యదర్శులను గ్రామాల్లో నియమించుకుని ఎన్నికల్లో ప్రభావితం చేస్తున్నారన్న విమర్శలు వినిపిస్తున్నాయి.

### ఇళ్లపట్టాల పంపిణీకి ఈసీ అనుమతి కోరతాం

- మంత్రి పెద్దిరెడ్డి రామచంద్రారెడ్డి

తిరుపతి, మార్చి 7: ఉగాదికి ఇళ్లపట్టాల పంపిణీ కార్యక్రమంపై ఈసీ అనుమతి కోరతామని మంత్రి పెద్దిరెడ్డి రామచంద్రారెడ్డి అన్నారు. తిరుపతిలో శనివారం జరిగిన వైసీపీ సమావేశం అనంతరం ఆయన మీడియాతో మాట్లాడారు. ఎన్నికల్లో వైసీపీదే పైచేయి అన్న ఆయన మూడు రాజధానుల నిర్ణయమే 90 శాతం సీట్లు తెచ్చిపెడుతుందని చెప్పారు. ప్రజల వద్ద ఉన్న సెల్ఫోన్లే ఎన్నికల్లో మద్యం, డబ్బు పట్టిస్తాయన్నారు. చంద్రబాబు విమర్శలకు 20 రోజుల్లో మరోసారి బుద్ధి చెప్పడానికి ప్రజలు సిద్ధమవుతున్నారని మంత్రి మేకపాటి గౌతంరెడ్డి వ్యాఖ్యానించారు. ఉగాది నాటికి 25 లక్షల ఇళ్లపట్టాలు ఇవ్వాలనేది ప్రభుత్వ లక్ష్యమని, ఎన్నికల కోడ్ నేపథ్యంలో ఏం చేయాలన్నదానిపై ప్రభుత్వం నిర్ణయం తీసుకుంటుందని తెలిపారు. నవరత్నాలే వైసీపీని గెలిపిస్తాయని, ఎన్నికల్లో మద్యం, డబ్బు పంచితే తమ పార్టీ వారికైనా జైలు తప్పదని డిప్యూటీ సీఎం నారాయణస్వామి అన్నారు.

## స్థానిక సమరంపై 'నిఘా'

### ప్రత్యేక యాప్ ఆవిష్కరించిన సీఎం జగన్

అమరావతి, మార్చి 7(ఆంధ్రజ్యోతి): స్థానిక సంస్థల ఎన్నికల్లో డబ్బు, మద్యం పంపిణీతోపాటు ఇతర ప్రలోభాలకు అడ్డుకట్ట వేసేందుకు ప్రభుత్వం ప్రత్యేకంగా 'నిఘా' యాప్ రూపొందించింది. ఎన్నికల సంఘం, పోలీస్ వ్యవస్థ తీసుకుంటున్న చర్యలకు అదనంగా ఈ యాప్ను అందుబాటులోకి తీసుకొచ్చింది. ముఖ్యమంత్రి వైఎస్ జగన్మోహన్రెడ్డి శనివారం తాడేపల్లిలోని తన నివాసంలో దీనిని ఆవిష్కరించారు. సామాన్యులు ఎవరైనా ఈ యాప్ను డౌన్లోడ్ చేసుకోవచ్చు. దీనిద్వారా స్థానిక సంస్థల ఎన్నికల్లో మద్యం, డబ్బు పంపిణీకి పాల్పడుతున్న వారి వివరాలతోపాటు చట్ట వ్యతిరేకంగా తమ దృష్టికి వచ్చిన ఏ అంశంపైనైనా ఫిర్యాదు చేసే వెసులుబాటు ఉంది. యాప్ ద్వారా చేసే ఫిర్యాదులు నేరుగా సెంట్రల్ కంట్రోల్ రూముకు, అక్కడ నుంచి సంబంధిత అధికారులకు చేరతాయి. ఆ అధికారులు వాటిపై చర్యలు తీసుకుంటారు.


యాప్ ఆవిష్కరిస్తున్న సీఎం జగన్

## ఆర్డినెన్స్లోని షెడ్యూల్ ప్రకారమే..

- స్థానిక ఎన్నికల నిర్వహణపై కమిషనర్
- సచివాలయ రంగులు కోర్టు పరిధిలోని అంశం
- ఇళ్ల స్థలాల పంపిణీకి ఓకే : రమేశ్కుమార్

అమరావతి, మార్చి 7(ఆంధ్రజ్యోతి): రాష్ట్ర ప్రభుత్వం ఇటీవల తెచ్చిన ఆర్డినెన్స్ ప్రకారమే ఎన్నికల షెడ్యూల్ రూపొందించామని రాష్ట్ర ఎన్నికల కమిషనర్ రమేశ్కుమార్ తెలిపారు. రాష్ట్రంలో స్థానిక ఎన్నికలకు సంబంధించిన కోడ్ తక్షణమే అమల్లోకి వచ్చిందన్నారు. శనివారం నోటిఫికేషన్ విడుదల చేసిన సందర్భంగా ఆయన మీడియాతో మాట్లాడారు. అధికారంలో ఉన్న పార్టీకి అనుకూలంగా ఓటర్లను ప్రభావితం చేసే అవకాశం ఉన్న కొత్త ప్రాజెక్టులు, కార్యక్రమాలు, రాయితీలపై నిషేధం అమల్లోకి వస్తుందన్నారు. బదిలీలు వెంటనే నిషేధించాలని, కొత్తగా నియామకాలు చేపట్టరాదని రమేశ్కుమార్ చెప్పారు. రాష్ట్రంలో కొత్తగా పంచాయతీలు విలీనమైన మున్సిపాలిటీలకు ఈ దఫా ఎన్నికలు నిర్వహించడం లేదని ఆయన వివరించారు. ఎన్నికల కోడ్ అమల్లోకి వచ్చినందున సచివాలయ భవనాలకు వైసీపీ రంగులను తొలగించేందుకు ఆదేశాలిస్తారా? అని మీడియా ప్రశ్నించగా... ఈ విషయంపై కోర్టులో పిటిషన్ పెండింగ్లో ఉందని, వాటిపై ఇప్పుడు ఎలాంటి నిర్ణయమూ తీసుకోలేమని చెప్పారు. కొత్తగా ఎక్కడైనా ప్రభుత్వ భవనాలకు రంగులు వేస్తే అలాంటి అంశాలను కమిషన్ కోడ్ కింద పరిగణిస్తుందన్నారు. ఇళ్ల స్థలాల పంపిణీ పథకంలో ఇప్పటికే ప్రక్రియ ప్రారంభమైనందున కోడ్ వర్తించదన్నారు.

## సగం మేయర్లు.. మహిళలకే

- 16 మేయర్ పదవులకు రిజర్వేషన్ల ఖరారు.. వార్డుల విభజన 12 కార్పొరేషన్లలోనే
- మేయర్లలో ఎస్టీ-1, ఎస్సీ-2, బీసీ-5, మహిళ జనరల్-5, అన్ రిజర్వుడు-3

అమరావతి, మార్చి 7(ఆంధ్రజ్యోతి): రాష్ట్రంలోని మున్సిపల్ కార్పొరేషన్లలో రిజర్వేషన్లను ఖరారు చేస్తూ రాష్ట్ర ప్రభుత్వం ఉత్తర్వులు జారీ చేసింది. 16 కార్పొరేషన్లలో మేయర్ పదవులకు, 12 కార్పొరేషన్లలో వార్డుల వారీగా రిజర్వేషన్లను ఖరారుచేస్తూ మున్సిపల్ శాఖ కమిషనర్ విజయ్కుమార్ శనివారం ఉత్తర్వులు జారీ చేశారు. ఆయా కార్పొరేషన్లలోని సంఖ్య ఆధారంగా వార్డులను రిజర్వు చేశారు. అయితే ఒక్క కార్పొరేషన్లోనూ ఎస్టీ మహిళలకు ఒక్క వార్డును కూడా కేటాయించలేదు. అన్ని కార్పొరేషన్లలో ఎస్టీ కేటగిరీలో జనరల్కు మాత్రమే ఒక్కో వార్డు కేటాయించారు. వార్డులతోపాటు మేయర్ పదవులకూ రిజర్వేషన్లు ఖరారు చేస్తూ మున్సిపల్ శాఖ మరో ఉత్తర్వు జారీ చేసింది. మొత్తం 16 కార్పొరేషన్ మేయర్లలో ఎస్టీ జనరల్కు ఒకటి, ఎస్సీ జనరల్ ఒకటి, ఎస్సీ మహిళకు ఒకటి, బీసీ జనరల్కు మూడు, బీసీ మహిళకు రెండు, జనరల్ మహిళకు ఐదు, అన్ రిజర్వ్డ్ కేటగిరీ కింద మూడు స్థానాలను ఖరారు చేశారు.

| కార్పొరేషన్ | వార్డులు | ఎస్టీ | | | ఎస్సీ | | | బీసీ | | | మహిళ | అన్ |
|---|---|---|---|---|---|---|---|---|---|---|---|---|
| | | జనరల్ | మహిళ | మొత్తం | జనరల్ | మహిళ | మొత్తం | జనరల్ | మహిళ | మొత్తం | జనరల్ | రిజర్వ్డ్ |
| అనంతపురం | 50 | 1 | 0 | 1 | 2 | 1 | 3 | 9 | 8 | 17 | 16 | 13 |
| చిత్తూరు | 50 | 1 | 0 | 1 | 4 | 4 | 8 | 8 | 8 | 16 | 13 | 12 |
| ఏలూరు | 50 | 1 | 0 | 1 | 3 | 3 | 6 | 9 | 8 | 17 | 14 | 12 |
| గుంటూరు | 57 | 1 | 0 | 1 | 4 | 3 | 7 | 10 | 9 | 19 | 16 | 14 |
| కడప | 50 | 1 | 0 | 1 | 3 | 3 | 6 | 9 | 8 | 17 | 14 | 12 |
| కర్నూలు | 52 | 1 | 0 | 1 | 5 | 4 | 9 | 8 | 8 | 16 | 14 | 12 |
| మచిలీపట్నం | 50 | 1 | 0 | 1 | 2 | 2 | 4 | 9 | 8 | 17 | 15 | 13 |
| ఒంగోలు | 50 | 1 | 0 | 1 | 5 | 4 | 9 | 8 | 7 | 15 | 14 | 11 |
| తిరుపతి | 50 | 1 | 0 | 1 | 3 | 2 | 5 | 9 | 8 | 17 | 15 | 12 |
| విజయవాడ | 64 | 1 | 0 | 1 | 3 | 3 | 6 | 11 | 10 | 21 | 19 | 17 |
| విశాఖపట్నం | 98 | 1 | 0 | 1 | 4 | 4 | 8 | 17 | 16 | 33 | 29 | 17 |
| విజయనగరం | 50 | 1 | 0 | 1 | 3 | 3 | 6 | 9 | 8 | 17 | 14 | 12 |

## దీని భావమేమి తిరుమలేశా?

(మూడో పేజీ తరువాయి)

ఆరుగురికి షేర్లు కేటాయించారు. 100 కోట్ల మూలధనంతో ఏర్పాటు చేస్తున్నామంటూ... 20 లక్షల షేర్లు జారీ చేశారు. దీనికి అనుమతి కోసం ఆర్బీఐకి త్వరలోనే దరఖాస్తు చేయనున్నారు. దీనిపై రాష్ట్ర ఆర్థిక శాఖ శుక్రవారం జీవో నెంబర్ 18 జారీ చేసింది. ఈ ఒక్క సంస్థ ఏర్పాటు వెనుక అనేక లక్ష్యాలు ఉన్నట్లు స్పష్టమవుతోంది.

### ఏమిటి... ఎలా?

ఆర్థిక సంక్షోభంలో కూరుకుపోయిన సర్కారు రోజువారీ అవసరాలు, ఉద్యోగుల వేతనాల కోసం నానా కష్టాలు పడుతోంది. ఓవర్ డ్రాఫ్ట్లకు వెళుతోంది. ప్రతినెలా మొదటివారం అప్పుల కోసం బ్యాంకుల చుట్టూ తిరుగుతోంది. దీంతో బ్యాంకులను దారికి తెచ్చుకునేందుకు సొంతంగా ఓ ప్రభుత్వ రంగ బ్యాంకును ఏర్పాటు చేయాలని గతంలో నిర్ణయించారు. కానీ, అదంత ఈజీ కాదని తేలడంతో ఏపీఎస్ఎఫ్ఎస్ కార్పొరేషన్ లిమిటెడ్ పేరిట ఒక 'మనీ ప్లాన్' మొదలుపెట్టారు. ఆయా సంస్థల వద్ద ఉన్న నగదును మరింత సమర్థంగా, లాభదాయకంగా మార్చేందుకు ఏపీఎస్ఎఫ్ఎస్ ఒక 'ప్రొఫెషనల్ ఫండ్ మేనేజ్మెంట్' వ్యవస్థలా సేవలు అందిస్తుందని తెలిపారు. దీనికి రాష్ట్ర ప్రభుత్వ పరిధిలో ఉన్నప్పటికీ స్వయం ప్రతిపత్తి ఉన్న బోర్డులు, ట్రస్టులు, విశ్వవిద్యాలయాలు, ఇతర సంస్థల నుంచి నిధులు తీసుకుంటారు. ఏపీఎస్ఎఫ్ఎస్ జారీ చేసే ఇంటర్ కార్పొరేట్ డిపాజిట్లు, డిబెంచర్లు, నగదు డిపాజిట్లు లేదా ఇతర స్వల్పకాలిక, దీర్ఘకాలిక ఇన్వెస్ట్మెంట్ పద్ధతుల ద్వారా సేకరిస్తారు. అలా సేకరించిన నిధులను మంచి వడ్డీ ఇచ్చే బ్యాంకులు, కేంద్ర ప్రభుత్వ సెక్యూరిటీలు, ట్రెజరీ బిల్లులు, రాష్ట్ర ప్రభుత్వ అభివృద్ధి రుణాలు, ఏఏఏ రేటింగ్ ఉన్న బాండ్లు, కేంద్ర-రాష్ట్ర ప్రభుత్వ రంగ సంస్థలకు చెందిన ఆర్థిక సంస్థల్లో పెట్టుబడులుగా పెడతారట!

### వెంకన్న నిధులపైనే కన్ను?

ఏపీఎస్ఎఫ్ఎస్ కార్పొరేషన్ లిమిటెడ్ ప్రధాన లక్ష్యాల్లో మొదటిది... అన్ని కార్పొరేషన్లు, ట్రస్టులు, ఎండోమెంట్లు, యూనివర్సిటీలు, అథారిటీలు, బోర్డులు, రాష్ట్ర ప్రభుత్వ పరిధిలోని ఇతర సంస్థల నుంచి నిధులు సేకరించడం! పేరుకు ఇంత పెద్ద జాబితా ఉన్నప్పటికీ... భారీగా మిగులు నిధులు ఉన్న ప్రభుత్వ సంస్థలు తక్కువ. తమ సొంత అవసరాలు తీర్చుకునేందుకే అప్పులు చేస్తున్నాయి. తిప్పలు పడుతున్నాయి. ఇక మిగిలింది... తిరుమల తిరుపతి దేవస్థానమే! కానీ... నేరుగా టీటీడీ నిధులు సేకరించాలనే ప్రతిపాదన చేస్తే వివాదాస్పదమవుతుందనే ఉద్దేశంతోనే కార్పొరేషన్లు, బోర్డులు, యూనివర్సిటీలు అంటూ ఇతర సంస్థలనూ జాబితాలో చేర్చినట్లు భావిస్తున్నారు. తిరుమల తిరుపతిలోని వెంకన్న హుండీకి రోజూ 2 కోట్లకుపైగా ఆదాయం వస్తుంది. బ్యాంకుల్లో వేల కోట్ల డిపాజిట్లు ఉన్నాయి. టీటీడీ పరిధిలో అనేక ట్రస్టులు కూడా ఉన్నాయి. ఒక్క నిత్యాన్నదాన ట్రస్టుకే 1300 కోట్ల రూపాయలకుపైగా డిపాజిట్లు ఉన్నాయి. వెరసి... నిధులతో పుష్కలంగా కళకళలాడుతున్న తిరుమల ఆలయ నిధులే ప్రధాన లక్ష్యంగా ఏపీఎస్ఎఫ్ఎస్ కార్పొరేషన్ లిమిటెడ్ ఏర్పాటవుతోందనే అనుమానాలు తలెత్తుతున్నాయి. యూనివర్సిటీలు, వాటి పరిధిలోని సంస్థల సొమ్మును ఏపీఎస్ఎఫ్ఎస్కు మళ్లించే అవకాశం కల్పించారు.



> **ఎవరి సొమ్ముతో సోకులు?**
>
> నిబంధనల ప్రకారం తిరుమల వెంకన్న సొమ్ముతోపాటు, ఇతర దేవాలయాలకు భక్తులు, దాతల నుంచి వచ్చే సొమ్మును దారి మళ్లించడానికి వీల్లేదు. 'ప్రొఫెషనల్ మేనేజ్మెంట్' పేరిట ఇప్పుడు ఎస్ఎఫ్ఎస్కు తరలించే అవకాశముంది. నిజానికి... టీటీడీ తన నిధులను బలమైన కార్పొరేట్ సంస్థలతో సమానంగా జాగ్రత్త చేసుకుంటుంది. టీటీడీలో అత్యున్నత అర్హతలు, అనుభవం ఉన్న ఆర్థిక నిపుణుడి పర్యవేక్షణలో ఆర్థిక నిర్వహణ జరుగుతుంది. ఆర్థిక నిర్వహణలో అత్యంత జాగ్రత్తలు తీసుకుంటుంది. మరి... కొత్తగా ఏపీఎస్ఎఫ్ఎస్ చేయబోయే 'ప్రొఫెషనల్ మేనేజ్మెంట్' ఏమిటో? ఎలా ఉంటుందో?

### పబ్బం గడుపుకొనేందుకేనా?

టీటీడీతో సహా ఇతర సంస్థలన్నీ సొంతంగానే తమ నిధులను నిర్వహించుకుంటున్నాయి. మిగులు నిధులను ప్రభుత్వరంగ, లేదా ప్రైవేటు బ్యాంకుల్లో డిపాజిట్ చేస్తున్నాయి. మరోవైపేమో... రోజువారీ అవసరాల కోసం సర్కారు అప్పుల కోసం అటూ ఇటూ తిరుగుతోంది. ఈ నేపథ్యంలో... ఆయా సంస్థల సొమ్మును సేకరించేందుకే ఏపీఎస్ఎఫ్ఎస్ అనే కంపెనీని సృష్టించినట్లు భావిస్తున్నారు. ముందుగా ఆయా సంస్థల చేత ఏపీఎస్ఎఫ్ఎస్లో పెట్టుబడులు పెట్టిస్తారు. వీటి నిర్వహణకోసం 'తగినంత సమయం' తీసుకుంటారు. ఆలోపు సొంత అవసరాలకోసం నిధులు వాడుకోవచ్చు. సింపుల్గా చెప్పాలంటే... ప్రతినెలా మొదటివారంలో పడుతున్న అప్పుల తిప్పలను చాలా వరకు తగ్గించుకోవచ్చు. అంతేకాదు... సొమ్ములను డిపాజిట్ చేసే పేరిట బ్యాంకులనూ దారిలోకి తెచ్చుకోవచ్చు.

### ఎంత సృజనాత్మకతో...

ఆయా విభాగాల నుంచి జమ అయిన సొమ్ముతో ఏపీఎస్ఎఫ్ఎస్ ఫండ్ మేనేజ్మెంట్ చేస్తుంది. ఈ కంపెనీ అద్భుతమైన, సృజనాత్మకతతో కూడిన ఆర్థిక విధానాలను అవలంబిస్తుందని జీవోలో పేర్కొన్నారు. ఎస్ఎఫ్ఎస్లో జమ అయ్యే సొమ్మును అధిక వడ్డీలకు ఇస్తామని... బిడ్డింగ్ ద్వారా ఏ బ్యాంకు ఎక్కువ వడ్డీ ఇస్తే, ఆ బ్యాంకులోనే డిపాజిట్ చేస్తామని చెప్పారు. వడ్డీ రూపంలో వచ్చే సొమ్ము ఎస్ఎఫ్ఎస్ ఖాతాలో జమ అవుతుంది. ఆ వడ్డీని ఆయా సంస్థలకు ఇస్తారా? లేదా? అన్నది జీఓలో పేర్కొనలేదు. భారీ లాభాలను అన్వేషించే ప్రయత్నంలో షేర్మార్కెట్లోనూ పెట్టుబడులు పెట్టనున్నారు. జాతీయ, అంతర్జాతీయ మార్కెట్లలో పెట్టుబడులు పెట్టి నిధులను పెంచుకోవాలన్న అంశాన్ని చేర్చారు. అవసరాన్ని బట్టి ఎస్ఎఫ్ఎస్ను షేర్మార్కెట్లో రిజిస్టర్ చేసి ఐపీఓకు వెళ్లాలన్న అంశాన్ని కూడా అందులో పేర్కొన్నారు.

## తాడోపేడో తేల్చుకోవాలి

(మూడో పేజీ తరువాయి)

రావాలని సూచించారు. తాము అన్ని విధాలా అండగా ఉంటామని భరోసా ఇచ్చారు. ఎన్నికలకు సన్నద్ధతపై శనివారం మంగళగిరిలోని టీడీపీ కేంద్ర కార్యాలయం నుంచి పార్టీ నేతలతో టెలికాన్ఫరెన్స్ నిర్వహించారు. అనంతరం ఆయన మీడియాతో మాట్లాడారు. 'ఆ రోజు ఒక్క చాన్స్ అంటే ఓటేశారు. ఏం జరిగిందో ప్రజలు చూశారు. వైసీపీకి పట్టరాని గర్వం వచ్చింది. ఇప్పుడు ఏం చూసి ఓటెయ్యాలి? 10నెలల పాలనలో అభివృద్ధి కోసం ఒక్క రూపాయీ ఖర్చుచేయలేదు. ఇసుక ధర నాలుగురెట్లు పెంచి కార్మికుల పొట్టకొట్టారు. ఏం చేసినా అడ్డుకునేవారు లేరన్న ధోరణితో వెళ్తున్నారు. ఈ స్థానిక ఎన్నికల్లో ఓటుతో దానికి చెక్ చెప్పాలి' అని ప్రజలకు సూచించారు. ఎన్నికల్లో మద్యం, డబ్బు పంపిణీ చేస్తే మూడేళ్ల జైలు, ఎన్నికల్లో పోటీచేయకుండా అనర్హత విధించే నిబంధనలు తేవడంపై చంద్రబాబు ఆగ్రహం వ్యక్తం చేశారు. ప్రతిపక్ష అభ్యర్థులను ఇబ్బందిపెట్టేందుకే ఇలాంటివి చేస్తున్నారని, వీటిని చూస్తూ ఊరుకోబోమని, తాడోపేడో తేల్చుకుంటామన్నారు. తాము కూడా పార్టీ కేంద్ర కార్యాలయంలో ఒక కమాండ్ కంట్రోల్ రూమ్ను ప్రారంభిస్తున్నామంటూ దాని నంబరు 7995014525 అని ప్రకటించారు. అన్ని రకాలుగా అండగా ఉంటామన్నారు. అన్ని స్థానాల్లోనూ టీడీపీ తరపున పోటీచేయాలని, ఎక్కడన్నా అభ్యర్థులను బెదిరిస్తే ప్రత్యామ్నాయం చూసుకుని ముందుకెళ్లాలి తప్ప అధైర్యపడొద్దని స్థానిక నేతలకు మార్గనిర్దేశనం చేశారు.

> **యాప్కు, జగన్కు ఏం సంబంధం?**
>
> 'డబ్బు, మద్యం పంపిణీ జరగకుండా ఉండేందుకంటూసీఎం నిఘా యాప్ను ప్రారంభించారు. ఆ పనిచేసేందుకు ఆయనెవరు? ఎన్నికల వేళ ప్రభుత్వ యంత్రాంగం మొత్తం ఎన్నికల కమిషన్ చేతిలో ఉంటుంది. సీఎంకి ఏం సంబంధం? ఈయనేమన్నా సూపర్ ఎన్నికల కమిషనరా?' అని చంద్రబాబు ప్రశ్నించారు. సీఎంకి బుద్ధిలేదు... అధికారులైనా చెప్పాలి కదా! అన్నారు. ఎన్నికలప్పుడు ముఖ్యమంత్రీ ఒక రాజకీయ పార్టీకి అధ్యక్షుడే అవుతారని చంద్రబాబు అన్నారు. అంత చిత్తశుద్ధి ఉంటే ఎన్నికలు అయ్యే వరకూ మద్యాన్ని నిషేధించాలన్నారు.

### సుప్రీంకు వెళ్లలేదేమీ?

జగన్ బీసీల ద్రోహి అని, వారికి రిజర్వేషన్లు తగ్గించడం వల్ల 16,500 మంది బీసీలకు పదవులు రాకుండా చేశారని చంద్రబాబు విమర్శించారు. బీసీల రిజర్వేషన్లపై సుప్రీంకోర్టుకు ఎందుకెళ్లలేదని ప్రశ్నించారు. బీసీలకు ఇప్పటి వరకూ ఉన్న 34శాతం కూడా ఇవ్వడం లేదని, చివరకు 24శాతమే అన్నారన్నారు. అయితే ఆమాత్రం కూడా ఇవ్వడం లేదని, నెల్లూరు జిల్లాలో ఎంపీటీసీల్లో కేవలం 10.49శాతం మాత్రమే బీసీ రిజర్వేషన్లు ఇచ్చారన్నారు. ఆ జిల్లాలో 16మండలాల్లో ఒక్క ఎంపీటీసీ కూడా బీసీకి రిజర్వు చేయలేదన్నారు. ఈ జిల్లాలో 46ఎంపీపీల్లో కేవలం ఆరుమాత్రమే బీసీలకు వస్తున్నాయని, రాష్ట్రవ్యాప్తంగా పలు జిల్లాల్లో ఇదే పరిస్థితి ఉందన్నారు. ఎన్నికలకు ఇంతటి అయోమయ షెడ్యూలు ఎప్పుడూ చూడలేదని చంద్రబాబు అన్నారు. కుప్పం నియోజకవర్గంలో రామకుప్పం రిజర్వేషన్ను తొలుత ఎస్టీ అన్నారని, ఆ తర్వాత అన్రిజర్వుడు అన్నారని పేర్కొన్నారు. కనీసం బ్యాలెట్ బాక్సులు సిద్ధం చేసుకునేందుకూ సమయం లేదని, మరోవైపు మెజార్టీ స్థానాలు ఏకగ్రీవం అవుతాయని ఎన్నికల కమిషనర్ అంటున్నారని, అంటే గ్రామాల్లో ప్రజాస్వామ్యం అక్కర్లేదని భావిస్తున్నారా అని చంద్రబాబు ప్రశ్నించారు.

## ఓటమి భయంతోనే నల్ల చట్టం

- అన్ని స్థానాల్లోనూ కాంగ్రెస్ పోటీ: శైలజానాథ్

ముదిగుబ్బ(అనంతపురం), చిత్తూరు సెంట్రల్, మార్చి 7: "స్థానిక సంస్థల ఎన్నికల్లో అన్ని స్థానాల్లో కాంగ్రెస్ పోటీ చేస్తుంది. జగన్, బీజేపీ తొత్తులా వ్యవహరిస్తున్నారు. ఓటమి భయంతో వైసీపీ నల్ల చట్టాన్ని అమలు చేస్తోంది. ఇతర పార్టీల వారిని భయభ్రాంతులను చేయడానికే ప్రలోభాల మాటను అడ్డుపెట్టుకొంటున్నారు" అని పీసీసీ అధ్యక్షుడు శైలజానాథ్, కార్యనిర్వాహక అధ్యక్షుడు తులసిరెడ్డి అన్నారు. శనివారం వారు ఇరువురూ వేర్వేరు జిల్లాల్లో మీడియాతో మాట్లాడారు. గ్రామీణ ప్రాంతాలలో కాంగ్రెస్ పార్టీ బలోపేతమవుతోందని అనంతపురం జిల్లా ముదిగుబ్బలో శైలజానాథ్ అన్నారు. స్థానిక సంస్థల ఎన్నికలు జగన్నాటకమని చిత్తూరులో తులసిరెడ్డి అన్నారు. 2019 ఎన్నికల్లో పులివెందుల నియోజకవర్గంలో ఓటుకు రూ.1500, సింహాద్రిపురం వంటి గ్రామాల్లో ఓటుకు రూ.5 వేల నుంచి రూ.10 వేలు పంచిన వైసీపీ, నేడు అధికారంలోకి రాగానే స్థానిక సంస్థల ఎన్నికల్లో నల్లచట్టం తెచ్చి మద్యం, డబ్బు పంచడాన్ని అరికట్టాలనడం హాస్యాస్పదంగా ఉందన్నారు.

### ఆఘమేఘాలపై 'స్థానికం' రాజ్యాంగ విరుద్ధం

కడప(కలెక్టరేట్), మార్చి 7: "రాష్ట్ర ఎన్నికల కమిషన్ ఆఘమేఘాల మీద ఎన్నికల ప్రకటన చేయడం రాజ్యాంగ విరుద్ధం. రాష్ట్ర ప్రభుత్వం అడుగుజాడల్లో ఎన్నికల కమిషన్ నడుస్తోంది. స్థానిక సంస్థల ఎన్నికల్లో గుర్తింపు పొందిన పార్టీల అభిప్రాయాలు తీసుకోకుండా ఏకపక్షంగా ఎన్నికలు ప్రకటించడం విడ్డూరంగా ఉంది. అధికారంలో వున్న వైసీపీ 'మేము సిద్ధం' అనగానే రాష్ట్ర ఎన్నికల కమిషనర్ రమేశ్కుమార్ ప్రభుత్వంతో మిలాఖత్ అయ్యి హడావుడిగా ఎన్నికల ప్రకటన చేయడం ప్రజాస్వామ్యంలో తగదు" అని పీసీసీ చీఫ్ శైలజానాథ్ మండిపడ్డారు. కడపలోని జిల్లా కాంగ్రెస్ పార్టీ కార్యాలయంలో ఆయన మీడియాతో మాట్లాడారు.

### ప్రతిపక్షాలను బెదిరించడానికే: రామకృష్ణ

అనంతపురం, మార్చి 7(ఆంధ్రజ్యోతి): "రాష్ట్రంలో ప్రమాదకర రాజకీయ జూదానికి ముఖ్యమంత్రి జగన్మోహన్రెడ్డి తెరలేపారు. ప్రత్యర్థులు ఎన్నికల్లో పోటీ చేయకుండా ఆర్డినెన్స్తో బెదిరింపులకు పాల్పడటమే ఇందుకు నిదర్శనం. స్థానిక ఎన్నికల్లో బీసీలు 10 శాతం రిజర్వేషన్ను కోల్పోవడానికి సీఎం జగన్ కారకుడయ్యాడు" అని సీపీఐ రాష్ట్ర కార్యదర్శి రామకృష్ణ మండిపడ్డారు. శనివారం అనంతపురంలో ఆయన మీడియాతో మాట్లాడారు. రిజర్వేషన్ అంశంలో సుప్రీం కోర్టు తీర్పు వినకుండా ఏకపక్షంగా ప్రభుత్వం ముందుకు వెళ్లడం దారుణమన్నారు.

### స్థానిక రిజర్వేషన్లలో అవకతవకలు: మధు

అమరావతి, మార్చి 7(ఆంధ్రజ్యోతి): "స్థానిక సంస్థల ఎన్నికల్లో ప్రభుత్వం ఖరారు చేసిన రిజర్వేషన్లలో అవకతవకలు జరిగాయి. మా వద్ద సమాచారం ఉంది. దీనిపై రాష్ట్ర వ్యాప్తంగా పెద్ద ఎత్తున అభ్యంతరాలు వ్యక్తం అమవుతున్నాయి. కొన్ని అంశాలను ఇప్పటికే ఎలక్షన్ కమిషన్ దృష్టికి తీసుకువెళ్లాం" అని సీపీఎం రాష్ట్ర కార్యదర్శి మధు అన్నారు. గతంలో ఎన్నికల షెడ్యూల్ ప్రకటించే ముందు ప్రభుత్వాలు రిజర్వేషన్ల వివరాలను రాజకీయ పార్టీలకు అందించేవని, ఆయా పార్టీల సలహాలు, సూచనలు తీసుకునేవని చెప్పారు. కానీ వైసీపీ ప్రభుత్వం హడావుడిగా రిజర్వేషన్లు ఖరారు చేసి, షెడ్యూల్ ప్రకటించడం సరికాదన్నారు. అధికార పార్టీకి ప్రయోజనం చేకూరేలా వ్యవహరిస్తోందని అన్నారు.

### బీసీలకు 34 శాతం సీట్లు కేటాయించాలి

- మాజీ న్యాయమూర్తి జస్టిస్ ఈశ్వరయ్య

విజయవాడ సిటీ, మార్చి 7: స్థానిక సంస్థల ఎన్నికల్లో అన్ని రాజకీయ పార్టీలు బీసీలకు 34 శాతం సీట్లను కేటాయించాలని మాజీ న్యాయమూర్తి జస్టిస్ ఈశ్వరయ్య కోరారు. గాంధీనగర్లోని ఓ హోటల్లో శనివారం జరిగిన ప్రెస్మీట్లో ఆయన మాట్లాడారు. 10 శాతం రిజర్వేషన్లు తగ్గితే బీసీలకు అన్యాయం జరుగుతుందన్నారు. దేశ జనాభాలో 60 శాతం ఉన్న బీసీలకు కేవలం 30 శాతం కూడా రిజర్వేషన్లు కల్పించకపోవడం విచారకరమని చెప్పారు. స్వాతంత్ర్యం వచ్చి 70 ఏళ్లు దాటినప్పటికీ రాజ్యాంగంలో కల్పించిన ప్రాథమిక హక్కుల్లో కూడా సమానత్వం రాకుండా వివక్ష కొనసాగుతుందని విమర్శించారు. రాష్ట్ర ప్రభుత్వాలు రిజర్వేషన్లు అమలు చేస్తున్నప్పటికీ కేంద్ర ప్రభుత్వాలు అమలు చేయడం లేదని ఆక్షేపించారు.



## మహిళా దినోత్సవం..

ఆడదే ఆధారం.. మన కథ ఆడదే ఆరంభం..
అన్నాడో కవి. అంతటి మహోన్నతమైన
మహిళకు మనమిస్తున్న గౌరవమెంత?
కనీసం అంతర్జాతీయ మహిళా దినోత్సవం
రోజైనా సాంత్వన ఇస్తున్నామా? వారి గురించి
ఉత్సవాలు చేస్తున్న రోజున కూడా
శ్రామిక జీవనంలో మగ్గిపోతున్న అబలలు
ఎందరో! కన్నీటి సంద్రాలవుతున్న బతుకులెన్నో..
వారందరి ఆవేదన ఏ నాటికి తీరేనో!?..

'ఓ మహిళా నీకు హ్యాట్సాఫ్'




## సౌదీ నేత ఎంబీఎస్ కొరడా!

▸▸ కుట్ర నెపంతో చిన్నాన్న, ఇద్దరు బావలకు చెరసాల

రియాద్, మార్చి 7: సౌదీ అరేబియా రాజకుటుంబంలో మరో అంతర్గత అధికార పోరాటం చోటుచేసుకుంది. రాజు సల్మాన్‌ను ఓ బొమ్మలా ఉంచి తానే సర్వమై చక్రం తిప్పుతున్న సిసలైన అధినేత మొహమ్మద్ బిన్ సల్మాన్ (ఎంబీఎస్) మరోసారి చెలరేగిపోయారు. రాజుకు వ్యతిరేకంగా కుట్ర పన్నారన్న నెపం పెట్టి తనకు పోటీగా ఉండే ముగ్గురు వారసులను బందీ చేయించారు. రాయల్ గార్డ్స్‌కు చెందిన సాయుధ జవాన్లు తెల్లారుఝామునే విరుచుకుపడి కింగ్ సల్మాన్ సోదరుడు ప్రిన్స్ అహ్మద్ బిన్ అబ్దులాజీజ్ అల్ సౌద్, రాజుకు మేనల్లుడైన ప్రిన్స్ మొహమ్మద్ బిన్ నయీఫ్, ఈయనకు సోదరుడైన ప్రిన్స్ నవాఫ్ బిన్ నయెఫ్‌లను వారి వారి నివాసాల నుంచి తీసికెళ్లి చెరసాలలో పడేశారు. ఎంబీఎస్ చేస్తున్న ఆరోపణేంటంటే... వీరు ముగ్గురూ రాజును, తనను పదవీచ్యుతులను చేయడానికి కుట్ర పన్నారన్నది! నిజానికి అంత పరిస్థితి లేదని, మొత్తం వ్యవస్థ అంతా ఎంబీఎస్ గుప్పిట్లోనే ఉందని, వారు నిమిత్తమాత్రులేనని వార్తా కథనాలు వెల్లడిస్తున్నాయి. తనకు విరోధులెవరూ లేకుండా, మొత్తం తన కంట్రోల్‌లోనే దేశం ఉండేట్లుగా ఎంబీఎస్ చూసుకుంటున్నారని, వారసుల నుంచి ఎలాంటి ప్రతిఘటనలూ, సవాళ్లూ రాకుండా ముందే వారిని బందీ చేసి పడేశారని తెలుస్తోంది. రక్షణ రంగం నుంచి ఆర్థికం దాకా ప్రతీ వ్యవస్థనూ తన అదుపాజ్ఞల్లో పెట్టుకున్న ఎంబీఎస్- ఇప్పటికే అనేకమంది ఇస్లామిక్ మతగురువులను, ముల్లాలను, చాందసవాద వర్గాల వారిని జైలుపాల్జేశారు. గతంలో రెండుమార్లు తనకున్న అనేకమంది సోదరులను నయానో భయానో లొంగదీసుకుని దేశం విడిచి పోయేట్లు చేశారు.




# ఆమె కన్నీటి వెనుక..

## 2018లో దుబాయ్ యువరాణి కిడ్నాప్‌కు భారత నౌకాదళం సాయం

*ఆ రోజు.. 2018, మార్చి 4.*
*సమయం.. సాయంత్రం!*
*స్థలం.. గోవాకు 30 కిలోమీటర్ల దూరంలోని అంతర్జాతీయ సముద్రజలాలు!!*

అనంతంగా కనిపిస్తున్న ఆ నీలిసాగరంలో.. అమెరికా జెండా ఉన్న ఒక యాట్ (విలాసవంతమైన నౌక).. భారత్‌వైపునకు ప్రయాణిస్తోంది! ఆ నౌకకు కెప్టెన్ ఒక మాజీ గూఢచారి. అందులో ఉన్నది.. దుబాయ్ యువరాణి.. ఆ దేశ రాజు షేక్ మహ్మద్ బిన్ రషీద్ అల్ మక్తూమ్ కుమార్తె.. లతీఫా! కెపోయిరా అనే యుద్ధ విద్యలో ఆమెకు శిక్షణనివ్వడానికి ఆమె తండ్రే నియమించిన టీనా అనే శిక్షకురాలు!! పుట్టిన గడ్డను.. అంతులేని సంపదను.. వదిలేసి స్వేచ్ఛను వెతుక్కుంటూ బయల్దేరిన బహుదూరపు బాటసారి. భారత్ మజిలీ మాత్రమే. ఆమె లక్ష్యం అమెరికాకు చేరుకోవడం. కన్నతండ్రి నుంచి దూరంగా వెళ్లిపోవడానికి పదిరోజులుగా కొనసాగిస్తున్న పరుగును.. మరికొన్ని గంటల్లో భారత్‌కు చేరుకోవడం ద్వారా తాత్కాలికంగా ఆపాలన్నది ఆమె ఆలోచన. కానీ.. ఆమె ఆశలన్నీ అడియాసలు చేసే సంఘటన జరిగిందా రోజు. ఏ భారత ప్రభుత్వ సాయాన్ని కోరాలని ఆమె భావించిందో.. అదే భారత ప్రభుత్వానికి చెందిన తీరరక్షక దళాలు ఆమె ప్రయాణిస్తున్న యాట్‌ను చుట్టుముట్టాయి. రెండు బోట్లు, రెండు హెలికాప్టర్లు వారిని వెంబడించటం మొదలుపెట్టాయి. "పొగ బాంబులు విసురుతూ.. గాలిలో కాల్పులు జరుపుతూ వారు యాట్‌లోకి ప్రవేశించారు. నన్ను, లతీఫాను చేతులు విరిచి కట్టి నేల మీద పడుక్కొపెట్టారు. 'లతీఫా ఎవరు?' అని గట్టిగా అరవటం మొదలుపెట్టారు. ఈ లోపులో ఒక అరబ్ వ్యక్తి యాట్‌లోకి వచ్చి లతీఫాను గుర్తుపట్టాడు. తాను ఆశ్రయం కోరుతున్నానని.. అంతర్జాతీయ జలాల్లో ఈ తరహా చర్యలు తప్పని లతీఫా గట్టిగా అరుస్తున్నా ఎవరూ పట్టించుకోలేదు. నన్ను వెనక్కి తీసుకువెళ్లద్దు.. ఇక్కడే కాల్చి చంపేయండి.. అని లతీఫా గట్టిగా అరుస్తూనే ఉంది" అని టీనా ఆ తర్వాత కోర్టుకు ఇచ్చిన వాంగ్మూలంలో పేర్కొన్నారు. దుబాయ్ అధికారులకు అప్పగించవద్దని లతీఫా ఎంతగా వేడుకున్నా వారు కరగలేదు. పెద్దగా అరుస్తూ కొడుతూ లతీఫాను ఎమిరేటీ అధికారికి అప్పగించారు. ఆ తర్వాత.. యువరాణి లతీఫా ఏమైందో తెలియదు.

### 2018 ఫిబ్రవరి 24న..

2018 ఫిబ్రవరి 24. ప్రణాళిక ప్రకారం ఆ రోజు దుబాయ్‌లోని ఒక కేఫ్ వద్దకు చేరుకున్న లతీఫా.. నేరుగా అక్కడున్న బాత్‌రూమ్‌లోకి వెళ్లింది. తన మొబైల్‌ఫోన్ స్విచ్ ఆఫ్ చేసి అక్కడే డస్ట్‌బిన్‌లో పడేసింది. తన దుస్తులు మార్చుకుంది. తనకు కెపోయిరా యుద్ధ కళ నేర్పే శిక్షకురాలు టీనా జౌహియానెన్‌తో కలిసి వెనక దారి నుంచి బయటపడి కారులో మస్కట్‌కు లతీఫా చేరుకుంది. అక్కడ చిన్న పడవ ఎక్కి అంతర్జాతీయ జలాల్లోకి ప్రవేశించారు. అక్కడ.. ఎస్కేప్ ఫ్రం దుబాయ్ పుస్తకం రాసిన ఫ్రెంచ్ గూఢచారి జౌబెర్ట్ నౌకతో సిద్ధంగా ఉన్నాడు. యూఎస్ జెండా ఉన్న ఆ యాట్ పేరు నోస్ట్రోమో. దానిలో వారు భారత్ వైపుగా ప్రయాణించారు.కానీ భారత్ చేరనే లేదు!

ఎప్పుడో రెండేళ్ల క్రితం జరిగిన ఈ ఘటనలన్నీ మళ్లీ ఇప్పుడు ఎందుకు చర్చనీయాంశం అయ్యాయి? అంటే.. లతీఫాను దుబాయ్‌కి అప్పగించడంలో సహకరించింది భారతీయ నౌకాదళమేనంటూ లండన్ హైకోర్టు ఒక కేసులో ఇచ్చిన తీర్పే ఇందుకు కారణం. అది కూడా దుబాయ్ రాజుతో సంబంధం ఉన్న కేసే. ఆయన మాజీ (ఆరో) భార్య.. హయాబింత్ అల్ హుస్సేన్ తన పిల్లలను బ్రిటన్‌లో తనవద్దే ఉంచాలని కోరుతూ లండన్ కోర్టులో కేసు వేశారు. పిల్లల తండ్రి క్రూరత్వం గురించి తెలిపేందుకు ఆమె లతీఫా ఉదంతాన్ని, అంతకుముందు కూడా ఇలాగే షేక్‌మహ్మద్ ఆంక్షల చెర నుంచి తప్పించుకోజూసిన మరో కూతురు షంసా గురించి కోర్టుకు తెలిపారు. ఆధారాలన్నీ పరిశీలించిన న్యాయమూర్తి తన తీర్పులో దుబాయ్ రాజు పలుకుబడిని ప్రస్తావిస్తూ.. భారత్ ఆయనకు సహకరించడం, లతీఫాను అప్పగించడమే ఇందుకు నిదర్శనమన్నారు.

ఇంతకీ ఆ రోజు ఎందుకలా జరిగింది? ఆపదలో ఉన్న మహిళను భారత ప్రభుత్వం అంత కర్కశంగా ఎందుకు దుబాయ్‌కి అప్పగించింది? అంటే.. అగస్టా వెస్ట్‌ల్యాండ్ కేసులో నిందితుడు క్రిస్టియన్ మైకేల్‌ను అప్పగించే షరతుపై భారత భద్రతా సలహాదారు అజిత్‌దోవల్ ఆధ్వర్యంలో ఈ ఆపరేషన్ జరిగిందని అప్పట్లో దుబాయ్ పత్రికలు ఊహాగానాలు చేశాయి. **- స్పెషల్ డెస్క్**

## 12కు చేరిన కరోనా అనుమానితులు!

▸▸ శనివారం వచ్చిన 3 రిపోర్టులూ నెగెటివ్

▸▸ తిరుపతి, విశాఖ, నెల్లూరు, పశ్చిమలో అనుమానితులు

▸▸ స్విమ్స్‌లో ప్రారంభమైన 'కరోనా' నిర్ధారణ పరీక్షలు

అమరావతి, తిరుపతి (వైద్యం), విశాఖపట్నం, మార్చి 7: రాష్ట్రంలో కరోనా వైరస్ అనుమానితుల సంఖ్య 12కు చేరింది. మొన్నటి వరకు ఉన్న 13 మంది అనుమానితుల్లో 12 మందికి నెగెటివ్ వచ్చింది. మిగిలిన ఒక కేసుకు సంబంధించిన రిపోర్టు రావాల్సి ఉంది. ఇదిలా ఉంటే శనివారం విశాఖ, తిరుపతిలో రెండేసి అనుమానిత కేసులు నమోదయ్యాయి. వీటితో పాటు నెల్లూరులో నాలుగు, గోదావరి జిల్లాల్లో రెండు అనుమానిత కేసులు నమోదయ్యాయి. మొత్తంగా 12 మంది అనుమానితుల నుంచి రక్తనమూనాలు సేకరించి ల్యాబ్‌కు పంపించారు. మరోవైపు భీమవరానికి చెందిన ఓ వ్యక్తి ఇటీవలే విదేశాల నుంచి ఏపీకి వచ్చారు. తీవ్ర అనారోగ్యంతో ఉండగా, విజయవాడలోని ఐసోలేషన్ వార్డులో ఉంచి చికిత్స అందిస్తున్నారు. కాగా, తిరుపతి స్విమ్స్ ఆస్పత్రిలోని వీఆర్‌డీఎల్ ల్యాబ్‌లో కరోనా నిర్ధారణ పరీక్షలు ప్రారంభమయ్యాయి. శనివారం తొలిరోజు ఇద్దరు అనుమానితులకు నిర్వహించిన పరీక్షలు నెగెటివ్ వచ్చాయి. మూడు రోజుల క్రితం దుబాయ్ నుంచి వచ్చిన కడప వాసి, నెదర్లాండ్స్ నుంచి వచ్చిన తిరుపతి వాసి కరోనా వైరస్ లక్షణాలతో శుక్రవారం రాత్రి స్వచ్ఛందంగా రుయా ఆస్పత్రికి వచ్చారు. ఆ ఇద్దరినీ పరీక్షించిన వైద్యులు, వెంటనే ఐసొలేషన్ వార్డుకు తరలించారు. బ్లడ్ శాంపిల్స్ తీసి స్విమ్స్ వీఆర్‌డీఎల్ ల్యాబ్‌కు పంపగా రిపోర్టు నెగెటివ్ వచ్చింది. కాగా, శనివారం సాయంత్రం 4 గంటల ప్రాంతంలో మరో రెండు అనుమానిత కేసులు రావడంతో వైద్యులు మరోసారి అప్రమత్తమయ్యారు. సింగపూర్ నుంచి వచ్చిన 45 సంవత్సరాల మహిళ, జర్మనీ నుంచి వచ్చిన 34 సంవత్సరాల వ్యక్తి.. ఇద్దరూ రుయాకు వచ్చారు. వారిని ఐసోలేషన్ వార్డులో అడ్మిట్ చేశారు. అలాగే, విశాఖ నగరానికి చెందిన వైద్య దంపతులు ఈనెల ఒకటో తేదీన సింగపూర్ వెళ్లి శనివారం ఉదయం విశాఖ విమానాశ్రయానికి చేరుకున్నారు. అయితే వైద్యుని భార్య దగ్గు, జలుబుతో బాధపడుతుండడంతో ఈ విషయాన్ని ఎయిర్‌పోర్టులో స్క్రీనింగ్ బృందానికి తెలియజేశారు. వెంటనే అప్రమత్తమైన ఎయిర్‌పోర్టు సిబ్బంది.. ఇరువురినీ ఛాతీ, అంటువ్యాధుల ఆసుపత్రికి తరలించారు. శనివారం సాయంత్రం ఇద్దరి నుంచి నమూనాలను సేకరించి హైదరాబాద్‌లోని గాంధీ ఆస్పత్రికి పంపించారు. విశాఖలో మొత్తం ఏడు అనుమానిత కేసులు కాగా, ఐదు కేసుల్లో ఫలితాలు నెగెటివ్‌గా వచ్చిన విషయం తెలిసిందే. కాగా స్విమ్స్‌లోని వైరల్ రీసెర్చ్ డయాగ్నొస్టిక్ లేబరేటరీని కరోనా నిర్ధారణ పరీక్షలకు నోడల్ కేంద్రంగా రాష్ట్ర ప్రభుత్వం గుర్తించడంతో పుణెలోని వైరాలజీ ల్యాబ్‌నుంచి కరోనా టెస్టింగ్ కిట్స్ శనివారమే ఇక్కడికి అందాయి.

## రాజ్‌భవన్‌లో హోలీ సంబరాలు రద్దు

అమరావతి, మార్చి 7(ఆంధ్రజ్యోతి): కరోనా వైరస్ ఆందోళనల నేపథ్యంలో ముందు జాగ్రత్త చర్యల్లో భాగంగా... ఈ ఏడాది రాజ్‌భవన్‌లో హోలీ సంబరాలను రద్దు చేస్తున్నట్లు రాష్ట్ర గవర్నర్ కార్యాలయం తెలిపింది. ఈ నెల 10న హోలీ పండుగ. అయితే కరోనా నివారణ చర్యల్లో భాగంగా సామూహిక కార్యక్రమాలకు స్వస్తి పలుకుతూ ఈ నిర్ణయం తీసుకున్నట్లు శనివారం ఒక ప్రకటనలో తెలిపింది. మరోవైపు ఆదివారం అంతర్జాతీయ మహిళా దినోత్సవం సందర్భంగా గవర్నర్ విశ్వభూషణ్ హరిచందన్ శుభాకాంక్షలు తెలిపారు.

## రేపు విజయవాడలో రాష్ట్రస్థాయి శిక్షణ

అమరావతి, మార్చి 7(ఆంధ్రజ్యోతి): కరోనా వైరస్ నియంత్రణలో నిర్లక్ష్యం వహిస్తే చర్యలు తప్పవని కుటుంబ సంక్షేమశాఖ ఇన్‌చార్జి కమిషనర్ వి.విజయరామరాజు హెచ్చరించారు. ఈనెల 9న విజయవాడలో రాష్ట్రస్థాయి శిక్షణ కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నట్లు చెప్పారు. 13 జిల్లాల డీఎంహెచ్‌వోలు, సర్వేలెన్స్ అధికారులు, నోడల్ అధికారులతో శనివారం విజయవాడలో నిర్వహించిన వీడియో కాన్ఫరెన్స్‌లో ఆయన మాట్లాడుతూ రాష్ట్రంలో కరోనా కేసులు నమోదు కాకపోవడం శుభపరిణామంగా పేర్కొన్నారు. గతంలో జరిగిన తప్పులు పునరావృతం కాకూడదని, క్షేత్రస్థాయిలో అప్రమత్తంగా వ్యవహరించాలని సూచించారు. కరోనా కట్టడిలో రాష్ట్ర ప్రభుత్వం జారీచేసిన మార్గదర్శకాలు తప్పనిసరిగా పాటించాలని ఆదేశించారు. 108 అంబులెన్స్‌ల నిర్వహణ, ర్యాపిడ్ రెస్పాన్స్ టీమ్(ఆర్ఆర్‌టీ), బయోమెడికల్ వేస్ట్ మేనేజ్‌మెంట్, పారిశుద్ధ్య నిర్వహణ, అంబులెన్స్ డ్రైవర్లు, ఈఎంటీలకు శిక్షణపై తీరుపై ఆయన ఆరాతీశారు. రోగులను ఆర్ఆర్‌టీ ఆధ్వర్యంలోనే ఐసోలేషన్ వార్డుకు తీసుకువెళ్లాలని, నమూనాలు తీసుకున్న వెంటనే రాష్ట్రస్థాయి కమాండ్ కంట్రోల్ సెంటర్‌కు సమాచారం అందించాలని పేర్కొన్నారు. రిపోర్టు నెగెటివ్ వచ్చినా కూడా అశ్రద్ధ వహించవద్దని, డిశ్చార్జ్ చేసే సమయంలోనూ తాము సూచించిన మార్గదర్శకాలను తప్పక పాటించాలన్నారు. సమావేశంలో డీహెచ్ అరుణకుమారి, డీఎంఈ వెంకటేశ్, ఏపీవీవీపీ కమిషనర్ రామకృష్ణ, ఎన్‌హెచ్ఎం ఎస్‌పీఎం అప్పారావు, అధికారులు పాల్గొన్నారు.

## చైనా నౌకకు విశాఖ పోర్టులోకి అనుమతి

▸▸ ఇబ్బంది లేదని ఆరోగ్య వర్గాల స్పష్టీకరణ

విశాఖపట్నం, మార్చి 7 (ఆంధ్రజ్యోతి): చైనా నుంచి పెట్ కోక్‌తో విశాఖపట్నం పోర్టుకు వచ్చిన కార్గో నౌక 'ఫార్చ్యూన్ హీరో'కు శనివారం సాయంత్రం 4.50 గంటలకు క్లియరెన్స్ ఇచ్చారు. పోర్టు ఆరోగ్య విభాగం అధికారులు నౌకలోకి వెళ్లి అందులోని 22 మంది క్రూ సిబ్బందికి అన్ని రకాల పరీక్షలు నిర్వహించారు. ఆరోగ్యపరంగా వారికి ఎలాంటి సమస్యా లేదని నిర్ధారించుకున్నాక ఇన్నర్ హార్బరులోకి అనుమతించారు. పైలట్లు మూడు అరలు కలిగిన ఎన్ 95 మాస్కులు ధరించాలని, నౌకలో సరకు దిగుమతి చేసేటపుడు తప్పనిసరిగా ప్రతి ఒక్కరూ గ్లౌజులు వినియోగించాలని సూచించామని పోర్టు వర్గాలు తెలిపాయి. విదేశీ నౌకల్లోకి రాకపోకలు వీలైనంత మేర తగ్గించేందుకు చర్యలు చేపట్టినట్లు పేర్కొన్నాయి.

## కరోనా ఔషధ రేసులో ఐఐసీటీ!

▸▸ 15 మంది శాస్త్రవేత్తలతో పరిశోధక బృందం

▸▸ 4 నెలల్లో అందుబాటులోకి మాలిక్యూల్

'ఆంధ్రజ్యోతి'కి ఐఐసీటీ డైరెక్టర్ ప్రత్యేక ఇంటర్వ్యూ



డాక్టర్ చంద్రశేఖర్

ప్రపంచాన్ని వణికిస్తున్న కరోనా వైరస్‌కు మందును కనుగొనేందుకు మన దేశం ముమ్మర ప్రయత్నాలు చేస్తోంది. వైరస్‌కు విరుగుడుగా పనిచేసే మాలిక్యూల్‌ను అభివృద్ధి చేయడంపై హైదరాబాద్‌లోని ఇండియన్ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ కెమికల్ టెక్నాలజీ(ఐఐసీటీ) ప్రత్యేక దృష్టిసారించింది. దీనిపై ఐఐసీటీ డైరెక్టర్ డాక్టర్ చంద్రశేఖర్ 'ఆంధ్రజ్యోతి'కి ప్రత్యేక ఇంటర్వ్యూ ఇచ్చారు. వివరాలివీ..

ఆంధ్రజ్యోతి ఇంటర్వ్యూ

### కరోనా వైరస్ ఎంత ప్రమాదకరమైంది?

పరిణామక్రమంలో రకరకాల వైరస్‌లు పుడుతూ ఉంటాయి. క్రమేపీ వాటి ప్రభావం తగ్గిపోతూ ఉంటుంది. గతంలోనూ ఆంథ్రాక్స్, సార్స్ ఇలా రకరకాల విపత్తులు వచ్చాయి, తగ్గిపోయాయి. కరోనా కూడా ఇలాంటిదే! నా ఉద్దేశంలో దీని ప్రభావం తగ్గుతూ వస్తోంది. అదే సమయంలో మనకు దీనిని ఎదుర్కొనే శక్తి కూడా పెరుగుతోంది. జాగ్రత్తగా గమనిస్తే ఇరాన్, ఇటలీ వంటి దేశాల్లో కరోనా సోకిన వారి సంఖ్య తగ్గుతూ వస్తోంది.

### కరోనాకు విరుగుడు కనిపెట్టడానికి ఐఐసీటీ ఎలాంటి పరిశోధనలు చేస్తోంది?

కరోనాను అడ్డుకునే ఒక మాలిక్యూల్ అభివృద్ధికి ప్రయత్నాలు మొదలుపెట్టాం. మాలిక్యూల్ అభివృద్ధికి 15 మంది ఐఐసీటీ శాస్త్రవేత్తలతో బృందాన్ని ఏర్పాటుచేశాం. వీరు యుద్ధ ప్రాతిపదికన పరిశోధనలు జరుపుతున్నారు. ఈ మాలిక్యూల్ అభివృద్ధికి 3 నుంచి 4 నెలల వరకూ పడుతుంది. అప్పటికి 10 గ్రాముల కాంపౌండ్‌ను తయారుచేయగలుగుతాం. దాని ఆధారంగా కంపెనీలు మందులు తయారుచేసుకోవచ్చు. ఈలోపు వైరస్ వ్యాప్తి సహజంగానే తగ్గిపోతే మందు అవసరమే ఉండదు.

### ఈ తరహా ఔషధాల అభివృద్ధిలో ఐఐసీటీకి ఎలాంటి అనుభవం ఉంది?

కొత్త తరహా మాలిక్యూల్స్‌ను అభివృద్ధి చేయడంలో ఐఐసీటీకి విశేష అనుభవం ఉంది. ఐఐసీటీ శాస్త్రవేత్తలు 1987లో ఎయిడ్స్‌కు మాలిక్యూల్‌ను అభివృద్ధి చేశారు. ఆ మాలిక్యూల్ ఆధారంగా సిప్లా కంపెనీ ఔషధాన్ని తయారుచేసింది. ఆ సమయంలో ఎయిడ్స్ మందుల ధర చాలా ఎక్కువగా ఉండేది. కానీ సిప్లా కంపెనీ ఆ మందును చౌకగా ఆఫ్రికా ఖండంలో విక్రయించడంతో చాలా మేలు జరిగింది. ఇలా సమాజానికి కావాల్సిన మందుల తయారీలో ఐఐసీటీ ఎప్పుడూ ముందే ఉంది. ఇక్కడ మరో విషయం కూడా చెప్పాలి. ఒకసారి మాలిక్యూల్‌ను తయారుచేసిన తర్వాత దానిని ఏ ఒక్క కంపెనీకో ఇవ్వం. ఫలితంగా మందుల ధరలు తక్కువగా ఉంటాయి.

### ప్రపంచవ్యాప్తంగా కరోనా ఔషధ తయారీ ప్రయత్నాలు ఎలా జరుగుతున్నాయి?

చైనాలో గైలీడ్ సైన్సెస్ అనే ఫార్మా కంపెనీ ఎబోలా వ్యాధి చికిత్సలో వాడే యాంటీవైరల్ ఔషధం రెండెసివిర్‌ను కరోనా కట్టడికి కూడా వాడవచ్చని ప్రకటించింది. దానితో ప్రయోగపరీక్షలను ప్రారంభించింది. ఫలితాలు సానుకూలంగా వస్తే దాన్ని మార్కెట్‌లోకి విడుదల చేసే అవకాశం ఉంది. కరోనాకు ఔషధ తయారీపై ఇప్పటికే చైనాలో దాదాపు వెయ్యికి పైగా పేటెంట్లు నమోదయ్యాయి. వాటిలో అభివృద్ధి, ప్రయోగ పరీక్షల దశలను దాటి తయారీ దశకు చేరేవి తక్కువ.

**- స్పెషల్ డెస్క్**

# కరోనాపై వదంతులు నమ్మొద్దు

## వైద్యుల సలహాలు పాటించండి.. నమస్కారమే ముద్దు.. 'జన ఔషధీ దివస్'లో మోదీ

న్యూఢిల్లీ, మార్చి 7: కరోనాపై వదంతులను నమ్మొద్దని ప్రధాని మోదీ ప్రజలకు పిలుపునిచ్చారు. వైద్యుల సలహాలను పాటించాలని స్పష్టం చేశారు. మన సంప్రదాయంలో భాగమైన 'నమస్కారాన్ని' మళ్లీ ప్రారంభించాలని చెప్పారు. జన ఔషధీ దివస్ సందర్భంగా శనివారం ఆయన కొందరు జన ఔషధీ కేంద్రాల యజమానులు, 'ప్రధానమంత్రి భారతీయ జన ఔషధి పరియోజన (పీఎంబీజేపీ)' లబ్ధిదారులతో వీడియో కాన్ఫరెన్సులో మాట్లాడారు. "ఇటీవల వదంతులు వేగంగా వ్యాపిస్తున్నాయి. కొందరు ఇది తినొద్దు అంటారు. మరికొందరేమో ఫలానాది తింటే కరోనా రాదంటారు. వదంతులు నమ్మవద్దు. ఎవరికివారు వైద్యులు అయిపోవద్దు" అని ప్రధాని పేర్కొన్నారు. ఇప్పుడు ప్రపంచంతా 'నమస్తే'ను అలవాటు చేసుకుంటోందన్నారు. కరచాలనాన్ని ఆపి.. 'నమస్తే'ను మళ్లీ మొదలుపెట్టడానికి ఇదే సరైన సమయమని చెప్పారు. "జన ఔషధీ దివస్ అంటే కేవలం ఒక పథకాన్ని వేడుక చేసుకునే రోజు కాదు. కోట్లాది మంది భారతీయులు, లక్షలాది కుటుంబాలకు భారీగా ఊరట లభించిన రోజు ఇది" అని మోదీ పేర్కొన్నారు. దేశవ్యాప్తంగా ఉన్న 6 వేలకు పైగా జన ఔషధీ కేంద్రాల వల్ల పేద ప్రజలకు రూ.2000-2500 కోట్ల మేరకు ఆదా అయిందని తెలిపారు. సాధారణ మార్కెట్‌తో పోల్చితే జన ఔషధీ కేంద్రాల్లో 50-90 శాతం తక్కువ ధరకే మందులు లభిస్తాయన్నారు. మార్కెట్‌లో రూ.6500 ఉన్న కేన్సర్ మందు జన ఔషధీ కేంద్రాల్లో రూ.850కే దొరుకుతుందని తెలిపారు. ఈ కేంద్రాలు నడిపే వ్యక్తులను ప్రోత్సహించేందుకు గాను వారికి అవార్డులు ఇస్తామన్నారు. కరోనాను ఎదుర్కొనేందుకు సర్వసన్నద్ధంగా ఉండాలని మోదీ అధికారులకు పిలుపునిచ్చారు. శనివారం ఆయన అన్ని శాఖల ఉన్నతాధికారులతో సమీక్ష నిర్వహించారు. ఒకవేళ వైరస్ వ్యాప్తి పెరిగితే చేపట్టాల్సిన చర్యలపై దిశానిర్దేశం చేశారు. క్వారంటైన్ చేయడానికి అనుకూలమైన ప్రాంతాలను గుర్తించాలని, అత్యవసర వైద్య సేవలందించేందుకు ఏర్పాట్లు చేయాలని ఆదేశించారు. ఎలాంటి పరిస్థితులనైనా సమర్థంగా ఎదుర్కొనేందుకు భారత్ సర్వసన్నద్ధంగా ఉంటుందన్నారు.



వీడియో కాన్ఫరెన్స్ సందర్భంగా ఉత్తరాఖండ్‌కు చెందిన ఓ లబ్ధిదారు మాటలకు ఎమోషన్ అయిన ప్రధాని మోదీ



### మీలో దేవుణ్ని చూశా..!

మహిళా రోగి.. భావోద్వేగం మోదీ

ప్రధానితో వీడియో కాన్ఫరెన్సులో డెహ్రాడూన్‌కు చెందిన దీపా షా మాట్లాడుతూ.. "నేను దేవుణ్ని చూడలేదు. కానీ, మీలో భగవంతుణ్ని చూశా" అని చెమ్మగిల్లిన కళ్లతో చెప్పింది. దీపా షాకు 2011లో పక్షవాతం వచ్చింది. పీఎంబీజేపీ వల్ల తన నెలవారీ మందుల ఖర్చు రూ.3500 తగ్గిందని సంతోషం వ్యక్తం చేసింది. ఇప్పుడు ప్రధాని మోదీ గొంతు విన్న తర్వాత తనకెంతో ఉత్సాహంగా ఉందని నీళ్లు నిండిన కళ్లతో చెప్పింది. ఆమె ఈ మాటలు చెబుతున్నప్పుడు మోదీ తీవ్ర భావోద్వేగానికి లోనయ్యారు. నీ ఆత్మస్థైర్యంతోనే వ్యాధిని జయించావని, నీ ధైర్యమే నీకు దేవుడని మోదీ ప్రశంసించారు.

### నారీ శక్తి అవార్డు గ్రహీతలతో నేడు మోదీ భేటీ

వారికే తన సోషల్ మీడియా ఖాతాల నిర్వహణ బాధ్యతలు

మహిళా దినోత్సవాన్ని పురస్కరించుకొని ప్రధాని మోదీ ఆదివారం నారీ శక్తి పురస్కారాలను గెలుచుకున్న వారిని తన నివాసంలో కలవనున్నారు. ప్రధాని సోషల్ మీడియా ఖాతాలను ఈ అవార్డు గ్రహీతలే నిర్వహించనున్నారు. దీనికి సంబంధించి మోదీ మంగళవారమే ట్వీట్ చేశారు. దీనికి 'షీ ఇన్‌స్పైర్స్ అజ్' అనే హ్యాష్‌ట్యాగ్ జతచేసి క్యాంపెయిన్ ప్రారంభించారు. మహిళలు ఇందులో పాల్గొని తమ విజయగాథలను అందరితో పంచుకోవాలని పిలుపునిచ్చారు. అయితే 'షీ ఇన్‌స్పైర్స్' క్యాంపెయిన్‌లో తనను చేర్చడంపై ప్రముఖ పర్యావరణ వేత్త, 8 ఏళ్ల లిసిప్రియా కంగుజామ్ ఆగ్రహం వ్యక్తం చేశారు. "ప్రియమైన మోదీ గారు... నా గళాన్ని వినిపించుకోనప్పుడు నన్ను మీ క్యాంపెయిన్‌లో భాగస్వామిని చేయకండి" అని ట్వీట్ చేశారు.

## ఇరాన్‌లో కరోనాకు మరో ఎంపీ బలి

▸▸ దేశంలో 145కు చేరిన మరణాలు

టెహ్రాన్, బీజింగ్, మార్చి 7: కరోనా ఇరాన్‌లో విజృంభిస్తోంది. గత నెలలో ఓ ఎంపీ మృతి చెందగా.. శనివారం మహిళా ఎంపీ ఫతేహ్ రహ్‌బార్ (55) వైరస్ బారినపడి చనిపోయారు. ఇప్పటికే దేశంలో ఏడుగురు నాయకులు, ఉన్నతాధికారులకు వైరస్ సోకింది. శనివారం ఒక్క రోజే 21మంది మృతి చెందడం, కొత్తగా 1,076 పాజిటివ్ కేసులు నమోదవడం పరిస్థితి తీవ్రతను చాటుతోంది. మొత్తం మరణాల సంఖ్య 145కు చేరింది. చైనాలో మరో 28మంది చనిపోయారు. గత రెండు నెలల్లో తొలిసారి కేసుల సంఖ్య రెండంకెల్లోకి(99)కి వచ్చింది. కాలిఫోర్నియా తీరంలో నిలిపివేసిన గ్రాండ్ ప్రిన్సెస్ నౌకలో 21 మందికి కరోనా పాజిటివ్ అని తేలింది. భారతీయులు సహ 150మంది ప్రయాణిస్తున్న నౌకలో 12 కరోనా కేసులు నమోదవడంతో ఈజిప్ట్‌లోని లగ్జర్ నగరం నైలు నదీ తీరంలో నిలిపివేశారు. యూఏఈలో ఓ భారతీయుడు కరోనా బారినపడ్డాడు. కరోనా ప్రభావంతో ఆస్ట్రేలియాలో 'ఎన్‌టీ న్యూస్' పత్రిక టాయ్‌లెట్ పేపర్‌గా వాడుకునేందుకు అదనంగా 8పేజీలను ముద్రించింది.

**ఇక కరోనా కాలర్‌ట్యూన్స్:** ఇకపై ఫోన్ ఎత్తగానే కరోనా వైరస్ జాగ్రత్తలు చెప్పే రింగ్‌టోన్స్ వినిపిస్తాయి. ఈ మేరకు టెలికాంశాఖ టెలిఫోన్ ఆపరేటర్లు, సర్వీస్ ప్రొవైడర్లందరికీ ఈమెయిల్ ద్వారా ఆదేశాలిచ్చింది.

## డీఎంకే నేత అన్బళగన్ కన్నుమూత

చెన్నై, మార్చి 7 (ఆంధ్రజ్యోతి): ఏడున్నర దశాబ్దాల సుదీర్ఘ రాజకీయ ప్రస్థానం సాగించిన తమిళ రాజకీయ దిగ్గజం, డీఎంకే మాజీ అధ్యక్షుడు కరుణానిధికి ఆప్తమిత్రుడు, ఆ పార్టీ ప్రధాన కార్యదర్శి కె.అన్బళగన్(98) శనివారం కన్నుమూశారు. ఆయన మృతి డీఎంకేతోపాటు తమిళనాడుకు తీరని లోటు అని అధికార అన్నాడీఎంకే సంతాపం ప్రకటించింది. అన్బళగన్ భౌతికకాయం వద్ద డీఎంకే అధ్యక్షుడు స్టాలిన్, కోశాధికారి దురైమురుగన్ కన్నీటి పర్యంతమయ్యారు.

## అతికిన చేతులు.. కలిసిన రంగులు

▸▸ చేతులు మార్పిడి చేసుకున్న యువతి చర్మం రంగులోకి

ముంబై, మార్చి 7: బస్సు ప్రమాదంలో రెండు చేతుల్నీ కోల్పోయిందా యువతి. బ్రెయిన్ డెడ్ అయిన యువకుడి చేతుల్ని వైద్యులు ఆమెకు అమర్చారు. ఈ ట్రాన్స్‌ప్లాంటేషన్ జరిగి మూడేళ్లవుతోంది. అలా అమర్చిన చేతులు క్రమంగా ఆమె చర్మం రంగులోకి మారిపోతున్నాయి. వేళ్లు కూడా సన్నబడి మృదువుగా మారుతున్నాయి. వైద్య రంగంలో ఎన్నడూ జరగని ఈ మార్పులు చూసి వైద్యులు కూడా ఆశ్చర్యపోతున్నారు. పుణెకు చెందిన విద్యార్థిని శ్రేయా సిద్ధనగౌడర్ 2016లో జరిగిన బస్సు ప్రమాదంతో తన చేతులు కోల్పోయింది. 2017లో కొచ్చిలోని అమృత ఇనిస్టిట్యూట్ ఆఫ్ మెడికల్ సైన్సెస్ వైద్యులు ఆమెకు బ్రెయిన్ డెడ్ అయిన డిగ్రీ యువకుడి చేతుల్ని అమర్చారు. ఇటీవల ఆ చేతులు ఆమె చర్మరంగులోకి మారిపోతున్నాయి. ప్రపంచవ్యాప్తంగా చేతులు మార్పిడి శస్త్రచికిత్సలు చేయించుకున్న వారెవరికీ ఇలా జరగలేదని వైద్యులు అంటున్నారు. బహుశా చర్మం రంగుని ప్రభావితం చేసే మెలానిన్ హార్మోన్ ప్రభావం వలన ఇలా జరిగి ఉంటుందని భావిస్తున్నారు.









Printed and Published by Koganti Venkata Seshagiri Rao on behalf of Aamoda Publications Pvt. Ltd., Printed and Published at Aamoda Press, Andhra Jyothi Buildings, Survey No: 70/1 & 2, Vedurupavuluru Village, Mustabad Gramapanchayathi, Gannavaram Mandal, Krishna District, PIN : 521 107, Editor : K. Srinivas, RNI No:3470/1960, Managing Director : Vemuri Radha Krishna, Founder : K.L.N. Prasad.